ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in
Published From Nizamabad
PRGI No.TELTEL/2010/33275

# ప్రజా కలం

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds
&
Public Notice
Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్
సంప్రదించండి
9010972526

గురువారం | 21-05- 2026 | సంపుటి: 17, సంచిక: 48, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆

# ఫ్యూచర్ విజన్

## పోలీస్ అధికారులతో ఎంసీఆర్ హెచ్ ఆర్ డీ బోధి పెవిలియన్‌లో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

**డ్రగ్స్ నియంత్రణ, సైబర్ క్రైమ్‌పై ప్రత్యేక చర్యలకు ఆదేశాలు**

**ప్రమోషన్ తర్వాత రెండు సంవత్సరాలు ఇతర విభాగాల్లో పని చేయాలన్న ప్రతిపాదన**

**ఫోరెన్సిక్, డేటా సెంటర్ల విస్తరణపై సమగ్ర నివేదికకు ఆదేశం**

**ఫ్యూచర్ సిటీ అభివృద్ధిపై అంతర్జాతీయ స్థాయి ప్రమాణాల లక్ష్యం**

**ఇన్వెస్ట్ తెలంగాణ, డేటా సిటీ, జీసీసీ విస్తరణపై కీలక సూచనలు**

**మౌలిక వసతులు, అగ్ని ప్రమాదాల నివారణపై సమన్వయ చర్యలకు దిశానిర్దేశం**



హైదరాబాద్, మే 20 (ప్రజాకలం) : ఎంసీఆర్ హెచ్ ఆర్ డీ బోధి పెవిలియన్‌లో రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విస్తృత సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, రాష్ట్ర భద్రతా సలహాదారు శివధర్ రెడ్డి, డీజీపీ సీవీ ఆనంద్, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, అదనపు డీజీలు, పోలీస్ కమిషనర్లు, ఐజీలు తదితరులు హాజరయ్యారు. సమావేశంలో సీఎం డ్రగ్స్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, బాధితుల కోసం ప్రత్యేక డి-అడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోలీస్ శాఖలో ఎస్ఐ స్థాయి నుంచి నాన్ క్యాడర్ ఐపీఎస్ వరకు ప్రమోషన్ పొందిన అధికారులు రెండు సంవత్సరాలు ఇతర విభాగాల్లో పనిచేసే విధానాన్ని పరిశీలించాలని సూచించారు. దీనిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ కలిసి అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. సైబర్ క్రైమ్ నియంత్రణపై సమగ్ర అధ్యయనం చేసి బలమైన నివేదిక రూపొందించాలని సీఎం సూచించారు. ఫోరెన్సిక్ ల్యాబ్స్, డేటా సెంటర్లను విస్తరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పోలీస్ శిక్షణలోనే సైబర్ క్రైమ్ విభాగంలో పని చేసేలా ప్రత్యేక ఎంపిక విధానం ఉండాలని చెప్పారు. అన్ని విభాగాల మధ్య సమన్వయం పెరగాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. స్కిల్స్ యూనివర్సిటీలో పోలీస్ శాఖ కోసం సైబర్ క్రైమ్ ప్రత్యేక కోర్సు ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. విజిలెన్స్ విభాగాన్ని ఆధునిక సాంకేతికతతో బలోపేతం చేయాలని, ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే అంశాలపై కఠినంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆర్గనైజ్డ్ క్రైమ్‌పై డేటా అనాలిటిక్స్ ఆధారంగా దృష్టి పెట్టాలని సూచించారు. విజిలెన్స్‌కు మరిన్ని అధికారాలు ఇవ్వాల్సిన అంశాన్ని కూడా పరిశీలించాలని చెప్పారు. అగ్ని ప్రమాదాలు జరిగిన తర్వాత కాకుండా ముందుగానే నివారణ చర్యలు తీసుకోవాలని సీఎం పేర్కొన్నారు. ఫైర్ డిపార్ట్‌మెంట్, మున్సిపల్ శాఖ, హైడ్రా వంటి విభాగాలు సమన్వయంతో పనిచేసి జూన్ 15 లోగా సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. నాలాల నిర్వహణ, మ్యాన్‌హోల్స్ పర్యవేక్షణపై పోలీస్, ట్రాఫిక్, మున్సిపల్ శాఖలు కలిసి పనిచేయాలని సూచించారు. నగరంలో అనధికార ఫ్లెక్సీలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన సీఎం, వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నైట్ పెట్రోలింగ్‌ను మరింత పెంచాలని పోలీస్ కమిషనర్లకు సూచించారు. అనంతరం పరిశ్రమల శాఖపై కూడా సీఎం విస్తృత సమీక్ష నిర్వహించారు. పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధిని అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో చేపట్టాలని సీఎం స్పష్టం చేశారు.

తరువాయి 2వ పేజీలో...

# భట్టి ఢిల్లీ టూర్

## నిర్మలా సీతారామన్‌తో భట్టి విక్రమార్క భేటీ



**విద్యారంగ పెట్టుబడులకు ప్రత్యేక ఆర్థిక సాయం కోరిన తెలంగాణ**

**సాస్కీ పథకం కింద రూ.5,000 కోట్ల గ్రాంట్ విజ్ఞప్తి**

**రూ.30,000 కోట్ల విద్యా అభివృద్ధి ప్రణాళిక వివరాలు**

**యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లతో ప్రపంచ స్థాయి విద్య లక్ష్యం**

**రాష్ట్ర అప్పుల భారంపై కేంద్రానికి వివరణ**

న్యూఢిల్లీ , మే 20 : తెలంగాణ డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను ఢిల్లీలో కలుసుకుని రాష్ట్ర ఆర్థిక అవసరాలపై కీలక చర్చలు జరిపారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి అదనపు ఆర్థిక సాయం అందించాలని ఆయన కేంద్రాన్ని కోరారు. ప్రత్యేకంగా విద్యారంగంలో భారీ పెట్టుబడులు, మౌలిక వసతుల అభివృద్ధి కోసం చేపడుతున్న ప్రాజెక్టులకు అనుగుణంగా ఎఫ్ఆర్‌బీఎం పరిమితుల నుంచి మినహాయింపు ఇవ్వాలని భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను సమర్థవంతంగా కొనసాగించేందుకు కేంద్రం నుంచి మరింత ఆర్థిక మద్దతు అవసరమని ఆయన పేర్కొన్నారు. సాస్కీ పథకం కింద రూ. 5,000 కోట్ల ప్రత్యేక గ్రాంట్ మంజూరు చేయాలని కోరిన ఆయన, 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే రాష్ట్రానికి రూ. 4,208 కోట్ల నిధులు మంజూరైన విషయాన్ని ప్రస్తావించారు. నూతన రాష్ట్రంగా తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ, గత సంవత్సరాల్లో ప్రత్యేక ప్రయోజన సంస్థలు (ఎస్‌పీవీ) ద్వారా తీసుకున్న అప్పుల భారం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెంచుతోందని కేంద్రానికి వివరించారు. విద్య, వైద్యం, గ్రామీణ మౌలిక వసతులు, మానవ వనరుల అభివృద్ధి రంగాల్లో తెలంగాణ ప్రభుత్వం

తరువాయి 2వ పేజీలో...

# చాక్లెట్ రాజకీయాలు

**ప్రధాని విదేశీ పర్యటనపై రాహుల్ ఆగ్రహం**

**ఇటలీ ప్రధానికి చాక్లెట్ బహుమతి ఇచ్చిన ఘటన వైరల్**

**సోషల్ మీడియాలో 'మెలోడీ' హ్యాష్‌ట్యాగ్ ట్రెండ్**

**మోడీ-మెలోని స్నేహంపై నెట్టింట చర్చలు**

## దేశ ఆర్థిక పరిస్థితిపై ప్రతిపక్ష నేతల తీవ్ర విమర్శలు



న్యూఢిల్లీ, మే 20

దేశ ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రధాని తీరుపై విమర్శలు గుప్పించారు.

2లో...




# మోడీకి సత్కారం

రోమ్‌లో ఎఫ్ఏఓ ప్రధాన కార్యాలయంలో

**అగ్రికోల మేడల్ ప్రదానం**

**అన్నదాతలకు అంకితం చేసిన ప్రధాని**

**భారత వ్యవసాయ రంగానికి అంతర్జాతీయ గుర్తింపు**

2

# భగ్గుమంటున్న తెలంగాణ

## ఉత్తర తెలంగాణ జిల్లాలకు వాతావరణ శాఖ హెచ్చరికలు



**45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం**

**కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని సీఎం ఆదేశాలు**

**ఆసుపత్రుల్లో ప్రత్యేక వార్డులు, ఓఆర్ఎస్ నిల్వలకు సూచనలు**

**తాగునీరు, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు**

**మధ్యాహ్న వేళల్లో బయటకు రావొద్దని ప్రజలకు విజ్ఞప్తి**

హైదరాబాద్, మే 20 (ప్రజాకలం) : తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా రాబోయే రెండు మూడు రోజుల పాటు ఎండల తీవ్రత మరింత పెరగనున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెల్సియస్‌కు పైగా నమోదయ్యే అవకాశముందని భారత వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. రోజురోజుకూ పెరుగుతున్న ఎండలు, వడగాడ్పులు ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అత్యవసరంగా పరిస్థితిని సమీక్షించారు.

తరువాయి 2వ పేజీలో...

# జగిత్యాలపై వివక్ష ఎందుకు..?

## - యంగ్ ఇండియా స్కూల్‌కు 20 ఎకరాలు కేటాయించాలి: జీవన్ రెడ్డి



జగిత్యాల్ ప్రతినిధి, మే 20 (ప్రజాకలం) : జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ , లోక బాపురెడ్డి, ప్రియాంక ప్రవీణ్, మున్నా, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. బీఆర్ అంబేద్కర్ ఆలోచనలకు అనుగుణంగా మాజీ సీఎం విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చారని జీవన్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడే సమయానికి 296 రెసిడెన్షియల్ స్కూళ్లు మాత్రమే ఉండగా, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వాటి సంఖ్యను 613కు పెంచినట్లు తెలిపారు. నూతన జిల్లాల ఏర్పాటు తర్వాత ప్రతి జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాలలు, అనుబంధ ఆస్పత్రులు మంజూరు చేశారని, హైదరాబాద్ చుట్టూ నాలుగు టీమ్ ఆస్పత్రులు ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం సీఎం ప్రభుత్వం గత ప్రభుత్వం ప్రారంభించిన పనులను పూర్తి చేయడంలో విఫలమైందని విమర్శించారు. గతంలో ఏర్పాటు చేసిన రెసిడెన్షియల్ స్కూళ్లలో సరైన వసతులు కల్పించకుండా "యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్" పేరుతో కొత్త ప్రతిపాదనలు తెరపైకి తీసుకువస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే ఉన్న గురుకులాలను కొనసాగిస్తూ, వాటికి శాశ్వత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు.

తరువాయి 2వ పేజీలో...



4లో

రాజకీయ లబ్ది కోసం బురద చల్లితే

# ఊరుకోం

- ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే విజయరమణ రావు

# ఉపాధి హామీ పెన్షన్ల సర్వేను వేగవంతం చేయాలి

- పంచాయతీరాజ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిషోర్

- స్త్రీనిధి రుణాల రికవరీలో పెద్దపల్లి భేష్.. కలెక్టర్ కోయ శ్రీహర్షకు రాష్ట్ర అధికారుల ప్రశంసలు



పెద్దపల్లి:మే 20:(ప్రజాకలం జిల్లాప్రతినిధి): నరేగా పనులు,చేయూత పెన్షన్ లైవ్ అథెంటికేషన్ సర్వేను అత్యంత ప్రాధాన్యతతో వేగంగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిషోర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ సచివాలయం నుంచి సెర్ఫ్ సీఈఓ దివ్యతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు,గ్రామీణాభివృద్ధి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. పెద్దపల్లి జిల్లా కేంద్రం నుండి కలెక్టర్ కోయ శ్రీహర్ష,అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీ ఈ సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దానకిషోర్ మాట్లాడుతూ ప్రస్తుత నరేగా పథకం జూన్ 30 వరకే కొనసాగుతుందని, జూలై 1 నుండి కొత్తగా వీబీజీ రామ్‌జీ పథకం అమల్లోకి రానుందని వెల్లడించారు. రాబోయే 40 రోజుల పాటు ఎంపీడీఓలు పూర్తిగా ఉపాధి హామీ పనులపైనే దృష్టి సారించాలని, కూలీల సంఖ్యను

తరువాయి 2వ పేజీలో...

# టెట్రా ప్యాక్ వివాదం

**కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ**

**మద్యం ప్యాకేజింగ్‌పై నిషేధం కోరిన పిటిషన్**

**ఫల రసాల్లా కనిపించే ప్యాకింగ్‌పై అభ్యంతరం**

**మైనర్లను ఆకర్షించే అవకాశం ఉందని ఆందోళన**



2లో

# కలం కౌంటర్



# ఫ్యూచర్ విజన్

మొదటి పేజీ తరువాయి...

నెట్ జీరో సిటీ డిజైన్ తరహాలో ప్రణాళికలు ఉండాలని, మౌలిక వసతుల్లో రాజీ లేకూడదని తెలిపారు. ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చేసిన తర్వాతే భూ కేటాయింపులు చేయాలని ఆదేశించారు. ఫ్యూచర్ సిటీకి అంత ర్జాతీయ సంస్థలను ఆకర్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. ప్రజా ప్రతినిధులు, సివిల్ సర్వీస్ అధికారులు, జర్నలిస్టుల కోసం 500 ఎకరాల కేటాయింపు అంశాన్ని పరిశీలించాలని తెలిపారు. కేంద్రం ప్రకటించిన హెల్త్ క్లస్టర్‌ను ఫ్యూచర్ సిటీకి తీసుకురావాలని, అవసరమైతే ప్రధాని మోదీని కలిసి విజ్ఞప్తి చేయాలని చెప్పారు. జూన్‌లోనే ఇండస్ట్రియల్ పార్క్‌కు శంకుస్థాపన జరిగేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. భూ కేటాయింపుల వెంటనే పరిశ్రమల నిర్మాణం ప్రారంభించేలా నిబంధనలు ఉండాలని చెప్పారు. "ఇన్వెస్ట్ తెలంగాణ" పేరుతో ప్రత్యేక సెల్, వెబ్‌సైట్, లోగో ఏర్పాటు చేయాలని సూచించారు. పెట్టుబడిదారుల కోసం ఎస్కార్ట్ ఆఫీసర్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, దీనిపై గ్రూప్-1 స్థాయి అధికారిని నియమించే అంశాన్ని పరిశీలించాలని సీఎం పేర్కొన్నారు. తమిళనాడు, గుజరాత్ పారిశ్రామిక విధానాలను అధ్యయనం చేయాలని సూచించారు. బుల్లెట్ ట్రైన్ కోసం భూ సేకరణ ప్రారంభించాలని, 1500 ఎకరాల్లో డేటా సిటీ ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. డేటా సిటీ నీటి అవసరాలకు ఎస్‌టీపీలను వినియోగించాలని చెప్పారు. ద్వితీయ శ్రేణి నగరాల్లో జీసీసీ (గ్లోబల్ కాపబిలిటీ సెంటర్స్) ఏర్పాటు కోసం పాలసీ రూపొందించాలని సూచించారు. మూడు నెలల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు టీ-ఫైబర్‌కు కనెక్ట్ కావాల్సిందేనని సీఎం స్పష్టం చేశారు. మొత్తం మీద రాష్ట్ర అభివృద్ధి, భద్రత, పెట్టుబడుల ఆకర్షణపై సమగ్ర దిశానిర్దేశం ఈ సమావేశాల్లో వెలువడింది.

# ఉపాధి హామీ పెన్షన్ల సర్వేను వేగవంతం చేయాలి

మొదటి పేజీ తరువాయి...

15 లక్షల నుండి 20 లక్షలకు పెంచాలని ఆదేశించారు. పనులను ఉదయం 5.30 గంటలకే ప్రారంభించి 10.30 కల్లా పూర్తి చేయాలని, అందుబాటులో ఉన్న రూ.343.59 కోట్ల మెటీరియల్ కాంపోనెంట్ బ్యాలెన్స్ నిధులను ప్రాధాన్యతగా వినియోగించి, వాటర్ హార్వెస్టింగ్ పనుల వివరాలను వెంటనే పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. నరేగా కింద వీవో భవనాలు, అంగన్‌వాడీలు, జీపీ భవనాల నిర్మాణాలు చేపట్టవచ్చని తెలిపారు. బ్యాంకు ఖాతాల ద్వారా చేయూత పెన్షన్ పొందుతున్న లబ్ధిదారులందరికీ మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓల పర్యవేక్షణలో లైవ్ అథెంటికేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. మెదక్ పైలట్ సర్వేలో 9 శాతం మంది లబ్ధిదారులు మరణించినట్లు తేలిందని, ఈ సర్వే ద్వారా అక్రమాలను అరికట్టి మరో లక్ష మంది కొత్త అర్హులకు పెన్షన్లు మంజూరు చేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. జిల్లా స్థాయి సదరం కేంద్రాల్లో ఆధునిక, సౌండ్ ప్రూఫ్ పరికరాలు ఏర్పాటు చేయాలని, 80 నుండి 100 శాతం తీవ్ర దివ్యాంగత ఉన్న వారికి కొత్త పింఛన్లలో ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కొత్త పెన్షన్ల మంజూరుకు ప్రభుత్వం త్వరలోనే మార్గదర్శకాలు జారీ చేయనుందని, పెండింగ్ దరఖాస్తుల ప్రాధాన్యత క్రమాన్ని సిద్ధం చేసుకోవాలన్నారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకం బాధ్యత ఇకపై ఎంపీడీఓలకే బదిలీ అయిందని, కుటుంబ పోషకుడిని కోల్పోయిన పేద కుటుంబాలకు దీని కింద రూ.20 వేల ఆర్థిక సాయం అందేలా చూడాలని ఆదేశించారు. కాగా, స్త్రీనిధి రుణాల రికవరీని వేగవంతం చేస్తూ ఎన్‌పీఏలను దాదాపు సున్నా స్థాయికి తగ్గించడంలో సమర్థవంతమైన చర్యలు తీసుకున్న పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షను రాష్ట్ర స్థాయి అధికారులు ఈ సమావేశంలో ప్రత్యేకంగా అభినందించారు. ఇతర జిల్లాలు కూడా పెద్దపల్లిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌డీఓ కాళిందిని, మున్సిపల్ కమిషనర్లు వెంకటేష్, మనోహర్, ఎంపీడీఓలు, ఏపీఓలు తదితరులు పాల్గొన్నారు.

# చాక్లెట్ రాజకీయాలు

మొదటి పేజీ తరువాయి...

దేశంలో రైతులు, యువత, మహిళలు, కార్మికులు, చిన్న వ్యాపారులు తీవ్ర ఆర్థిక ఒత్తిడిలో ఉన్నప్పటికీ ప్రభుత్వం ప్రచార కార్యక్రమాలకే ప్రాధాన్యం ఇస్తోందని ఆయన ఆరోపించారు. ఈ క్రమంలో ప్రధాని విదేశీ పర్యటనను ప్రస్తావిస్తూ ఆయన విమర్శలు మరింత తీవ్రతరం చేశారు. ఇటలీ పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ నరేంద్ర మోదీ , ఆ దేశ ప్రధాని గివర్గియా మెలోని కు చాక్లెట్ ప్యాకెట్ బహుమతిగా ఇవ్వడం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆ వీడియోలో ఇద్దరి మధ్య స్నేహపూర్వక సంభాషణ కనిపించగా, మెలోని స్వయంగా ఆ క్లిప్‌ను షేర్ చేయడంతో విషయం మరింత చర్చనీయాంశమైంది. ఈ ఘటనపై స్పందించిన రాహుల్ గాంధీ, దేశంలో పెరుగుతున్న ధరలు, ఆర్థిక అస్థిరతతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ప్రధాని విదేశాల్లో ప్రచార హంగామాలు, రీల్స్ వంటి వాటిపై దృష్టి సారిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇది నాయకత్వం కాదని, కేవలం డ్రామా రాజకీయమని ఆయన వ్యాఖ్యానించారు. ఇక సోషల్ మీడియాలో ఈ వీడియో క్షణాల్లోనే వైరల్‌గా మారింది. 'మెలోడీ' అనే పేరుతో మోదీ--మెలోని మధ్య ఉన్న స్నేహాన్ని సూచిస్తూ రూపొందించిన హ్యాష్‌ట్యాగ్ మరోసారి ట్రెండ్ అవుతోంది. నెటిజన్లు ఈ ఘటనపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తూ చర్చను కొనసాగిస్తున్నారు. మొత్తంగా ఈ పరిణామం దేశ రాజకీయాల్లో మరోసారి చర్చకు దారితీసింది.

# ఆలస్యంగా విధుల్లోకి డాక్టర్లు

## రోగులకు తప్పని నిరీక్షణ - కొండపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవస్థలు

మే 20 ప్రజాకలం ప్రతినిధి:-
(ఐనవోలు హన్మకొండ జిల్లా )

హనుమకొండ జిల్లా ఐనవోలు మండలంలోని కొండపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు సక్రమంగా అందడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం సమయానికే ఆసుపత్రికి వచ్చే రోగులు గంటల తరబడి డాక్టర్ల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. డాక్టర్లు ఆలస్యంగా విధులకు హాజరవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఎండాకాలం తీవ్రంగా ఉండటంతో గ్రామాల్లో ఉపాధి హామీ పనులకు వెళ్లే కూలీలు, పొలాల్లో పనిచేస్తున్న రైతులు వడదెబ్బ, నీరసం, జ్వరం వంటి సమస్యలతో ఆసుపత్రికి వస్తున్నారు. అయితే అత్యవసర సమయాల్లో కూడా వైద్యులు అందుబాటులో లేకపోవడం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. ఉదయం నుంచే ఆసుపత్రి వద్ద మహిళలు,








వృద్ధులు, చిన్నారులతో వచ్చిన కుటుంబ సభ్యులు డాక్టర్ల కోసం వేచి ఉండాల్సి వస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో సమయానికి వైద్యం అందకపోతే ప్రాణాపాయం సంభవించే ప్రమాదం ఉందని గ్రామస్తులు అంటున్నారు. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసినప్పటికీ, కొండపర్తి పీహెచ్‌సీలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉందని ప్రజలు విమర్శిస్తున్నారు. కనీసం విధి సమయాలను కచ్చితంగా అమలు చేసి రోగులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కొండపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుల హాజరు, సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# భగ్గుమంటున్న తెలంగాణ

మొదటి పేజీ తరువాయి...

రాష్ట్రంలో మారుతున్న వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ అన్ని జిల్లాల కలెక్టర్లను అప్రమత్తం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికార యంత్రాంగానికి స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేకంగా అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచించారు. రాష్ట్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి జిల్లా ఆసుపత్రుల వరకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవసర మందులు, గ్లూకోజ్ నిల్వలను సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వడదెబ్బకు గురైన వారికి తక్షణ చికిత్స అందించేందుకు ప్రత్యేక వార్డులు సిద్ధంగా ఉండాలని, అవసరమైన వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఇక ప్రజలకు అత్యంత కీలకమైన తాగునీరు, విద్యుత్ సరఫరాల విషయంలో ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. ఎండల కారణంగా విద్యుత్ వినియోగం భారీగా పెరిగే అవకాశం ఉన్నందున లోడ్ షెడ్డింగ్ లేకుండా విద్యుత్ సరఫరా కొనసాగించాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో వ్యవహరించాలని ఆదేశించారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు ప్రజల కోసం వెంటనే చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని సీఎం పేర్కొన్నారు. బస్టాండ్లు, ప్రధాన కూడళ్లు, మార్కెట్ ప్రాంతాలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద తాగునీటి సదుపాయాలు కల్పించాలని సూచించారు. ముఖ్యంగా ఉపాధి హామీ కూలీలు, నిర్మాణ కార్మికులు, నిరుపేదల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో తీవ్రమవుతున్న వేసవి పరిస్థితుల దృష్ట్యా ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. అత్యవసరం అయితే తప్ప మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్లవద్దని, పిల్లలు, వృద్ధులు ఎక్కువసేపు ఎండలో తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తగినంత నీరు తాగుతూ, శరీరాన్ని చల్లగా ఉంచుకోవాలని, వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ఆసుపత్రిని సంప్రదించాలని ప్రజలకు సూచించారు.




# మోదికి సత్కారం

## రోమ్‌లో ఎఫ్ఏఓ ప్రధాన కార్యాలయంలో అగ్రికోల మేడల్ ప్రదానం

## అన్నదాతలకు అంకితం చేసిన ప్రధాని -భారత వ్యవసాయ రంగానికి అంతర్జాతీయ గుర్తింపు

రోమ్ మే 20: రోమ్‌లోని ఎఫ్ఏఓ (ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్) ప్రధాన కార్యాలయంలో జరిగిన ఘన కార్యక్రమంలో ఎఫ్ఏఓ అగ్రికోల మేడల్‌ను ప్రధాని నరేంద్ర మోడీ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన ఎఫ్ఏఓ సంస్థకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ పురస్కారాన్ని ప్రధాని భారతదేశంలోని అన్నదాతలకు అంకితం చేశారు. దేశంలోని రైతులు, పశుసంవర్ధక రంగం, మత్స్య పరిశ్రమలతో అనుబంధమైన ప్రతి ఒక్కరి కఠిన శ్రమకు ఇది గుర్తింపుగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, నూతన ఆవిష్కరణలతో రంగాన్ని ముందుకు తీసుకెళ్తున్న పరిశోధకుల కృషిని కూడా ఈ గౌరవం ప్రతిబింబిస్తుందని ప్రధాని అన్నారు. భారతదేశం ఆహార భద్రత, మానవ సంక్షేమం, స్థిరమైన అభివృద్ధి పట్ల చూపుతున్న దీర్ఘకాలిక నిబద్ధతకు ఇది అంతర్జాతీయ గుర్తింపుగా ఆయన అభిప్రాయపడ్డారు. ఈ గౌరవం వ్యక్తిగతం కాదని, భారత అన్నదాతల సమష్టి కృషికి లభించిన గుర్తింపుగా భావిస్తున్నట్లు ప్రధాని మోడీ పేర్కొన్నారు.



# టెట్రా ప్యాక్ వివాదం

## కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ

**మద్యం ప్యాకేజింగ్‌పై నిషేధం కోరిన పిటిషన్**

**ఫల రసాల్లా కనిపించే ప్యాకింగ్‌పై అభ్యంతరం**

**మైనర్లను ఆకర్షించే అవకాశం ఉందని ఆందోళన**

**రాష్ట్రాల ఎక్సైజ్ శాఖలకూ నోటీసులు**

న్యూ ఢిల్లీ, మే 20 : టెట్రా ప్యాక్‌లు, సాచెట్ల వంటి గుర్తించలేని ప్యాకేజింగ్‌లలో మద్యం విక్రయాలను నిషేధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వ స్పందనను కోరింది. ఈ అంశం ప్రజారోగ్యం, మైనర్ల రక్షణకు సంబంధించినదిగా భావిస్తూ కోర్టు కీలకంగా పరిశీలిస్తోంది. "కమ్యూనిటీ ఎగైనెస్ట్ డ్రంకెన్ డ్రైవింగ్" అనే లాభాపేక్షలేని సంస్థ ఈ పిటిషన్‌ను దాఖలు చేసింది. ప్యాకేజింగ్ విధానం వినియోగదారులను తప్పుదారి పట్టించేలా ఉందని, ముఖ్యంగా చిన్న వయసు వారిని మద్యం వైపు ఆకర్షించే ప్రమాదం ఉందని పిటిషనర్ ఆరోపించారు. ఈ కేసును భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. జస్టిస్ జయమాల్య బాగ్చీ కూడా బెంచ్‌లో ఉన్నారు. వాదనలు విన్న అనంతరం కోర్టు కేంద్ర ప్రభుత్వంతో పాటు వివిధ రాష్ట్రాల ఎక్సైజ్ శాఖలకు నోటీసులు జారీ చేసింది. పిటిషనర్ తరఫు న్యాయవాది విపిన్ నాయర్ వాదనలు వినిపిస్తూ, అనేక మద్యం ఉత్పత్తులు ఫల రసాలను పోలి ఉండే ప్యాకింగ్‌లలో మార్కెట్‌లోకి వస్తున్నాయని తెలిపారు. దీంతో వినియోగదారులు, ముఖ్యంగా మైనర్లు, అవగాహన లేకుండా మద్యం కొనుగోలు చేసే అవకాశం ఉందని ఆయన కోర్టుకు వివరించారు. అంతేకాకుండా, మద్యం ప్యాకేజింగ్‌పై స్పష్టమైన హెచ్చరికలు మరియు ఏకరీతి విధానం దేశవ్యాప్తంగా అమలు కావాల్సిన అవసరం ఉందని పిటిషనర్ కోరారు. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఒకే విధమైన నిబంధనలు రూపొందించేలా ఆదేశాలు ఇవ్వాలని కూడా కోర్టును అభ్యర్థించారు. కోర్టు ఈ అంశాన్ని ప్రాథమికంగా పరిగణనలోకి తీసుకుని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వివరణ కోరుతూ నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణలో ఈ అంశంపై మరింత స్పష్టత రానుంది.

# మల్లయ్య చెరువు మరమ్మతులు మాటల్లోనేనా..?

**40 ఎకరాల చెరువు.. 70 ఎకరాల ముంపు! - వర్షం వస్తే గ్రామమే మునిగే ప్రమాదం!**

**అలుగు లేక రైతుల పంటలు జలసమాధి.. అధికారుల హామీలు గాలికేనా..?**

**చెరువు నిర్లక్ష్యం.. రైతుల జీవితాలతో చెలగాటం! - ఇరిగేషన్ శాఖ నిద్రలేస్తేనే రైతులకు న్యాయం!**

**రైతు కష్టం నీటిలో కలిసిపోతోంది! - అలుగు లేక అన్నదాతకు ఆవేదనే మిగిలింది!**

నందిగామ మే 20 (ప్రజా కలం):ప్రతినిధి

నందిగామ మండల పరిధిలోని రంగాపూర్ గ్రామ శివారులో గల మల్లయ్య చెరువు అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారిందని రైతులు మండిపడుతున్నారు. మొత్తం 40 ఎకరాల విస్తీర్ణం మాత్రమే ఉన్న చెరువుకు సరైన అలుగు, మెజర్మెంట్ లేకపోవడంతో వర్షాకాలంలో నీళ్లు 70 ఎకరాల వరకు వ్యాపించి రైతుల పంట పొలాలను ముంచెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెరువుకు కింద, పైన సరైన అలుగు లేకపోవడంతో భారీగా నీరు నిలిచి పండించిన పంటలు నీట మునిగి వృథా అవుతున్నాయని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ప్రతి ఏడాది ఇదే సమస్య పునరావృతమవుతున్నా సంబంధిత అధికారులు మాత్రం కేవలం హామీలకే పరిమితమవుతున్నారని ఆరోపిస్తున్నారు. గ్రామంలో ఎన్నికల సమయంలో మల్లయ్య చెరువు మరమ్మతులు చేపడతామని, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని చెప్పిన నాయకులు గెలిచాక గ్రామం వైపు చూడడం మానేశారని రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

భారీ వర్షాలు కురిస్తే రంగాపూర్ గ్రామ పంచాయతీలోని సల్వేంద్రిగుడ గ్రామమే మునిగిపోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువుకు సరైన మెజర్మెంట్ చేసి, అలుగు నిర్మాణం చేపట్టి రైతుల పొలాలు మునగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఈ సందర్భంగా నందిగామ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు తోట రాజగోపాల్ మాట్లాడుతూ, "మల్లయ్య చెరువు మొత్తం 40 ఎకరాలే ఉన్నా అలుగు లేకపోవడంతో వర్షాకాలంలో నీరు 70 ఎకరాల వరకు వ్యాపిస్తోంది. దీంతో సల్వేంద్రం గూడెం ప్రజలు, రైతులకు తీవ్ర నష్టం జరుగుతోంది. ఇరిగేషన్ శాఖ వెంటనే స్పందించి చెరువుకు మరమ్మతులు చేపట్టాలని ఆయన అన్నారు.





# జగిత్యాలపై వివక్ష ఎందుకు..?

మొదటి పేజీ తరువాయి...

మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ విధివిధానాలు, ఉపాధ్యాయ నియామక ప్రక్రియపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. ఒక్కో పాఠశాల నిర్మాణానికి రూ.200 కోట్ల చొప్పున భారీ వ్యయం ఉంటుందని, కాంట్రాక్టుల కోసమే స్థానికంగా శాశ్వత నిర్మాణాలు చేపట్టడం లేదని ఆరోపించారు. చల్గల్‌లో కేంద్రీయ విద్యాలయానికి అవసరమైన 5 ఎకరాల భూమికి బదులుగా కేవలం 2 ఎకరాలు మాత్రమే కేటాయించారని విమర్శించారు. అలాగే యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్‌కు కనీసం 20 ఎకరాలు అవసరమైతే కేవలం 10 ఎకరాలు కేటాయించడం వెనుక ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్, మంత్రి కూడా 20 ఎకరాలు అవసరమని సూచించినప్పటికీ భూమి తగ్గించడం సరికాదన్నారు. మంత్రి బాధ్యత తీసుకొని యంగ్ ఇండియా స్కూల్‌కు 20 ఎకరాలు, కేంద్రీయ విద్యాలయానికి 5 ఎకరాలు కేటాయింపజేయాలని డిమాండ్ చేశారు. చల్గల్‌లో స్థల కొరత లేదని, వ్యవసాయ పరిశోధనకు కూడా తగిన భూమి మిగులుతుందని తెలిపారు. అలాగే జగిత్యాలలో ఉద్యానవన విశ్వవిద్యాలయం అవసరం ఉందని, చల్గల్‌లో ఉద్యానవన యూనివర్సిటీ మంజూరు చేయాలని బీఆర్ఎస్ పార్టీ తరఫున, రైతుల తరఫున ప్రభుత్వాన్ని కోరుతున్నామని జీవన్ రెడ్డి వెల్లడించారు.

# భట్టి ఢిల్లీ టూర్

మొదటి పేజీ తరువాయి...

పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడుతోందని భట్టి విక్రమార్క తెలిపారు. ముఖ్యంగా విద్యారంగాన్ని ప్రాధాన్య రంగంగా గుర్తించి దీర్ఘకాలిక ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ క్రమంలో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్' ద్వారా రాష్ట్రంలోని విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్య అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర విద్యా అభివృద్ధి ప్రణాళికలో భాగంగా మొత్తం రూ.30,000 కోట్ల పెట్టుబడులు అవసరమని ఆయన కేంద్రానికి వివరించారు. ఇందులో రూ.21,000 కోట్లతో 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ క్యాంపస్‌ల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. మిగిలిన రూ.9,000 కోట్లతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, సాంకేతిక విద్యాసంస్థలు, అలాగే డిజిటల్ మౌలిక వసతుల అభివృద్ధి చేపట్టనున్నట్లు వివరించారు. రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధి దృష్ట్యా విద్యారంగ పెట్టుబడులు అత్యంత కీలకమని పేర్కొంటూ, ఈ ప్రాజెక్టులకు కేంద్రం సహకారం అందించాలని భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు.

## జనగనన కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యండి

### - 17 వార్డు కౌన్సిలర్ సోగ్రబి



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి మే 20 (ప్రజాకలం) 17వార్డు లో అధికారులతో ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించిన సోగ్రబి,అక్బర్ ప్రభుత్వం చేపట్టినటువంటి జన గణన కార్యక్రమాన్ని కోరుట్ల పట్టణ 17 వార్డు గంగమ్ పెట్,అరఫాత్ పుర,లో అధికారులతో ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించి వచ్చిన అధికారులకు సహకరించి వారు అడుగుతున్న వివరాలు ఇవ్వాల్సిందిగా కోరారు. ఎలాంటి ఇబ్బంది కలిగిన ప్రజలు, అధికారులు విషయాన్ని తమకు చెప్పాలన్నారు. తమ తరుపున పూర్తి సహకారం ఉంటుంది అని కౌన్సిలర్ సోగ్రబి అక్బర్ అన్నారు

### చేయూత లబ్ధిదారుల వెరిఫికేషన్

## త్వరితగతిన పూర్తి చేయాలి

### - మున్సిపల్ కమిషనర్ డి శ్రీనివాస్ గౌడ్



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి మే 20 (ప్రజాకలం) తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న చేయూత లబ్ధిదారుల వెరిఫికేషన్ త్వరితగతిన పూర్తి చేయాలని మెట్పల్లి మున్సిపల్ కమిషనర్ డి శ్రీనివాస్ గౌడ్ వెల్లడించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పెన్షన్ లబ్ధిదారుల లైవ్ నిర్ధారణ కార్యక్రమంను అన్ని వార్డుల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంను మున్సిపల్ కమిషనర్ డి. శ్రీనివాస్ గౌడ్ 13 వార్డు కౌన్సిలర్ అజయ్ గుడికందుల, 13 వార్డ్ రేగుంట లో చేయూత పెన్షన్ లబ్ధిదారుల లైవ్ వెరిఫికేషన్ ను పరిశీలించారు. ఈ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ శ్రీనివాస్ గౌడ్ సూచించారు. ఇంకా లైవ్ నిర్ధారణ చేయించుకోని లబ్ధిదారులు తమ సంబంధిత వార్డు కార్యాలయాలను సంప్రదించి త్వరితగతిన ప్రక్రియ పూర్తి చేసుకోవలసిందిగా తెలిపారు. ఈ కార్యక్రమంలో 13 వార్డు కౌన్సిలర్ అజయ్ గుడికందుల, సీనియర్ అసిస్టెంట్ యం.ప్రగతి, ప్రజా ప్రతినిధులు, వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## మెట్ పల్లిలో బంద్ విజయవంతం




మెట్పల్లి కోరుట్ల ప్రతినిధి మే 20 (ప్రజాకలం) ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్, డ్రగ్గిస్ట్స్ పిలుపు మేరకు, టిటిసిడి రాష్ట్ర అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనివాస్ సారథ్యంలో జగిత్యాల జిల్లా మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం దేశవ్యాప్తంగా నిర్వహించిన ఒకరోజు మెడికల్ షాప్ బంద్ కార్యక్రమంలో విజయవంతం అయింది. బంద్ కు సహకరించిన వినియోగదారులకు మందుల దుకాణ యజమానులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షులు గాజంగి సుదర్శన్, ప్రధాన కార్యదర్శి బండారి విజయకృష్ణ, కోశాధికారి చిలివేరి శ్రీనివాస్ సభ్యులు, మందుల దుకాణ యజమానులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

### - ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు

### - అట్టహాసంగా పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

పెద్దపల్లి:మే 20:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని,వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వ విప్,పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు అన్నారు.బుధవారం పెద్దపల్లి జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై,రైతులకు సబ్సిడీపై అందించే విత్తనాల పంపిణీని అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ వానాకాలం పంటల సాగుకు ముందే భూమిని సిద్ధం చేసుకోవడంలో పచ్చిరొట్ట ఎంతో దోహదపడుతుందని వివరించారు. జీలుగ,జనుము వంటి పచ్చిరొట్ట పంటలను సాగు చేసి,అవి పూతకు వచ్చే దశలో భూమిలోనే కలియదున్నడం వల్ల నేలకు అవసరమైన నత్రజని,సేంద్రీయ కర్బనం పుష్కలంగా లభిస్తాయని,తద్వారా భూసారం అద్భుతంగా పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు.రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి,సేంద్రీయ పద్ధతుల్లో పంటలు



పండించడం ద్వారా రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గి,అధిక దిగుబడులు సాధించవచ్చని సూచించారు.ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న ఈ విత్తనాల అవకాశాన్ని నియోజకవర్గంలోని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.జిల్లా కేంద్రంలో అట్టహాసంగా జరిగిన ఈ పంపిణీ కార్యక్రమంలో రైతులు పాల్గొనగా,ఎమ్మెల్యే స్వయంగా వారికి విత్తన బస్తాలను అందజేశారు.వానాకాలం సీజన్ ప్రారంభానికి ముందే సకాలంలో విత్తనాలను అందుబాటులోకి తెచ్చినందుకు ప్రజాప్రతినిధులకు,వ్యవసాయ అధికారులకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బందితో పాటు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, మున్సిపల్ చైర్మన్,మార్కెట్ కమిటీ చైర్మన్లు, వివిధ విభాగాల ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు,కార్యకర్తలు,రైతులు పాల్గొన్నారు.

# గడి స్థలాల వీఎల్టీలను రద్దు చేసి ప్రజా ప్రయోజనాలకు ఉపయోగించండి

### - కోరుట్ల మున్సిపల్ కమిషనర్ కు అన్ని పార్టీల కౌన్సిలర్లు సంతకాల చేసిన ప్రతులను అందించిన అఖిలపక్ష ప్రజా సంఘాల నాయకులు



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి మే 20 (ప్రజాకలం) కోరుట్ల పట్టణంలోని చారిత్రక గడి స్థలాల్లో నకిలీ దస్తావేజులతో అక్రమంగా వేసిన వి ఎల్ టి లను వెంటనే రద్దు చేయాలని కోరుతూ అఖిలపక్ష ప్రజాసంఘాల నాయకులు కోరుట్ల మున్సిపల్ కమిషనర్ హన్మంతరావు కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అన్ని పార్టీలకు చెందిన మున్సిపల్ కౌన్సిలర్లు పూర్తి మద్దతుతో చేసిన సంతకాల ప్రతులను కమీషనర్ కు అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ కోరుట్ల గడి బురుజులు, కోనేరు మరియు సంబంధిత స్థలాలు చాళుక్య-జైనుల కాలం నాటి చారిత్రక వారసత్వ సంపద అని తెలిపారు. ఈ ప్రజా ఆస్తులను కొంత మంది నకిలీ దస్తావేజులతో ఆక్రమించేందుకు ప్రయత్నిస్తూ ఇంటి నెంబర్ 6-4-228 ఆధారంగా 5,800 గజాల భూమిపై చట్ట విరుద్ధంగా కమీషనర్ తో లోపాయికారీ ఒప్పందం చేసుకుని వి ఎల్ టి ని పొందారని ఆరోపించారు.ఈ అంశంపై ప్రజలు, అఖిలపక్ష ప్రజాసంఘాలు ఇప్పటికే అనేక దశల్లో నిరసనలు, దీక్షలు, రాస్తారోకోలు నిర్వహించాయని తెలిపారు. ప్రజల అభిప్రాయానికి మద్దతుగా కోరుట్ల మున్సిపల్ పరిధిలోని అన్ని పార్టీల కౌన్సిలర్లు, అధికార కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఛైర్పర్సన్, వైస్ చైర్మన్, మాజీ చైర్మన్లు, ఇతర ప్రజా ప్రతినిధులు అక్రమ వీఎల్టీలను రద్దు చేయాలని ఏకగ్రీవంగా సంతకాలు చేశారని పేర్కొన్నారు. పూర్తి కౌన్సిల్ మద్దతుతో కూడిన సంతకాల ప్రతులను ఆర్డీవో కు అందజేయడం ద్వారా ప్రజల ఐక్యత మరియు గడి స్థలాల పరిరక్షణపై ఉన్న సంకల్పాన్ని స్పష్టంగా తెలియజేశారు.వెంటనే ప్రత్యేక మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు ద్వారా ఈ అక్రమ అనుమతులను రద్దు చేయడానికి చట్టపరమైన బలమైన ఆధారం ఏర్పడిందని, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 243 డబ్ల్యూ, తెలంగాణ మున్సిపాలిటీస్ యాక్ట్-2019 ప్రకారం ప్రజా ఆస్తుల పరిరక్షణ ప్రభుత్వం బాధ్యత వహించాలని గుర్తు చేశారు. అదే విధంగా అక్కడి గడి స్థలాలలో కూరగాయల మార్కెట్, పార్కు, మైసమ్మ దేవాలయం అభివృద్ధి చేయడంతో పాటు దసరా మహిషాసుర మర్దన, బతుకమ్మ, గణేశ్, మొహరం వంటి సాంప్రదాయ ఉత్సవాలు యథావిధిగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో అఖిలపక్ష ప్రజాసంఘాల నాయకులు డాక్టర్ పేట భాస్కర్, ఎం డి ముజాహిద్, చెన్న విశ్వనాథం, చింత భూమేశ్వర్, సుతారి రాములు , కుంచెం శంకర్, షాహేద్ మహ్మద్ షేక్, పోతిని సత్యం, కుంట రాజా గౌడ్, జాగృతి జిల్లా అధ్యక్షురాలు సుజాత, శనిగారపు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లోకి అనుమానాస్పద వ్యక్తులను రానీయొద్దు

### - పాత ఫోన్ల సేకరణ పేరుతో పెద్ద మోసాలు



పెద్దపల్లి:మే 20:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

గ్రామాల్లో పాత మొబైల్ ఫోన్ల సేకరణ పేరుతో పెద్ద ఎత్తున మోసాలు,సైబర్ నేరాలు జరిగే ప్రమాదం ఉందని,ప్రజలెవరూ గుర్తుతెలియని వ్యక్తులకు తమ పాత ఫోన్లను ఇవ్వకూడదని పోలీస్ అధికారులు హెచ్చరించారు.గ్రామాల్లోకి వచ్చే అనుమానాస్పద వ్యక్తుల పట్ల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.పెద్దపల్లి మండలం నిమ్మనపల్లి గ్రామంలో కొందరు వ్యక్తులు ఇంటింటికీ తిరుగుతూ పాత మొబైల్ ఫోన్లకు బదులుగా ప్లాస్టిక్ వస్తువులను ఇస్తుండగా,వారి ప్రవర్తనపై నిమ్మనపల్లి గ్రామ సర్పంచ్ వేల్పుల రమేష్‌కు అనుమానం వచ్చింది.ఆయన వెంటనే స్పందించి గ్రామస్తుల సహకారంతో ఆ వ్యక్తులను పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందిన వెంటనే ఏఎస్ఐ తిరుపతి తన సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని,సదరు అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఈ సందర్భంగా సమయస్ఫూర్తితో వ్యవహరించి పోలీసులకు సమాచారం అందించిన సర్పంచ్ వేల్పుల రమేష్‌ను పోలీస్ శాఖ తరపున అధికారులు ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా ఏఎస్ఐ తిరుపతి మాట్లాడుతూ పాత మొబైల్స్‌లో వ్యక్తిగత సమాచారం, బ్యాంకింగ్ వివరాలు,ఫోటోలు వంటి ముఖ్యమైన డేటా ఉండే అవకాశం ఉందని,కేవలం ప్లాస్టిక్ వస్తువులకు ఆశపడి వాటిని అపరిచితులకు ఇవ్వడం వల్ల తీవ్ర నష్టం వాటిల్లుతుందని తెలిపారు.

నేరగాళ్లు ఈ ఫోన్లలోని డేటాను రికవరీ చేసి,వాటిని దుర్వినియోగం చేస్తూ వివిధ రకాల సైబర్ నేరాలకు పాల్పడే ప్రమాదం ఉందన్నారు. అంతేకాకుండా,ఇలాంటి వ్యక్తుల వల్ల గ్రామాల్లో చోరీలు జరిగే అవకాశాలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు.గ్రామ భద్రత కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని,గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

## సామాజిక సేవలో భాగస్వాములు కావాలి

### - పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష

### - రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు ప్రారంభం.. టూరిజం గైడ్ పోస్టర్ ఆవిష్కరణ




పెద్దపల్లి:మే 20:(ప్రజాకాలం జిల్లాప్రతినిధి)

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లాలోని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని సామాజిక సేవలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పిలుపునిచ్చారు.బుధవారం జిల్లా ఉపాధి కల్పన అధికారికార్యాలయంలో ఏర్పాటు చేసిన రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ యాక్ట్ ద్వారా ఏర్పాటు చేయబడిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ.. తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షులు,రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మార్గదర్శనంలో, రాష్ట్ర చైర్మన్ దాన కిషోర్ నాయకత్వంలో బహుముఖ సేవలందిస్తున్న అతి పెద్ద సంస్థ అని పేర్కొన్నారు.మే 15 నుండి జూన్ 15, 2026 వరకు ఈ ప్రత్యేక సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించబడుతుందని ఆయన తెలిపారు.రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా ప్రకృతి విపత్తుల సమయంలో సహాయం, ఉచిత స్వచ్ఛంద రక్తదాన శిబిరాలు, క్యాన్సర్,సికిల్ సెల్,తలసేమియా రోగులకు ఉచిత రక్తాన్ని అందించడం,సీనియర్ సిటిజన్స్ హోమ్స్,అనాథ శరణాలయాలు, ఉచిత ప్రసూతి వైద్యశాలల నిర్వహణ వంటి ఎన్నో అద్భుతమైన సామాజిక సేవలు అందుతున్నాయని కలెక్టర్ వివరించారు.18 సంవత్సరాల వయస్సు నిండిన ప్రతి భారతీయ పౌరుడు ఈ సంస్థలో సభ్యుడిగా చేరుటకు అర్హుడని,ఆసక్తి గలవారు ఆన్‌లైన్ ద్వారా జీవిత,వైస్ ప్యాట్రన్ లేదా ప్యాట్రన్ సభ్యునిగా చేరవచ్చని సూచించారు.సభ్యత్వ నమోదు కొరకు పాస్పోర్ట్ సైజ్ ఫోటోతో పాటు ఐడి ప్రూఫ్ నిమిత్తం ఆధార్ కార్డు,ఓటర్ ఐడి కార్డ్ లేదా పాన్ కార్డ్ అవసరమవుతాయని తెలిపారు.సభ్యులుగా చేరదలచిన వారు అధికారిక వెబ్సైట్ https://redcross.cgg.gov.in/ ద్వారా గానీ,లేదా గూగుల్ ప్లే స్టోర్ నుండి Telangana Red జతీశీం మొబైల్ యాప్ డౌన్లోడ్ చేసుకుని గానీ నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు.జిల్లాలో ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు నోడల్ ఆఫీసర్లుగా జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్, ప్రాజెక్ట్ డైరెక్టర్ గ్రామీణ అభివృద్ధి అధికారిని నియమించామని,వారి కార్యాలయాల్లో ప్రత్యేకంగా డాటా సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లా అడిషనల్ కలెక్టర్, రెడ్ క్రాస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని రెగ్యులర్ గా సమీక్షిస్తారని కలెక్టర్ స్పష్టం చేశారు.అనంతరం పెద్దపల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త కనుకుంట్ల సదానందంకు రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వాన్ని జిల్లా కలెక్టర్ అందజేశారు.అదేవిధంగా,జిల్లా యువజన క్రీడా శాఖ కార్యాలయంలో టూరిజం గైడ్ పోస్టర్‌ను జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ మొత్తం కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ అధికారి రంగారెడ్డి,ఉపాధి కల్పనాధికారి రాజశేఖర్,సహాయ కార్మికఅధికారి మహమ్మద్ రఫీ, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు కావేటి రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## బాలిక మృతికి కారణమైన నిర్లక్ష్య డ్రైవర్‌కు జైలు శిక్ష

మెట్ పల్లి ప్రతినిధి, మే 20 (ప్రజాకలం) : జగిత్యాల జిల్లా కోరుట్ల మండలంలో జరిగిన రోడ్డు ప్రమాద కేసులో బాలిక మృతికి కారణమైన నిందితుడికి కోర్టు ఆరు నెలల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.500 జరిమానా విధించింది. వివరాల్లోకి వెళ్తే.. కోరుట్ల మండలానికి చెందిన ఆకుల బోజన్న తన మనుమరాలు ధరిణి (5)తో కలిసి 2019 ఫిబ్రవరి 19న పైడిమడుగు గ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై వస్తుండగా, సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో కల్లూరు వైపు నుంచి కోరుట్ల వైపు వస్తున్న ట్రాక్టర్‌ను పోగుల భూమయ్య (54) అతివేగంగా, నిర్లక్ష్యంగా నడిపి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బోజన్నకు గాయాలు కాగా, చిన్నారి ధరిణికి తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఘటనపై బాలిక తండ్రి ఆకుల నరేష్ ఫిర్యాదు చేయడంతో కోరుట్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం నిందితుడిపై అభియోగ పత్రం దాఖలు చేశారు. కేసును విచారించిన కోరుట్ల ప్రథమ శ్రేణి న్యాయస్థానం న్యాయమూర్తి పవని సాక్ష్యాధారాలను పరిశీలించి నిందితుడు పోగుల భూమయ్యను దోషిగా తేల్చారు. దీంతో అతనికి ఆరు నెలల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

## కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడికి ఘన సన్మానం



రుద్రంగి, మే 20,(ప్రజాకలం ప్రతినిధి)

రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల నూతన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎర్రం గంగనర్సయ్య కను బుధవారం పలువురు కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. రుద్రంగి మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేసి కాంగ్రెస్ పార్టీని మరింత ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఎర్రం గంగనర్సయ్య నాయకత్వంలో రుద్రంగి మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండి పని చేస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. నూతన అధ్యక్షుడు ఎర్రం గంగనర్సయ్య మాట్లాడుతూ.. పార్టీ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ కార్యకర్తలను సమన్వయం చేసుకొని పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మంజుల రాజు గుగులోత్ సరోజ, వినోద్, గుగులోత్ మదన్ నాయక్, బానోత్ రమేష్ నాయక్, గుగులోత్ రమేష్, రాజు, గుగులోత్ శివ, గుగులోత్ సంతోష్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## బుగ్గారం మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శుల నియామకం

### - నియామక పత్రాలను అందజేసిన జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గజేంగి నందయ్య



బుగ్గారం, మే 20 : ( ప్రజా కలం ప్రతినిధి )

జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం బుగ్గారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నగునూరి నర్సగౌడ్, ప్రధాన కార్యదర్శి గా బత్తుల తిరుపతి లకు నియామకం పత్రాలను అందచేసిన జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గజేంగి నందయ్య జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గజేంగి నందయ్య బుధవారం రోజున ధర్మపురి ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో తెలంగాణ రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల ప్రకారం బుగ్గారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గా బుగ్గారం మండల కేంద్రానికి చెందిన నగునూరి నర్సగౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గా మద్దునూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బత్తుల తిరుపతి లకు నియమిక పత్రాలను అందచేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు గజేంగి నందయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం చురుగ్గా పాల్గొనీ అందరినీ కలుపుకొని పోయి భవిష్యత్ లో వచ్చే ప్రతి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కష్టపడాలని కోరుచు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులకు శుభాకాంక్షలు తెలిపారు.

## మే 23 నుండి కూనారం కేంద్రంలో విత్తన వారోత్సవాలు

### - సీనియర్ శాస్త్రవేత్త డా. బి. సతీష్ చంద్ర

పెద్దపల్లి:మే 20 (ప్రజాకలం జిల్లాప్రతినిధి) ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విత్తన మేళాలో



భాగంగా,కూనారం వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ఈ నెల 23 నుండి 30 వరకు విత్తన వారోత్సవాలను నిర్వహించనున్నట్లు కేంద్ర సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బి.సతీష్ చంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కూనారం పరిశోధన కేంద్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేసిన అత్యుత్తమ రకం కూనారం సన్నాలు-కె.ఎన్.ఎమ్ 1638 ఫౌండేషన్ విత్తనం సుమారు 250 క్వింటాళు ప్రస్తుతం విక్రయానికి సిద్ధంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ విత్తనాలకు సంబంధించి10 కిలోల బరువు గల విత్తన సంచి ధరను రూ.750 గా నిర్ణయించామని,ఈ రకం విత్తనాలు కొనుగోలు చేయడానికి ఆసక్తి కలిగిన రైతుల కోసం ఈ నెల 22 నుండి అడ్వాన్స్ బుకింగ్ చేసుకునే సౌకర్యాన్ని కల్పిస్తున్నామని వెల్లడించారు.పరిశోధన కేంద్రంలో విత్తనాలు పరిమిత పరిమాణంలో మాత్రమే అందుబాటులో ఉన్నందున, ప్రాంతీయ రైతులు సకాలంలో స్పందించి ఈ చక్కని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.విత్తనాల బుకింగ్,లభ్యత మరియు ఇతర పూర్తి వివరాల కోసం రైతులు 8333818202 ఫోన్ నంబరులో సంప్రదించవచ్చని డాక్టర్ బి.సతీష్ చంద్ర ఆ ప్రకటనలో సూచించారు.

ప్రజా కలం
గురువారం, మే 21, 2026

## కేసీఆర్-జగన్-విజయ్
# రీజనల్ ఫ్రంట్...

ఒక తాజా ముఖ్యమంత్రితో చేతులు కలిపి ఇద్దరు మాజీ ముఖ్యమంత్రులు తమ రాజకీయ పునరుత్తేజం పొందాలని చూస్తున్నారా. ఏకంగా సౌత్‌లో రీజనల్ రెలీజియన్ ఫ్రంట్ కి శ్రీకారం చుట్టాలని భావిస్తున్నారా అంటే జరుగుతున్న ప్రచారం బట్టి చూస్తే అవును అనే మాట వస్తోంది. ఆ పార్టీలు బీఆర్ఎస్, వైసీపీ టీవీకే అయితే అధినాయకులు కేసీఆర్ జగన్ విజయ్ అని అంటున్నారు. ఇందులో కేసీఆర్ రెండు సార్లు తెలంగాణాకు సీఎం గా చేసి ఓటమి పాలు అయ్యారు. ఏపీలో ఒకసారి అధికారంలోకి వచ్చిన జగన్ కూడా రెండేళ్ళుగా మాజీ సీఎం గా ఉన్నారు. ఇక రెండేళ్ళ క్రితం పార్టీ పెట్టి తాజాగా తమిళనాడు ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన విజయ్ ఇపుడు కేసీఆర్ జగన్ భవిష్యత్తు రాజకీయాకు ఒక ఆశాకిరణంగా కనిపిస్తున్నారు అని అంటున్నారుతెలుగు రాజకీయాల్లో కొత్త సమీకరణలకు ప్రధాని నరేంద్ర మోడీ తాజా పర్యటన దారి తీసింది. ఇక్కడ ఒక విషయం ఫుల్ క్లారిటీ వచ్చింది. ఎన్డీయే బంధం మరింత పటిష్టం అయింది అని. పైగా టీడీపీ బీజేపీ జనసేన 2029 లో కూడా కలసికట్టుగా సాగుతాయని అర్థం అవుతోంది. అంతే కాదు ఈ మోడీ బాబు పవన్ ల మధ్య మిత్ర బంధం మరింత బలీయం అయింది. దాంతో వచ్చే ఎన్నికల నాటికి తెలంగాణాలో బీఆర్ఎస్ తో బీజేపీ కలుస్తుందన్న ప్రచారం పూర్తిగా పక్కకు పోయింది. అలాగే ఏపీలో వైసీపీతో ఏదో నాటికి బీజేపీ స్నేహ హస్తం గట్టిగా అందిస్తుందన్న అశలూ అడుగంటాయని అంటున్నారు. ఈ నేపథ్యంలో ఎన్డీయేకు దూరంగా ఉండాల్సిన పరిస్థితి వైసీపీకి అనివార్యంగా కనిపిస్తోంది. ఇంత జరిగిన తరువాత కూడా ఎన్డీయేకు మద్దతు పరోక్షంగా అయినా ఇస్తూ పోతే అది పార్టీ జనంలో బయట జనంలో తప్పుడు సంకేతాలు ఇచ్చే చాన్స్ ఉంటుంది. వాటికి మించి వైసీపీకి బలంగా ఒక్క మైనారిటీ ఎస్సీ ఎస్టీ ఓటు బ్యాంక్ కూడా రివర్స్ అవుతుందన్న చర్చ కూడా ఉందని అంటున్నారు. ఇక ఏపీలో 2029 ఎన్నికల్లో బాబు పవన్ మోడీల త్రిమూర్తులను వైసీపీ అధినేత జగన్ మరోసారి ఎదుర్కోవాల్సిన పరిస్థితి అయితే ఉంది. దాంతో వైసీపీ ఇక మూడేళ్ళు ముందుగానే తన రాజకీయ యాక్షన్ ప్లాన్ ని రెడీ చేసుకోవాల్సిన సమయం వచ్చేసింది అని అంటున్నారు. తెలంగాణాలో కేసీఆర్ విషయం తీసుకుంటే కాంగ్రెస్ అక్కడ స్థానికంగా అధికారంలో ఉంది. దాంతో జాతీయ స్థాయిలో కాంగ్రెస్ తో నేరుగా చేతులు కలపలేని పరిస్థితి ఉంది. అలాగని బీజేపీతో కలసి ముందుకు సాగే సీన్ కూడా లేదు, బీజేపీతో బాహాటంగా కలిస్తే మైనారిటీ ఓట్లు ఇతర అణగారిన వర్గాల ఓట్లు పోతాయన్న భయం ఉంది. అయితే బీజేపీ పట్ల ఎంతో కొంత సాఫ్ట్ కార్నర్ తో అయితే బీఆర్ఎస్ ఉందన్న ప్రచారాన్ని కాంగ్రెస్ వర్గాలు ఇంతకాలం చేస్తూ వచ్చాయి. అందులో నిజమెంత ఉందో తెలియదు కానీ ఇపుడు మాత్రం మోడీ బాబు పవన్ తెలంగాణాలో కూడా ఎన్డీయే గా ముందుకు వస్తే మాత్రం బీఆర్ఎస్ కొత్త ఆలోచనలు చేయాల్సిందే అన్నది కూడా గులాబీ పార్టీలో ఉంది: ఇదిలా ఉంటే జాతీయ స్థాయిలో ఇండియా కూటమి వైపు కేసీఆర్ జగన్ చూపు పడుతోందా అన్న చర్చ కూడా ఉంది. ఎంత లేదనుకున్నా కాదనుకున్నా జాతీయ రాజకీయాన్ని కూడా గమనిస్తూ ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. అంతే కాదు తెలంగాణాలో ఏకంగా మోడీయే రంగంలోకి దిగితే ప్రాంతీయ పార్టీలతో అయినా చెలిమి చేయడం ద్వారా బలం పెంచుకోవాలన్నది బీఆర్ఎస్ ఆలోచనగా ఉంది అని అంటున్నారు. దాంతోనే తమిళనాడు కొత్త ముఖ్యమంత్రి టీవీకే అధినేత విజయ్ తో స్నేహం నెరిపే విషయంలో బీఆర్ఎస్ ఉత్సాహం చూపిస్తోంది అని అంటున్నారు. అదే సమయంలో వైసీపీ అధినేత జగన్ కూడా విజయ్ తో చెలిమి చేస్తున్నారు. ఇలా రెండు తెలుగు రాష్ట్రాలలో రెండు కీలక పార్టీలు ఇపుడు జాతీయ రాజకీయాల్లో కొత్త రూట్ లోకి వెళ్తున్నాయా అన్న చర్చ సాగుతోంది. నిజానికి ఈ రోజున దేశ రాజకీయాలలో ప్రాంతీయ పార్టీలు తమ వంతు పాత్ర పోషిస్తున్నాయి. ఎన్డీయేలో జనసేన టీడీపీ ఉంటే మరి కొన్ని పార్టీలు కాంగ్రెస్ నాయకత్వంలోని ఇండియా కూటమిలో ఉన్నాయి. అయితే ఈ రెండు కూటములలో లేని ఉండలేని ప్రాంతీయ పార్టీలుగా తెలుగు నాట బీఆర్ఎస్ వైసీపీలను చెప్పుకోవాలి. ఈ రెండు పార్టీలకు కాంగ్రెస్ రాజకీయ ప్రత్యర్థి. దాంతో ఇండియా కూటమిలోకి కలవలేరు, అలాగే ఎన్డీయే నాయకత్వంలోని కూటమిలో కూడా చేరలేరు. దాంతో తమకు తాముగా దక్షిణాదిన ఒక ప్రాంతీయ కూటమిని ఏర్పాటు చేసుకుంటే రేపటి రోజున అంటే 2029 ఎన్నికల్లో ఏ పార్టీకి ప్రభుత్వాన్ని కేంద్రంలో ఏర్పాటు చేయడానికి అవసరమైన సీట్లు రాకపోతే తమ బలం అవసరం అవుతుందని అలా తమకు డిమాండ్ ఉంటుందని ఒక కొత్త ప్రయత్నానికి సిద్ధపడుతున్నట్లుగా తెలుస్తోంది. ఇక తమిళనాడులో విజయ్ పార్టీ గెలవడం ఏంటి అటు బీఆర్ఎస్ ఇటు వైసీపీ కూడా పెద్ద ఎత్తున రియాక్ట్ అయిపోయాయి. అంతే కాదు విజయ్ కి కంగ్రాట్స్ చేస్తూ చెలిమికి తెర తీశాయి. ఇక్కడ వైసీపీకి టీవీకేకి సిద్ధాంతపరంగా సారూప్యం కంటే రెండు పార్టీలకూ క్రిస్టియన్ మైనారిటీ ఓటు బేస్ మాత్రం ఒక కామన్ పాయింట్ గా చెబుతున్నారు. ఇక సంక్షేమ పథకాలు ఇతర అంశాలలో జగన్ స్ట్రాటజీని విజయ్ ఫాలో అవుతున్నారని కూడా అంటున్నారు. ఇవన్నీ పక్కన పెడితే ఏపీలో చంద్రబాబు పవన్ కళ్యాణ్ లతో కూడిన బీజేపీ కూటమిని ఢీ కొట్టాలంటే ఈ సఖ్యత కొత్త కూటమి అవసరం అని వైసీపీ భావిస్తుంటే తెలంగాణాలో కూడా దూసుకుని వస్తున్న బీజేపీని ఎన్డీయే కూటమి ఏర్పాటుని అడ్డుకోవడానికి బీఆర్ఎస్ కూడా విజయ్ వంటి మిత్రుడి వైపు చూస్తోంది అని అంటున్నారు. ఇది కేసీఆర్ కి జగన్ కి రాజకీయ అనివార్యంగా కనిపిస్తుంది అని అంటున్నారు. ఏపీలో చూస్తే పార్టీగా వైసీపీని పెట్టక ముందు నుంచే జగన్ మీద అవినీతి ఆరోపణలు ఉన్నాయి. ఆయన మీద సీబీఐ కేసులు పదహారు నెలల జైలు జీవితం ఇవన్నీ ఒక ఎత్తు అయితే 2019 నుంచి 2024 దాకా సాగిన అయిదేళ్ల వైసీపీ ఏలుబడిలో అవినీతి మరో ఎత్తు అని అంటున్నారు. దాని వల్లనే వైసీపీ 2024 లో ఓటమి పాలు అయిందని చెబుతారు. ఒక బీఆర్ఎస్ విషయం తీసుకుంటే ఆ పార్టీ తెలంగాణాలో చేసిన పదేళ్ల పాలనలో కాళేశ్వరం నుండి ఫార్ములా వన్ కార్ రేసింగ్ వరకు భారీ త్తున ఆరోపణలు ఈ రోజుకీ సంచలనంగానే ఉన్నాయని చెబుతున్నారు. మరో వైపు తమిళనాడులో అనూహ్యంగా అధికారంలోకి వచ్చిన టీవీకే పార్టీ మీద కూడా అవినీతి మరకలు ఆరంభంలోనే ఉన్నాయని గుర్తు చేస్తున్నారు. అదెలా అంటే టీవీకేలో ఆ పార్టీ కీలక నేత, మంత్రి అధర్వ అర్జున్ తండ్రి లాటరీ కింగ్ అని చెబుతున్నారు. కూటమి సాధ్యమా : అయితే ఈ ముగ్గురు నాయకులూ తమ ప్రభావాన్ని రాజకీయంగా దక్షిణాదిన చూపించాలని ప్రయత్నం చేస్తున్నారు. దాని కోసం ప్రాంతీయ కూటమిని కట్టాలని కూడా వ్యూహ రచన చేస్తున్నట్లుగా ప్రచారం అయితే ఉంది. కానీ అవినీతి ఆరోపణలు ఒక వైపు మరో వైపు మత రాజకీయాలను ముందుకు తీసుకుని రావడం వంటివే అడ్డంకిగా మారుతాయా అన్న చర్చ సాగుతోంది. అయితే దక్షిణాదిన ఎన్డీయే కూటమిని మరీ ముఖ్యంగా చంద్రబాబుకు ముకు తాడు వేయాలని ఈ కూటమి పెద్దల ప్రధాన లక్ష్యమని అంటున్నారు. మరి వీరి ఆశలు ఏ మేరకు సఫలీకృతం అవుతాయన్నది తెలియాలన్నా అనేక ప్రశ్నలకు జవాబు దొరకాలన్నా కొంత కాలం పాటు వేచి చూడాల్సి ఉందని అంటున్నారు. మరో వైపు చూస్తే ఇండియా కూటమిలో కాంగ్రెస్ సారథ్యం కాకుండా ఏ మమతా బెనర్జీ లాంటి వారో పగ్గాలు అందుకుంటే తెలుగు నాట కూడా కొత్త పార్టీలు అందులో చేరేందుకు వీలు ఉంటుందని అంటున్నారు. మొత్తానికి ఎన్డీయే తెలుగు రాష్ట్రాలలో బలంగా ఉండాలని మోడీ నిర్ణయించిన నేపథ్యంలో అటు బీఆర్ఎస్ ఇటు వైసీపీ రెండూ అలెర్ట్ అయినట్లుగా కనిపిస్తోంది అని అంటున్నారు.

# పారదర్శకంగా ఓటరు జాబితా సవరణ



## -కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి:మే 20:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ-ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా,సమర్థవంతంగా నిర్వహించి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా అధికారులు,రాజకీయ పార్టీలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు,సంబంధిత అధికారులతో నిర్వహించిన ఎస్ఐఆర్ సమీక్ష సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె.అరుణ శ్రీతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 24 సంవత్సరాల తర్వాత గతంలో 2002లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఈ ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. అక్టోబర్ 1-2026ను ప్రామాణిక తేదీగా తీసుకుని,అప్పటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని,మరణించిన వారు,ఇతర ప్రాంతాలకు మారిన వారి పేర్ల తొలగింపు, డూప్లికేట్ ఓట్ల నివారణ కూడా ఇందులో భాగమని స్పష్టం చేశారు. ప్రస్తుత ఓటర్ల జాబితాను 2002 నాటి ఎస్ఐఆర్ జాబితాతో మ్యాపింగ్ చేస్తున్నామని,ఒకవేళ ప్రస్తుత ఓటరు పేరు 2002 జాబితాలో లేకపోతే,వారు తమ తల్లిదండ్రులు లేదా తాతముత్తాతల వివరాలను ఎన్యూమరేషన్ ఫారంలో నమోదు చేయాల్సి ఉంటుందని,ఈ దశలో ఎలాంటి డాక్యుమెంట్లు సమర్పించాల్సిన అవసరం లేదని కలెక్టర్ వివరించారు. ప్రతి రాజకీయ పార్టీ బూత్ స్థాయిలో బీఎల్ఏలను నియమించి ఈ ప్రక్రియను పర్యవేక్షించాలని కోరారు. జిల్లాలో ఒక్క అర్హుడైన ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకూడదనేదే జిల్లా యంత్రాంగం లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమ షెడ్యూల్ ప్రకారం జూన్ మొదటి వారంలో మండల స్థాయి సమన్వయ సమావేశాలు,జూన్ 15 నుంచి 24 వరకు సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఉంటాయని కలెక్టర్ తెలిపారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు బీఎల్‌వోలు ఇంటింటి సర్వే నిర్వహించి కొత్త ఓటర్ల నుంచి నమోదు ఫారాలు స్వీకరిస్తారని,ఇల్లు తాళం వేసి ఉంటే మూడు సార్లు సందర్శిస్తారని చెప్పారు. ఓటర్లు ఒశీవతీ.వఎఱ.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్ ద్వారా కూడా ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. అనంతరం జూలై 31-2026న డ్రాఫ్ట్ ఎస్ఐఆర్ ఓటరు జాబితా విడుదల చేస్తామని,దీనిపై అభ్యంతరాలను ఆగస్టు 30లోగా సమర్పించాలని సూచించారు. డ్రాఫ్ట్ జాబితా తర్వాత మ్యాపింగ్ సరిగా కాక నోటీసులు జారీ అయినప్పుడు పౌరసత్వ నిబంధనల ప్రకారం..జూలై 1-1987కు ముందు జన్మించిన వారు స్వీయ గుర్తింపు పత్రాలు,జూలై 1-1987 నుండి డిసెంబర్ 2, 2004 మధ్య జన్మించిన వారు తల్లి లేదా తండ్రి ఒకరి పత్రాలు,డిసెంబర్ 2- 2004 తర్వాత జన్మించిన వారు తల్లిదండ్రులు ఇద్దరి పత్రాలను సమర్పించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 28 నాటికి అన్ని క్లెయిమ్‌లను పరిష్కరించి, అక్టోబర్ 1-2026న తుది ఎస్ఐఆర్ ఓటరు జాబితాను విడుదల చేస్తామని,ఒకవేళ డ్రాఫ్ట్ జాబితాలో పేరు లేకపోతే ఫారం-6 ద్వారా మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు గంగయ్య, సురేష్,ఎన్నికల విభాగం అధికారులు,రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# రాజకీయ లబ్ధి కోసం బురద చల్లితే ఊరుకోం

## - ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే విజయరమణ రావు



పెద్దపల్లి:మే 20:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంపై ఆధారాలు లేకుండా లేనిపోని ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని ప్రభుత్వ విప్,పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం పెద్దపల్లి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ ముఖ్య నాయకులు,వివిధ నియోజకవర్గ ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయరమణ రావు మాట్లాడుతూ పెద్దపల్లి నియోజకవర్గంలో ధాన్యంతో పాటు మొక్కజొన్న కొనుగోలు విషయంలో మాజీ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, ఆయన వ్యాఖ్యలను తాము పూర్తిగా ఖండిస్తున్నామని చెప్పారు. మంగళవారం మనోహర్ రెడ్డి మాట్లాడిన తీరును వింటుంటే దయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లు ఉందని ఎద్దేవా చేసిన ఆయన,వారి అబద్ధపు మాటలను ప్రజలు నమ్మే ప్రసక్తి లేదన్నారు. అసలు వడ్ల కొనుగోలు విషయంలో మాట్లాడే కనీస నైతిక అర్హత బీఆర్ఎస్ పార్టీకి గానీ,మనోహర్ రెడ్డికి గానీ లేదని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ పాలనలో రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలో క్వింటాలుకు 10 నుండి 15 కిలోల వరకు తరుగు పేరిట కోతలు విధించి రైతుల నడ్డి విరిచింది నిజం కాదా అని ప్రశ్నించారు. ఆనాడు రైతులు పడ్డ ఇబ్బందులను ఎక్కడికి వెళ్లినా ఇప్పటికీ చెబుతుంటారని గుర్తు చేశారు. గత ప్రభుత్వానికి భిన్నంగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతన్నలకు అండగా నిలుస్తోందని,తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో ఎలాంటి కోతలు లేకుండా అత్యంత పారదర్శకంగా కొనుగోలు ప్రక్రియ జరుగుతోందని,అందుకే రాష్ట్రంలోనే వరి కొనుగోళ్లలో పెద్దపల్లి నియోజకవర్గం నాల్గవ స్థానంలో నిలిచిందని వివరించారు. అలాగే మార్కెటింగ్ సదుపాయం లేకపోయినా, రైతులకు నష్టం జరగకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం నష్టాన్ని భరిస్తూ మార్క్‌ఫెడ్ ద్వారా మక్కలను కొనుగోలు చేస్తోందన్నారు. అక్రమ దందాల గురించి మనోహర్ రెడ్డికి తెలిసినంతగా రాష్ట్రంలో మరెవరికీ తెలియదని,గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇసుక మాఫియా,మట్టి అక్రమ దందాలకు పాల్పడింది ఎవరో నియోజకవర్గ ప్రజలందరికీ బాగా తెలుసని దుయ్యబట్టారు. మనోహర్ రెడ్డి శాసనసభ్యుడిగా ఉన్నప్పుడు మట్టి అక్రమ రవాణా చేసి వారి విద్యాసంస్థల్లో నిలువ చేసుకున్నారని,గతంలో పెద్దపల్లి పట్టణంలోని వ్యవసాయ గోదాం రేకులు సైతం ఎత్తుకుపోయిన ఘనత ఆయనదేనని ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత,ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గంలో చివరి ఆయకట్టు ప్రాంతానికి సైతం సాగునీరు అందించి రైతన్నల మోహాల్లో ఆనందం చూశామని చెప్పారు. తమ ప్రభుత్వం రాజకీయాలకు,పార్టీలకు అతీతంగా రైతుల సంక్షేమం కోసం పని చేస్తుంటే..బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీష్ రావుల ప్రమేయంతో ఇక్కడ ప్రెస్ మీట్లు పెట్టి విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కొందరు తాబేదార్లను వాడుకుని కొనుగోలు కేంద్రాల వద్ద గందరగోళం సృష్టించి,రైతులను మభ్యపెట్టాలని చూస్తే సహించేది లేదని ప్రభుత్వ విప్ విజయరమణ రావు తీవ్రంగా హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు, డైరెక్టర్లు,సింగిల్ విండో చైర్మన్లు,మున్సిపల్ చైర్మన్లు,కౌన్సిలర్లు,వివిధ గ్రామాల సర్పంచులు,ఉపసర్పంచులు,కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు,ఇతర ముఖ్య నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రామాల్లో అలజడులు సృష్టించడం అవివేకం

## కంప్యూటర్ యుగంలోనూ కుల వివక్షా

### పెగడపల్లి ఘటనపై బీఎస్పీ మండిపాటు - బీఎస్పీ జిల్లా అధ్యక్షులు రాజనర్సయ్య

పెద్దపల్లి,మే20:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలం పెగడపల్లి గ్రామంలో జరిగిన బోనాల జాతర వివాదంపై బహుజన సమాజ్ పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షులు ఇరికిల రాజనర్సయ్య,పార్లమెంట్ ఇంచార్జ్ కాదాసి రవీందర్ మాట్లాడుతూ పెగడపల్లి గ్రామంలో ఎల్లమ్మ తల్లి బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకునే క్రమంలో,బహుజన వర్గాల వారు బోనాలు తీయడాన్ని కొందరు అడ్డుకోవడం సరైనది కాదన్నారు. గతంలో బీసీ,ఎస్సీ,ఎస్టీ వర్గాలన్నీ ఒకే వర్గంగా కలిసికట్టుగా పండుగలు,ఉత్సవాలు జరుపుకునేవారని వారు గుర్తు చేశారు. కానీ నేడు కంప్యూటర్ యుగంలో జీవిస్తున్నప్పటికీ,మనుషుల్లో కుల,మత బేధాలు రావడానికి అగ్రవర్ణ ధోరణులు,పెట్టుబడిదారీ రాజకీయ వ్యవస్థలు, మనువాద పార్టీలే కారణమని మండిపడ్డారు. సమాజంలో ఇలాంటి వ్యత్యాసాలను పెంచి పోషిస్తూ,విచక్షణ కోల్పోయి అలజడులు సృష్టించడం కొందరి అవివేకానికి నిదర్శనమని వారు స్పష్టం చేశారు. ఇప్పటికైనా పట్టణాల్లో,గ్రామాల్లో ఉ





ండే బీసీ,ఎస్సీ,ఎస్టీ బహుజన బిడ్డలంతా ఒకే వర్గంగా కలిసికట్టుగా పండుగలు జరుపుకోవాలని,అలాగే అంతా ఒక్కటై రాజ్యాధికారం సాధించుకోవాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో ఇలాంటి వివక్షాపూరిత సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వ అధికారులు,రాజకీయ నాయకులు తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షులు నర్ల గోపాల్ యాదవ్,కార్యవర్గ సభ్యులు బొంకురి రమేష్,రామగుండం ఇంచార్జ్ జింక ఉదయ్,పెద్దపల్లి నియోజకవర్గ అధ్యక్షులు బొంకూరి దుర్గయ్య,పట్టణ అధ్యక్షురాలు రామిల్ల శారద తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ప్రమోషన్ ప్రక్రియను వేగవంతం చేయాలి

## - జిల్లా విద్యాశాఖాధికారి జి.శారద



పెద్దపల్లి:మే 20:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

పెద్దపల్లి మండల విద్యా వనరుల కేంద్రాన్ని జిల్లా విద్యాశాఖాధికారి జి.శారద బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సమగ్ర శిక్ష ప్లానింగ్ కో-ఆర్డినేటర్ మల్లేష్ గౌడ్‌తో కలిసి నిర్వహించిన ఈ తనిఖీల్లో..ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా విధులకు గైర్హాజరైన పలువురు సిబ్బందిపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు,వారి వివరాలను అటెండెన్స్ రిజిస్టర్‌లో నమోదు చేయించారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమీక్షా సమావేశంలో డిఈఓ మాట్లాడుతూ ప్రస్తుతం ఆన్‌లైన్‌లో జరుగుతున్న విద్యార్థుల కుల వివరాల నమోదు,అలాగే 2026-27 విద్యాసంవత్సరానికి సంబంధించిన విద్యార్థుల ప్రమోషన్ ప్రక్రియ,ఆన్‌లైన్ స్టేటస్‌ను క్షుణ్ణంగా పరిశీలించి,పెండింగ్ పనులను యుద్ధప్రాతిపదికన వేగవంతం చేయాలని ఆదేశించారు. డిఈఓ కార్యాలయం నుండి వచ్చే ఆదేశాలకు సకాలంలో స్పందిస్తూ అప్పగించిన బాధ్యతలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని,విధు నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే ఎంతటి వారైనా సహించేది లేదని,శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖాధికారి జి.శారద ఈ సందర్భంగా సిబ్బందిని హెచ్చరించారు.

# యధావిధిగా నీటి సరఫరా



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి మే 20(ప్రజాకలం) ఎండాకాలం వల్ల తాగునీటికి ఇబ్బంది అవుతుందని గమనించి అనివార్య కారణాల వలన మిషన్ భగీరథ పంప్ హౌస్ దగ్గర వాల్ రిపేర్ చేయడం వాయిదా వేయడం జరిగిందని మెట్ పల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్ వెల్లడించారు. ఈ కారణంగా 21-5-2026 నుండి మిషన్ భగీరథ మంచినీరు యథావిధిగా సరఫరా చేయబడుతుందని మున్సిపల్ కమిషనర్ డి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

# ఆలయ కోనేరులో పడి ముగ్గురు చిన్నారుల మృత్యువాత

### మేడిపల్లి మండలం కొండాపూర్ లో విషాదం

### ఆలయ కోనేరులో పడి ముగ్గురు చిన్నారుల దుర్మరణం



జగిత్యాల ప్రతినిధి మే 20 (ప్రజాకలం) జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం కొండాపూర్ గ్రామంలోని శివగంగ ఆలయ కోనేరులో పడి ముగ్గురు పదేళ్ల లోపు చిన్నారులు మృత్యువాత పడిన ఘటన బుధవారం గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. శర్విందే (7) మాన్విత్ సాయి (11) మనస్విని (8) ముగ్గురు అక్క,చెల్లెళ్ల పిల్లలు కాగా, మాన్విత్, మనస్విని లు వేసవి సెలవులకు చిన్నమ్మ ఇంటికి వచ్చి ఇక్కడే ఉంటున్నారు. సాయంత్రం పూట ముగ్గురు చిన్నారులు ఆడుకోవడానికి బయటకు వచ్చి గ్రామంలోని కోనేరు సమీపంలో ఆడుతూ ప్రమాదవశాత్తు అందులో పడిపోయినట్లు తెలుస్తోంది. లోతు ఎక్కువగా ఉండటంతో నీటి నుంచి బయటకు రాలేక ఊపిరాడక ముగ్గురూ నీటిలోనే ప్రాణాలు విడిచారు. గమనించిన స్థానికులు పోలీసుల సహాయంతో మృతదేహాలను బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రి మార్చురుకి తరలించారు ఇదిలా ఉంటే కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మేడిపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కాగా చిన్నారుల మృతితో కుటుంబ సభ్యులు గుండెలు పగిలేలా రోదించిన తీరు చూపరులను కలచివేసింది.

# అభివృద్ధి నిధుల కోసం కలెక్టర్ కు వినతి

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి మే 20 (ప్రజాకలం) పట్టణంలో పలు అభివృద్ధికి, కుక్కల నివారణ కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని బుధవారం జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ కు మెట్ పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపురి లింబాద్రి ఆధ్వర్యంలో ఒక వినతి పత్రాన్ని అందించారు. కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్ బి.రాజ గౌడ్ కు కూడా వినతి పత్రం ఇచ్చినట్లు మైలారపు లింబాద్రి తెలిపారు. వారి వెంట వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, కౌన్సిలర్స్ నరేశ్, రమేశ్, నరేశ్, అజీమ్ ఉన్నారు.



## మృతుడి కుటుంబానికి 10 లక్షల రూపాయల చెక్కును అందజేసిన హెచ్ బి ఎల్ యాజమాన్యం



నందిగామ మే 20 (ప్రజా కలం): ప్రతినిధి

నందిగామ మండల కేంద్రంలోని అంతిరెడ్డి గూడా గ్రామస్తుడైన మల్లేష్ అనే యువకుడు నందిగామలోని ( హెచ్ బి ఎల్ ) పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు కొన్ని రోజుల క్రితం పరిశ్రమలో విధులు నిర్వహిస్తుండగా గుండెపోటుతో మరణించాడు.ఇట్టి విషయంపై షాద్నగర్ నియోజకవర్గ శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్ చొరవతో మల్లేష్ కుటుంబ సభ్యులకు హెచ్ బి ఎల్ పరిశ్రమ మేనేజర్ అబ్దుల్ కలాం బుధవారం షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేతుల మీదుగా రూ.10 లక్షల రూపాయల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొమ్ము కృష్ణ, అంతి రెడ్డి గూడ సర్పంచ్ భర్త గడ్డల యాదగిరి, నందిగామ ఉప సర్పంచ్ సారా వెంకటేష్, గౌడ్ ,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేపల్లె కుమార్ గౌడ్ , మాజీ మండల అధ్యక్షుడు జంగ నరసింహులు, హెచ్ బి ఎల్ నిర్వాకులు కృష్ణారెడ్డి, రాజశేఖర్ రెడ్డి , శ్రీకాంత్ గౌడ్, సిద్దాపూర్ శేఖర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## భగీరథ.. మాకు ఎన్నాళ్లీ ఈ వ్యథ

### రెండు నెలలుగా చుక్క నీరు లేదు.. కలుషిత బోరు నీళ్లతో ప్రజల అవస్థలు

### కలుషిత నీళ్లతో ప్రజల ప్రాణాలపై ప్రయోగమా..?

### వేసవిలో నీటి కష్టాలు.. భగీరథ ఎక్కడ..?

### ప్రజల దాహం కన్నా అధికారుల నిర్లక్ష్యమే ఎక్కువ!

### భగీరథ ట్యాంక్ ఖాళీ.. ప్రజల సహనం కూడా ఖాళీ

నందిగామ 20 మే (ప్రజా కలం):ప్రతినిధి నందిగామ మండలంలోని సిడి తండా



గ్రామపంచాయతీలో తాగునీటి సమస్య రోజురోజుకు తీవ్రరూపం దాల్చుతోంది. వేసవి ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్న వేళ మిషన్ భగీరథ నీళ్ల గత రెండు నెలలుగా రాకపోవడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు బోరు నీళ్లపైనే ఆధారపడాల్సి వస్తోంది. అయితే ఆ నీళ్లు కూడా కెమికల్ కలిసినట్లుగా దుర్వాసన వస్తోందని, తాగడానికి పనికిరావడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇక గ్రామంలోని భగీరథ వాటర్ ట్యాంక్‌లో చుక్క నీరు లేకపోవడంతో పాటు పరిశుభ్రత పూర్తిగా లేకపోవడంతో కంపు కొడుతోందని స్థానికులు మండిపడుతున్నారు. తాగునీటి సమస్యపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని ఆరోపిస్తున్నారు. గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో గ్రామ సర్పంచ్ ఒక్కసారైనా స్పందించి ప్రజల సమస్యలను పట్టించుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సిడి తండా గ్రామపంచాయతీలో భగీరథ మంచినీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## గో టు విలేజ్ మాదిగ పల్లెలకు తరలండి కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం

### - "పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గారు ఇచ్చిన 40 రోజుల కార్యచరణను విజయవంతం చేయండి ..."



నందిగామ మే 20 (ప్రజా కలం): ప్రతినిధి

పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ గారి ఆదేశాల మేరకు విద్యా , సంస్థగత నిర్మాణం , జెండా ఆవిష్కరణల కోసం మాదిగ పల్లెల్లోకి ప్రతి ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి మరియు అనుబంధ సంఘాల నాయకులు వెళ్లి అక్కడి మాదిగ యువతను చైతన్యం చేసే విధంగా ముందుకు సాగాలని ఎమ్మార్పీఎస్ నందిగామ మండల ఇంచార్జి చెన్న గళ్ళ అశోక్ మాదిగ అన్నారు ఈరోజు రంగారెడ్డి జిల్లా నందిగామ మండల కేంద్రం నందిగామ గ్రామ (ఎంఆర్పీఎస్) అధ్యక్షులు నాన్నగారి అంజయ్య మాదిగ అధ్యక్షతన జరిగిన నందిగామ (ఎంఆర్పీఎస్) ముఖ్య నాయకుల మండల సమావేశంలో ముఖ్యఅతిథిగా (ఎంఆర్పీఎస్) నందిగామ మండల ఇంచార్జి చెన్న గళ్ళ అశోక్ మాదిగ గారు మాట్లాడుతూ ఎస్సీల వర్గీకరణ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గారి నాయకత్వంలో 30 ఏళ్లు పోరాటం చేసి వర్గీకరణ సాధించుకున్నామని ఈ సాధించుకున్న వర్గీకరణ ఫలాలను మన జాతి బిడ్డలు అందిపుచ్చుకునేలా వారిని చైతన్యం చేయడం కోసం పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గారు ఇచ్చిన కార్యచరణలో భాగంగా గో టు విలేజ్ మాదిగ పల్లెలకు తరలండి కార్యక్రమం ఈనెల 25 నుండి మొదలుకొని జూలై 05 వరకు జరుగుతుందని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఇంతకుముందునందిగామ మండల పరిధిలో ఉన్న అన్ని గ్రామాలకు నూతన కమిటీల నిర్మాణం జరిగిందని అలాగే ఎక్కడైతే గ్రామాలలో నూతన కమిటీలు నిర్మాణం జరగలేదో అక్కడ ఎంఆర్పీఎస్ మరియు ఎంఎస్పి అనుబంధ సంఘాల గ్రామ కమిటీలు నిర్మాణం చేసి అలాగే ఎక్కడైతే గ్రామాలలో ఎమ్మార్పీఎస్ గద్దెల (దిమ్మలు) నిర్మాణం జరగలేదో అక్కడ నూతన గద్దెనిర్మాణాలు చేసి ఏదైతే మాదిగలకు పండుగ దినోత్సవం అయినా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం జూలై 7 తోని 32వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ప్రతి గ్రామ గ్రామాన ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణలు జరిపించి ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో (ఎం ఆర్ పి ఎస్ ) నందిగామ మండల ఇంచార్జి చెన్నగళ్ళ అశోక్ మాదిగ, ( ఎం ఆర్ పి ఎస్) నందిగామ గ్రామ అధ్యక్షులు నాన్నగారి అంజయ్య,మాదిగ, బొమ్మగళ్ల నర్సింహా మాదిగ వార్డు (మెంబెర్ ) సప్పిడి మహేష్ మాదిగ, బొమ్మగాళ్ల బాబు మాదిగ, తుప్పుడు షామయ్య మాదిగ జంగయ్య మాదిగ యాదయ్య,లక్ష్మణ్ నాయక్,కృష్ణయ్య, రాజు, బిషపతి,తదితరులు పాల్గొన్నారు

# చరిత్ర తిరగరాయాలి కేసీఆర్‌ను సీఎం చేయాలి

### పార్టీ సభ్యత్వ నమోదులో ఉత్సాహంగా పని చేయాలి - మాజీ ఎంపీ నామ

ఖమ్మం మే 20(ప్రజా కలం న్యూస్ )

కేసీఆర్ పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలే బీఆర్ఎస్ పార్టీకి బలం అని కార్యకర్తలు, నాయకులే బలగమని అని బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం నాడు ఖమ్మంలోని తెలంగాణ భవన్ నందు ఎమ్మెల్సీ, పార్టీ ప్రధాన కార్యదర్శి తక్కెళ్లపల్లి రవీందర్ రావు అధ్యక్షతన ఖమ్మం, మధిర, వైరా, ఇల్లందు నియోజకవర్గాల సభ్యత్వ నమోదు మండల ఇంచార్జ్‌ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రలతో కలిసి మాజీ పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం అభివృద్ధికి కేసిఆర్ చేసిన కృషిని కొనియాడారు. మరల చరిత్ర తిరగరాసి కేసిఆర్‌ను ముఖ్యమంత్రిగా చేయాలని పిలుపునిచ్చారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతంగా ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. లక్షలాది మంది కార్యకర్తల బలం ఒక్క బీఆర్ఎస్ పార్టీకే సొంతమన్నారు. పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు ప్రవేశపెట్టిన సమయంలో తాను తొలి ఓటు వేశానని, ఆ సందర్భానికి కేసిఆర్ సాక్షిగా ఉన్నారని గుర్తుచేశారు. గత రెండు దశాబ్దాలుగా ఉద్యమకారులు, కార్యకర్తలు, నాయకులు పార్టీకి అందించిన సేవలు అమూల్యమని



పేర్కొన్నారు. జిల్లాలో 10కు 10 అసెంబ్లీ స్థానాలు గెలుచుకోవడం అవసరమని, అందుకు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. యువతను చైతన్యవంతం చేయాలని, మండల ఇంచార్జ్‌లకు భవిష్యత్‌లో పార్టీ ప్రాధాన్యత కల్పిస్తుందని తెలిపారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు ఎలాంటి కష్టాల్లో ఉన్నా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పదవులు లేకపోయినా సేవలందిస్తున్న వారికి పార్టీ తగిన గుర్తింపు, అవకాశాలు కలిపిస్తుందని పేర్కొన్నారు. పార్టీ సభ్యత్వ నమోదులో ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పని చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే హరి ప్రియ, డీసీసీబీ మాజీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం, పగడాల నాగరాజు, ఆర్జేసి కృష్ణ, దిండిగల రాజేందర్, ఖమర్, మంజుల, గిరిబాబు, మండల, పట్టణ ఇంచార్జిలు, తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం ఖిల్లాలో ఘనంగా హెరిటేజ్ వాక్ నిర్వహణ

### - జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి తుంబురు సునీల్ రెడ్డి

### - ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పర్యాటక ఉత్సవాలు

### - ఖిల్లా చారిత్రక ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పన

### - పర్యాటక అభివృద్ధికి హెరిటేజ్ కార్యక్రమాలు దోహదం చేస్తాయి

### - జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో హెరిటేజ్ వాక్ విజయవంతం



ఖమ్మం, మే 20( ప్రజా కలం న్యూస్ )

ఖమ్మం ఖిల్లాలో హెరిటేజ్ వాక్ కార్యక్రమం ఘనంగా నిర్వహించామని జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి తుంబురు సునీల్ రెడ్డి తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం ఖమ్మం ఖిల్లాలో నిర్వహించిన హెరిటేజ్ వాక్ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి తుంబురు సునీల్ రెడ్డి పాల్గొన్నారు.

జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి తుంబురు సునీల్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 18 నుండి మే 23 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న పర్యాటక ఉత్సవాల నేపథ్యంలో ఖమ్మం ఖిల్లా నుండి జాఫర్ బావి వరకు హెరిటేజ్ వాక్ నిర్వహించామని తెలిపారు.

ఖమ్మం ఖిల్లా మెట్లు వద్ద ప్రారంభమైన ఈ హెరిటేజ్ వాక్ ఖిల్లా పైభాగం వరకు కొనసాగి అనంతరం జాఫర్ బావి వరకు నిర్వహించా మనీ, విజయవంతంగా హెరిటేజ్ వాక్ పూర్తయిందనీ,కార్యక్రమంలో అనేక మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సహకారం అందించారని తెలిపారు.

ఈ కార్యక్రమం ద్వారా ఖమ్మం ఖిల్లా చారిత్రక ప్రాముఖ్యతతో పాటు జిల్లాలోని పర్యాటక అభివృద్ధి అవకాశాలపై విద్యార్థులకు, యువతకు అవగాహన కల్పించామని తెలిపారు.పర్యాటక రంగ అభివృద్ధికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పర్యాటక ఉత్సవాలకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ అసిస్టెంట్ ఇంజనీర్ నరేష్ నాయక్, టూరిజం శాఖ సిబ్బంది జె. చంద్రశేఖర్ ఆజాద్, హెరిటేజ్ విభాగం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సరైన ప్రణాళిక, ముందస్తు జాగ్రత్తలతో వరద విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చు

### - లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించాలి

### - వరద సహాయక శిబిరాల్లో అన్ని మౌళిక సదుపాయాలు కల్పించాలి

### - మ్యాన్‌హోల్స్ మూసివేత, ప్రమాదకర ప్రాంతాల గుర్తింపుకు ప్రాధాన్యత

### - వరద విపత్తుల సన్నద్ధతపై సమీక్షించిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

ఖమ్మం, మే 20( ప్రజా కలం న్యూస్)

సరైన ప్రణాళిక, ముందస్తు జాగ్రత్తలతో వరద విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన వరద విపత్తుల సన్నద్ధత సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పాల్గొని అధికారులతో ఖమ్మం, ఎదులాపురం మున్సిపాలిటీలు, సంబంధిత అధికారులతో సమగ్రంగా చర్చించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, గత అనుభవాలను పరిశీలిస్తే ఖమ్మం, ఎదులాపురం ప్రాంతాలు వరదల ప్రభావానికి అధికంగా ప్రభావానికి గురవుతున్నాయని తెలిపారు. నీటి మట్టం 16 అడుగులకు చేరుకుంటే మొదటి దశ హెచ్చరిక, 19 అడుగులకు రెండవ దశ హెచ్చరిక, 24 అడుగులకు చివరి దశ హెచ్చరికలు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు.లోతట్టు, ముంపు ప్రాంతాల ప్రజలను ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. ప్రజలు సహకరించకపోయినా ప్రాణనష్టం జరగకుండా అవసరమైన పరిస్థితుల్లో తప్పనిసరిగా ఎవాక్యుయేషన్ చేపట్టాలని స్పష్టం చేశారు.లోతట్టు ప్రాంతాల ప్రజలను మానసికంగా ముందుగానే సిద్ధం చేయాలని, సహాయక శిబిరాలకు అవసరమైన వస్తువులు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. పడవలు, లైఫ్ జాకెట్లు, టార్చ్ లైట్లు, జిప్ కవర్లు తదితర సామగ్రిని సిద్ధంగా ఉంచడంతో పాటు మంచి ఈతగాళ్లను గుర్తించి అప్రమత్తంగా ఉంచాలని తెలిపారు.పునరావాస కేంద్రాలను ముందుగానే గుర్తించాలని, అవి ముంపు ప్రాంతాలకు సమీపంలో ఉండేలా చూడాలని సూచించారు. వరదల సమయంలో ఎగువ, దిగువ ప్రాంతాల నీటి మట్టాలను నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. వరదల సమయంలో ఇళ్ల కూలిపోవడం, చెట్లు, విద్యుత్ స్తంభాలు



కూలిపోవడం వల్లే అధికప్రాణనష్టం సంభవిస్తుందని పేర్కొంటూ అలాంటి ప్రమాదాలను పూర్తిగా నివారించేలా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని అధికారులకు సూచించారు.ప్రతి సహాయక శిబిరంలో ఆహారం, పారిశుద్ధ్యం, త్రాగునీరు, విద్యుత్ తదితర మౌళిక సదుపాయాలు సమృద్ధిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.మున్సిపల్ ప్రాంతాల్లో మ్యాన్‌హోల్స్‌ను పూర్తిస్థాయిలో పరిశీలించి మూసివేయాలని తెలిపారు. అభివృద్ధి పనుల కోసం తవ్విన ప్రదేశాలను స్పష్టంగా గుర్తించేలా డీమార్కేషన్ చేయాలని సూచించారు.వరదల సమయంలో క్షేత్రస్థాయి సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి సమర్థవంతంగా పనిచేసేలా చూడాలని తెలిపారు. వరద ప్రవాహ మార్గాలు, ముంపు ప్రాంతాలపై పూర్తి నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. వరదల సమయంలో పారిశుధ్య నిర్వహణ అత్యంత సమర్థవంతంగా ఉండాలని, వాతావరణ అంచనాల ప్రకారం ముందస్తు అప్రమత్తతతో వ్యవహరించాలని సూచించారు. సరైన ప్రణాళిక జాగ్రత్తలతో వరదలను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో ఖమ్మం మునిసిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, ఎదులాపురం మునిసిపల్ కమీషనర్ శ్రీనివాస్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నూతన సీ ఐ ను మర్యాద పూర్వకంగా కలసిన పంతాడి అంజి



ప్రజాకలం ప్రతినిధి ఎటపాక, మే 20: ఎటపాక పోలీస్ స్టేషన్ సీ ఐ గా నూతనంగా భాద్యతలు చేపట్టిన వి.కృష్ణ ను బుధవారం టీ డి పీ ఎటపాక మండలం మచ్చ శాఖ వైస్ ప్రెసిడెంట్, పురుషోత్తపట్నం పంచాయతీ గ్రామ కమిటీ ఉపధ్యక్షులు పంతాడి అంజి స్థానిక పోలీస్ స్టేషన్లో మర్యాద పూర్వకంగా కలసి సన్మానం చేసి శుభాకాంక్షలు తెలియజేసారు.ఎటపాక మండలంలో శాంతి భద్రతలను పరిరక్షించాలని కోరారు.

## గంజాయి విక్రయిస్తున్న నిందితుడు అరెస్ట్

### - రిమాండ్ కి తరలింపు

### - నిందితుని వద్ద నుండి ఒక కిలో గంజాయి స్వాధీనం - నిర్మల్ డిఎస్పీ శ్రీనివాస్

నిర్మల్ మే20 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఆదేశాల మేరకు విశ్వసనీయ సమాచారంతో ఖానాపూర్ మండలం రామరెడ్డిపల్లి



బస్ స్టాప్ సమీపంలో ఆకస్మిక దాడి నిర్వహించి,బీహార్ రాష్ట్రానికి చెందిన మనీష్ పాస్వాన్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని నిందితుడి వద్ద నుండి ఒక కిలో (లక్ష రూపాయల విలువ) గల గంజాయి,ఒక రియల్‌మీ మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో నిందితుడు బీహార్ రాష్ట్రం నుండి గంజాయి తీసుకువచ్చి ఖానాపూర్ ప్రాంతంలో చిన్న చిన్న ప్యాకెట్ల రూపంలో విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నాడు.ఈ దాడిని, స్వాధీనం,విచారణ ప్రక్రియ మొత్తం కూడా ఈ-సాక్ష్య యాప్ ద్వారా వీడియో చిత్రీకరణ చేయడం జరిగింది.నిందితుడిపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. మాదకద్రవ్యాల వ్యాపారం, సరఫరా,గంజాయి సాగుపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.ఈ కేసును విజయవంతంగా ఛేదించిన నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, ఖానాపూర్ సీఐ అజయ్, ఎస్ఐ రాహుల్, పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ప్రత్యేకంగా అభినందించారు.

## భైంసాలో ప్రజల ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల

### - ప్రతీ ఫిర్యాదు పై తక్షణ స్పందన

### - బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు ఆదేశం



నిర్మల్ మే20 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

నిర్మల్ జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల బుదువారం భైంసా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా తమ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన లివృద్ధ దంపతులు జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ను కలిసి తమ సమస్యను విన్నవించుకున్నారు. వారి సమస్యను ఓర్పుతో విన్న జిల్లా ఎస్పీ వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అలాగే కుటుంబ కలహాల నేపథ్యంలో వచ్చిన తల్లి-కొడుకులతో జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా మాట్లాడి, పరస్పరం అవగాహనతో సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఇద్దరికీ నచ్చజెప్పి వారి సమస్యకు పరిష్కార మార్గం సూచించారు.వీటితో పాటు భైంసా సబ్‌డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన 8 మంది అర్జిదారుల నుండి ఫిర్యాదులను స్వీకరించి, ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించారు.ఫిర్యాదు దారుల ఎదుటే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, బాధితులకు చట్టపరంగా అవసరమైన సహాయాన్ని వెంటనే అందించాలని సూచించారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.కుటుంబ వివాదాల పరిష్కారంలో 'షీ టీం' పాత్ర:ఈ కార్యక్రమంలో వచ్చిన కొన్ని కుటుంబ సమస్యలపై షీ టీం సిబ్బంది ఇరు వర్గాలకు కౌన్సిలింగ్ నిర్వహించారు. కౌన్సిలింగ్ ద్వారా కుటుంబాలు తిరిగి కలుసుకోవడం జరిగింది. ప్రజలు నిర్మల్ వరకు రావడం కష్టంగా ఉండగా, భైంసాలోనే కౌన్సిలింగ్ కల్పించడం పై ఎస్పీ గారు చూపిన ఆలోచనను బాధితులు సంతృప్తిని వ్యక్తం చేశారు.

పెండింగ్ ఫిర్యాదులపై సమీక్ష:ఈ సందర్భంగా గతంలో గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కార స్థితి, ఇంకా పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని పెండింగ్ లో ఉన్న వాటిని వేగంగా పరిష్కరించాలన్నారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా యూత్ లీడర్షిప్ సదస్సు.

నిర్మల్ మే20 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని రాజీవ్ గాంధీ సాంకేతిక శిక్షణ కేంద్రం (ఐటిఐ) లో బుధవారం ప్రత్యేక కార్యక్రమం



జరిగింది. "యూత్ లీడర్ షిప్ సమ్మిట్" అనే అంశంపై నిర్వహించిన ఈ సదస్సులో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పలువురు అధికారులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం యువతలో నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ఎన్నో వినూత్న కార్యక్రమాలు చేపడుతోందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, దేశ రాజకీయాల్లో యువత పాత్ర అత్యంత కీలకమని స్పష్టం చేశారు. యువజన, క్రీడల శాఖ ద్వారా యువతకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమ్మిట్ సందర్భంగా విద్యార్థులకు ఉపన్యాస, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా పరిశ్రమల మేనేజర్ నరసింహారెడ్డి, ఉపాధి కల్పన అధికారి విజయలక్ష్మి, ఐటీఐ కన్వీనర్ కోటిరెడ్డి, ప్రిన్సిపల్ కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## కొయ్యూరు పంట పొలాల్లో అగ్నిప్రమాదం

**- దాన్యం కుప్పలకు తప్పిన ముప్పు...**



మల్హర్, మే 20 ప్రజాకలం ప్రతినిధి.... వరి కొయ్య కాళ్లకు నిప్పంటుకుని ఒక్కసారిగా మంటలు చెలరేగిన సంఘటన మల్హర్ మండలం కొయ్యూరు గ్రామ పరిధిలో చోటు చేసుకుంది. గుర్తుతెలియని వ్యక్తులు పొలాల్లో వరి ఎండుగడ్డికి పెట్టిన నిప్పుతో మంటలు వేగంగా వ్యాపిస్తూ పక్కనే రైతులు అమ్ముకోవడానికి ఆరబోసిన ధాన్యం కుప్పల వైపు దూసుకొచ్చాయి. గమనించిన రైతులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. కొద్ది క్షణాల్లోనే అగ్నిమాపక వాహనం ఘటనా స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా అదుపు చేసింది. సకాలంలో మంటలు ఆర్పడంతో అన్నదాతలు ఊపిరి పీల్చుకున్నారు. దీంతో భారీ ఆస్తి నష్టం తప్పింది.

## ప్రమాద సూచికల బోర్డులను రోడ్డుకు ఇరువైపులా నాటించిన పర్వతగిరి పోలీసులు




( వరంగల్/ పర్వతగిరి) మే 20, ప్రజాకలం ప్రతినిధి. బుధవారం పర్వతగిరి మండలంలో ఉన్న ఆర్ అండ్ బి రోడ్లకు ఇరువైపులా రోడ్డు ప్రమాదాలు నివారించడానికి వరంగల్ సిపి సంప్రీత్ సింగ్ ఐపీఎస్, ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్ కుమార్ ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాలను నివారించడానికి, పర్వతగిరి మండల ప్రజల భద్రత కొరకు ఏసిపి మామునూరు ఎన్ వెంకటేష్, పర్వతగిరి సర్కిల్ ఇన్స్పెక్టర్ బి. రాజగోపాల్ సూచనల మేరకు పర్వతగిరి ఎస్ హెచ్ ఓ బి. ప్రవీణ్ 30 ప్రమాద హెచ్చరిక బోర్డులను పర్వతగిరి మండలం ప్రైవేటు స్కూలు యాజమాన్యాల సహకారంతో తయారు చేయించి రోడ్డు ఇరువైపులా పెట్టించినారు. పర్వతగిరి మండల ప్రజలందరూ ఇట్టి ప్రమాద సూచికలను పాటించి క్షేమంగా తమ ఇళ్లకు చేరుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## కడపలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీ నాగేంద్ర మాధవ్‌ను కలిసిన బద్వేల్ ఏఎంసీ చైర్‌పర్సన్ సుప్రజ

పోరుమామిళ్ల : పండిట్ దీన్ దయాల్ ప్రశిక్షణ కార్యక్రమంలో భాగంగా కడప నగరానికి విచ్చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీ నాగేంద్ర మాధవ్ ని బద్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సుప్రజ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా బద్వేల్ నియోజకవర్గంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు అందుతున్న సేవలు, జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఆమె నాగేంద్ర మాధవ్ గారికి వివరించారు.

రైతు శ్రేయస్సే ముఖ్యం : పీవీ నాగేంద్ర మాధవ్ – సుప్రజ గారి వివరణపై స్పందించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఆమె పనితీరును ప్రత్యేకంగా అభినందించారు. అన్నదాతల సంక్షేమమే ధ్యేయంగా, రైతు శ్రేయస్సు కోసం భవిష్యత్తులో మరిన్ని మంచి కార్యక్రమాలు చేపడుతూ, ఇంకా బాగా పనిచేయాలని ఆమెకు దిశానిర్దేశం చేశారు. చైర్‌పర్సన్‌గా రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు."రైతుల సంక్షేమం కోసం నిరంతరం శ్రమించే నాయకులకు ఎప్పుడూ గుర్తింపు ఉంటుంది. సుప్రజ బద్వేల్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గామరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలి." పీవీ నాగేంద్ర మాధవ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఈ సమావేశంలో పలువురు బీజేపీ ముఖ్య నేతలు, మార్కెట్ కమిటీ ప్రతినిధులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వెంకటాపురం జోరుగా మట్టి తోలకలు

**- చెరువును తవ్వి నల్లమట్టి తరలింపు**

**- కన్నెత్తి చూడని రెవెన్యూ ఇరిగేషన్ శాఖ అధికారులు**

గోకవరం : మండలంలో ఎటువంటి అనుమతులు లేకుండా వెంకటాపురం చెరువు నల్ల మట్టి తరలిస్తున్నారు . జెసిబిలతో చెరువుని తవ్వి అక్రమంగా మట్టి తరలిస్తున్నారు. గత రెండు నెలలుగా అక్రమ మట్టి తరలింపులు జరుగుతున్నాయి. ఇంత అక్రమ మట్టి తరలించిపోతున్న ఇరిగేషన్ శాఖ రెవెన్యూ శాఖ అధికారులు మాత్రం పట్టించుకోకపోవడం కోస మెరుపు. తూతూ మంత్రంగా పరిమిషన్ లు తీసుకొని అక్రమంగా ఇటుక బట్టీలకు మట్టి అమ్ముకుంటున్నారు. అక్రమంగా లక్షలు మట్టి అమ్ముకుంటున్న స్థానిక ప్రజాప్రతినిధులు గాని ప్రభుత్వ అధికారులు కానీ స్పందించకపోవడం గమనార్హం. అక్రమ మట్టి తరలింపులు ఎనకాల బడా బాబులు హస్తం ఉన్నట్లు కూడా ప్రసారం జోరుగా సాగుతుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మట్టి మాఫియా రెచ్చిపోతుందని గుసగుసలు జోరుగా వినిపిస్తున్నాయి. చెరువును చూస్తే అక్రమార్కులు కన్నేసి రైతుల పేరు మీద తూతూ మంత్రంగా పర్మిషన్ తెచ్చుకొని అక్రమంగా మట్టి అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్న అధికార పార్టీ యంత్రాంగం మాట వరుసకు పెదిత ప్రతిపక్షం కూడా నోరు ఎత్తకపోవడం పలు అనుమానాలు తావిస్తోంది. ఇప్పటికైనా సంబంధించిన శాఖ అధికారులు స్పందించి వెంకటాపురం చెరువు తవ్వి అక్రమంగా నల్ల మట్టి తరలిస్తున్న వారు పైన చర్యలు తీసుకుని అక్రమ మట్టి అడ్డుకట్టు వేయాలని పలువురు కోరుతున్నారు

## 63 అంతస్తులతో స్కైవెన్ ప్రాజెక్ట్

హైదరాబాద్ : ప్రీమియం లగ్జరీ నివాసాలను అందించేందుకు ఈన్ఫ్రా, పింగ్లే వెంచర్స్ అండ్ రియాల్టీ (పీవీఆర్) సంస్థలు 'ది స్కైవెన్' పేరుతో హైదరాబాద్ కోకాపేట్ లో 63 అంతస్తుల నివాస భవనాన్ని కి సంబంధించిన పోస్టర్లు బంజారాహిల్స్ లోని పార్క్ హయత్ హోటల్లో బ్రోచర్ను ప్రారంభించారు. రెండెకరాల్లో 233 మీటర్ల ఎత్తుతో నిర్మిస్తున్న ఈ స్కైస్క్రాపర్ లో పెంట్ హౌస్లు, స్కై విల్లాలు, నాలుగు బెడ్రూమ్స్ ఇళ్లు అందుబాటులో ఉంటాయి. ఈ ప్రాజెక్టులో నివాసితులకు అంతర్జాతీయ స్థాయి వసతులు కల్పిస్తున్నట్లు ఈన్ఫ్రా భాగస్వామి రామస్వామి రెడ్డి తెలిపారు. భవనంపై భాగంలో రూఫ్టాప్ క్లబ్, ఇన్ఫినిటీ పూల్, నక్షత్రశాల, స్పా, వెల్నెస్ సెంటర్ హెలిప్యాడ్ కల్పిస్తున్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తాం

**- ఏ ఒక్క నిజమైన ఓటరు తమ ఓటు హక్కు కోల్పోకుండా చర్యలు:**

**- గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల తరుపున బిఎల్ఏ లను నియమించాలి: - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



నిర్మల్ మే20 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ (ఓటరు జాబితా ప్రత్యేక సవరణ, ఎస్ఐఆర్) ప్రక్రియను పూర్తి పారదర్శకంగా చేపడతామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు.

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, బుధవారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో, జిల్లాలో చేపట్టనున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియ వివరాలను సమగ్రంగా వివరించారు. జూన్ 25 వ తేదీ నుంచి ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభం అవుతుందని అన్నారు. బూత్ లెవెల్ అధికారులు (బిఎల్ఓ లు) ఓటర్ల వివరాలకు సంబంధించి ఇంటింటికి ఎన్యూమరేషన్ ఫారం లు ఇస్తారని అన్నారు. ఓటర్లు నింపిన వివరాలతో కూడిన ఎన్యూమరేషన్ ఫారం లు జూలై 24 తేదీ వరకు తిరిగి తీసుకుంటారు అని వివరించారు. ఓటర్లు తమ ఎన్యూమరేషన్ ఫారంలు ఎన్నికల సంఘం వెబ్ సైట్ ద్వారా ఆన్ లైన్ లో కూడా సమర్పించవచ్చునన్నారు. వివరాల పరిశీలన తర్వాత, ఎస్ఐఆర్ కి సంబంధించి, జూలై 31 వ తేదీన డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్ జాబితాను ప్రచురిస్తామని చెప్పారు. డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్ లో ఓటరు పేరు లేకపోతే తగిన ఆధారాలతో సంబంధిత ఫామ్ లను నింపి, ధ్రువీకరణ (డిక్లరేషన్) తో ఈఆర్ఓ లను సంప్రదించవచ్చునని చెప్పారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా తెలుపవచ్చునని స్పష్టం చేశారు. వివరాల పరిశీలన తర్వాత, అక్టోబర్ ఒకటవ తేదీన తుది ఎలక్టోరల్ రోల్ జాబితా ప్రదర్శిస్తామని వివరించారు.

ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహణకు సంబంధించి ప్రతి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ తరుపున బూత్ లెవెల్ ఏజెంట్ (బిఎల్ఏ) లను నియమించాలని తెలిపారు. అర్హులైన ఏ ఒక్క నిజమైన ఓటరు కూడా తమ ఓటు హక్కు కోల్పోకుండా, పారదర్శకంగా ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేస్తామని అన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులకు నియోజకవర్గ, మండల, గ్రామీణ స్థాయిలలో సమావేశాలు నిర్వహించి, ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించాలని తెలిపారు.

అనంతరం తహసిల్దార్ లు, అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియపై అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఏఈఆర్ఓ లు ఎస్ఐఆర్ ప్రక్రియను నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని తెలిపారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, ఖానాపూర్ ఈఆర్ఓ గంగాధర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తహసిల్దార్ లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర కేబినెట్ విస్తరణ...?



న్యూఢిల్లీ : దేశంలో ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసిపోయాయి. ఆయా రాష్ట్రాల్లో కొత్త ప్రభుత్వాలు కూడా ఏర్పడ్డాయి. ఇప్పుడు కేంద్రం వంతు వచ్చింది. మిషన్ 2029కి ఇప్పటి నుంచే మోడీ సన్నాహాలు మొదలు పెట్టినట్లుగా తెలుస్తోంది. ప్రభుత్వంలోనూ.. పార్టీలోనూ కీలక మార్పులు చేయాలని భావిస్తున్నట్లుగా సమాచారం. 2029లో తిరిగి అధికారంలోకి రావడమే లక్ష్యంగా భారీ మార్పులు జరగవచ్చని సంకేతాలు వెలువడుతున్నాయి. ఈనెల 26తో మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి కాబోతుంది. ఈ నేపథ్యంలో కేంద్ర కేబినెట్‌ను విస్తరించాలని భావిస్తున్నారు. మోడీ తన మొదటి, రెండవ పర్యాయాల్లో మంత్రివర్గాన్ని క్రమం తప్పకుండా విస్తరించారు. ప్రస్తుత మంత్రివర్గంలో 72 మంది సభ్యులు ఉండగా.. గరిష్టంగా 81 మంది మంత్రులను నియమించుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మంత్రివర్గ విస్తరణ చేయాలని భావిస్తున్నారు. ఇక ఇటీవల బీహార్, ఉత్తరప్రదేశ్‌లోని ఎన్డీఏ ప్రభుత్వాలు కూడా తమ మంత్రివర్గాలను విస్తరించాయి. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నవీన్ తన బృందాన్ని కూడా ఏర్పాటు చేస్తారని తెలుస్తోంది. ఈ క్రమంలోనే కేంద్ర మంత్రివర్గంలో మార్పులు జరుగుతాయనే ఊహాగానాలకు ఆజ్యం పోసింది. గత రెండు పర్యాయాలను పరిశీలిస్తే.. ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల తర్వాత నవంబర్ 2014లో మోడీ తన మంత్రివర్గాన్ని తొలిసారిగా విస్తరించారు. సుమారు ఏడాదిన్నర తర్వాత జూలై 2016లో రెండవ విస్తరణ జరిగింది. సెప్టెంబర్ 2017లో జరిగిన మొదటి పర్యాయపు చివరి విస్తరణలో పలువురు మంత్రులకు పదోన్నతి లభించింది. ఇక రెండవ పర్యాయంలో ప్రభుత్వం ఏర్పడిన దాదాపు రెండేళ్ల తర్వాత జూలై 2021లో మంత్రివర్గాన్ని తొలిసారిగా విస్తరించారు. మే 2023లో పోర్ట్‌ఫోలియోల పునర్వ్యవస్థీకరణ జరిగింది. ఇక మోడీ జూన్ 9, 2024న మూడవసారి ప్రమాణ స్వీకారం చేశారు. ఇప్పుడు రెండేళ్లు పూర్తికాబోతున్నాయి. ఫలితంగా మళ్లీ మంత్రివర్గ విస్తరణపై ఊహాగానాలు తీవ్రమయ్యాయి. ప్రస్తుతం మంత్రివర్గంలో 72 మంది సభ్యులు ఉండగా.. గరిష్టంగా 81 మంది మంత్రులను నియమించవచ్చు. కొంతమంది కొత్తవారికి అవకాశం ఇచ్చే అవకాశం ఉన్నప్పటికీ.. వారి పనితీరు ఆధారంగా కొంతమంది ప్రస్తుత మంత్రులను తొలగించాలనే చర్చ కూడా జరుగుతోంది. వచ్చే ఏడాది ఏడు రాష్ట్రాల్లో జరగనున్న ఎన్నికల దృష్ట్యా ప్రాంతీయ, కుల సమతుల్యత సాధించబడుతుందని భావిస్తున్నారు. ఒకవేళ విస్తరణ జరిగితే బీహార్ నుంచి ప్రాధాన్యత దక్కవచ్చని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇక బీజేపీ వర్గాల సమాచారం మేరకు.. పలువురు కొత్త ముఖాలను జాతీయ ప్రధాన కార్యదర్శులుగా నియమించే అవకాశం కూడా ఉంది. యువ అధ్యక్షుడు నితిన్ నబిన్‌తో సమన్వయం కొనసాగించేందుకు రాష్ట్రాల నుంచి జాతీయ స్థాయికి తీసుకువస్తారని తెలుస్తోంది.

# నీటిపారుదల రంగానికి కొత్త దిశ

## 36 ప్రాజెక్టులకు స్పష్టమైన గడువులు

**రాష్ట్ర జలవనరుల అభివృద్ధి శాఖ మంత్రి డా.నిమ్మల రామానాయుడు**

అమరావతి : రాష్ట్రంలోని మొత్తం 36 ప్రాజెక్టులకు స్పష్టమైన గడువు పెట్టుకుని పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికత్వ పూర్తి చేయాలనే లక్ష్యాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు నిర్దేశించడం జరిగిందని రాష్ట్ర జలవనరుల అభివృద్ధి శాఖ మంత్రి డా.నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలోమంత్రి నిమ్మల రామానాయుడు పాత్రికేయులతో మాట్లాడుతూ నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి అధ్యక్షతన ఇరిగేషన్ ప్రాజక్టులపై సమగ్ర సమీక్ష జరిగిందని, ఇందులో 25 పాత ప్రాజెక్టులతో పాటు 11 కొత్త ప్రాజెక్టులను గుర్తించి ప్రాధాన్యతా క్రమంగా పూర్తి చేయాలనే లక్ష్యాన్ని నీటిపారుటల శాఖకు నిర్ధేశించడం జరిగిందన్నారు. ప్రతి ప్రాజెక్టుకు శంకుస్థాపన, పురోగతి, పూర్తి గడువులు ఖచ్చితంగా నిర్దేశించబడటం జరిగిందన్నారు. 2026–2028 కాలానికి 36 ప్రాజెక్టుల సమగ్ర కార్యాచరణ ప్రణాళిక..గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన 25 ప్రాజెక్టులతో పాటు, సీఎం గుర్తించిన మరో 11 ప్రాజెక్టులను కలిపి మొత్తం 36 ప్రాజెక్టులకు స్పష్టమైన ప్రాధాన్యతా క్రమం, దశలవారీ గడువులు, అమలు ప్రణాళిక రూపొందించబడిందన్నారు. 2026 జూలై నాటికి పోలవరం ద్వారా ఉత్తరాంధ్రకు నీటి సరఫరా, గుంటూరు ఛానల్ మోడరేషన్ పనుల శంకుస్థాపన, తుంగభద్ర కొత్త 33 గేట్ల ప్రారంభం వంటి కీలక పనులు అమలులోకి వస్తాయన్నారు. 2026 ఆగస్టు నాటికి వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్–1 పూర్తి, అనంతపురం జిల్లాలో పేరూరు బ్రాంచ్ కెనాల్ శంకుస్థాపన, పాలేరు రిజర్వాయర్ పనులు ప్రారంభం కానున్నాయన్నారు. 2026 అక్టోబర్ నాటికి హంద్రీనీవా ఫేజ్–2 పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందన్నారు. నవంబర్ 2026లో నేరేడి బ్యారేజ్ శంకుస్థాపన జరగనుందన్నారు. 2026 డిసెంబర్ నాటికి పెన్నా–సర్వేపల్లి రిజర్వాయర్ పూర్తి చేయాలని నిర్ణయించడం జరిగిందన్నారు. 2027 జనవరి నాటికి మడ్డువలస స్టేజ్–2 పూర్తి కావడంతో పాటు నీవా బ్రాంచ్ కెనాల్ మూలపల్లి వరకు ప్రారంభం కానుందన్నారు. 2027 ఏప్రిల్ నాటికి హీరమండలం ఎత్తిపోతల లిఫ్ట్ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందన్నారు. 2027 జూన్ నాటికి నాగావళి–చంపావతి నదుల అనుసంధానం, బుడమేరు వరద రక్షణ పనులు, కొల్లేరు ప్రక్షాళన, ముక్త్యాల ఎత్తిపోతల పథకం మరియు పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయాలని ప్రణాళిక రూపొందించబడిందన్నారు. 2027 జూలై నాటికి వంశధార స్టేజ్–2, చింతలపూడి ఎత్తిపోతల పథకం, మహేంద్రతనయగజపతినగరం బ్రాంచ్ కెనాల్స్, తోటపల్లి డిస్ట్రిబ్యూటరీలు పూర్తి చేయాలని లక్ష్యం నిర్దేశించడం జరిగిందన్నారు. 2027 డిసెంబర్ నాటికి మూలపల్లి లిఫ్ట్ ద్వారా కళ్యాణి డ్యామ్ వరకు నీటి అనుసంధానం, మడకశిర బ్రాంచ్ కెనాల్, జంఝావతి రిజర్వాయర్ ప్రాజెక్టు పూర్తి చేయాలని నిర్ణయించడం జరిగిందన్నారు.

## ఉపాధి హామీ కూలీలకు అండగా వార్డు సభ్యుడు తిర్రి అశోక్ గౌడ్

**సొంత ఖర్చులతో మజ్జిగ పంపిణీ**



మల్హర్, మే 20 ప్రజాకలం ప్రతినిధి : మండుతున్న ఎండల నేపథ్యంలో మండల కేంద్రమైన తాడిచెర్ల గ్రామంలోని పెంజేరువు వద్ద పనులు చేస్తున్న ఉపాధి హామీ కూలీలకు తాడిచెర్ల ఐదో వార్డు సభ్యుడు తిర్రి అశోక్ గౌడ్ బుధవారం మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కూలీలు ఎండదెబ్బకు గురికాకుండా ఉండేందుకు తన సొంత ఖర్చులతో వీటిని అందజేసినట్లు వారు తెలిపారు. ఎండ తీవ్రత దృష్ట్యా కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వార్డు సభ్యుడి చొరవపై కూలీలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వారి వెంట పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మల్హర్ లో వడదెబ్బతో మరో మహిళ మృతి

**మల్లారంలో విషాదం... అనాథలైన ముగ్గురు పిల్లలు**



మల్హర్, మే 20 ప్రజాకలం ప్రతినిధి

మండల పరిధిలోని మల్లారం గ్రామానికి చెందిన గొట్టం ఉమా (భర్త లక్ష్మయ్య) వడదెబ్బతో మృతి చెందింది. రోజువారీలాగే వ్యవసాయ కూలి పనులకు వెళ్లిన ఉమా, ఎండ తీవ్రతకు అక్కడే కళ్లు తిరిగి పడిపోయింది. కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే భూపాలపల్లిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున ఆమె మరణించింది. మృతురాలికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. తల్లి మరణంతో పిల్లలు అనాథలుగా మారారు. ప్రభుత్వం తమ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని మృతురాలి భర్త, కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

## కూలీలకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ చేసిన సర్పంచ్ కొండ రాజమ్మ



మల్హర్, మే 20 ప్రజాకలం ప్రతినిధి

మండలంలోని కొయ్యూరు గ్రామపంచాయతీ పరిధిలో తీవ్ర ఎండల్లో పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలకు సర్పంచ్ కొండ రాజమ్మ బుధవారం మజ్జిగ, థమ్సప్ బాటిళ్లు, మరియు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొండ రాజమ్మ మాట్లాడుతూ, వేసవి తీవ్రత దృష్ట్యా కూలీలు వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కూలీల సంక్షేమం కోసం పంచాయతీ తరపున ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఆమె భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌తో పాటు గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజు, వార్డు సభ్యులు, లక్ష్మి, మహేష్ ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, మరియు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దౌలత్ నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ నిర్వహించిన హెచ్ఈఓ మూసా మహమ్మద్

( వరంగల్/ పర్వతగిరి) మే 20, ప్రజాకలం ప్రతినిధి.

పర్వతగిరి మండలంలోని దౌలత్‌నగర్ గ్రామంలో నిర్వహిస్తున్న యూనివర్సల్ ఇమ్మ్యునైజేషన్ ప్రోగ్రామ్‌ను పర్వతగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెచ్ఈఓ మూసా మొహమ్మద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గర్భిణీలకు నిర్వహిస్తున్న ఏఎన్ సీ 1r పరీక్షలు, టి.డి టీకాల ప్రక్రియతో పాటు చిన్నారులకు అందిస్తున్న 1వ పెంటా, 3వ పెంటా టీకాల నిర్వహణను పరిశీలించారు. టీకాల నిల్వ విధానం, రికార్డుల నమోదు, చిన్నారుల హాజరు వివరాలను తనిఖీ చేసిన ఆయన, ఆరోగ్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. గ్రామంలోని ప్రతి గర్భిణి, ప్రతి చిన్నారి ప్రభుత్వ టీకా కార్యక్రమాన్ని పూర్తిగా వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. పిల్లలకు సమయానికి టీకాలు వేయించడం ద్వారా ప్రాణాంతక వ్యాధులను నివారించవచ్చని, గర్భిణీలు కూడా నిర్దిష్ట సమయాల్లో పరీక్షలు చేయించుకోవాలని హెచ్ఈఓ మూసా మొహమ్మద్ తెలిపారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



# 28 నుంచి భారీగా పెరగనున్న ధరలు

## - 3 రకాలుగా సాగు భూముల విలువ సవరణ



హైదరాబాద్ : తెలంగాణవ్యాప్తంగా వ్యవసాయ, వ్యవసాయేతర భూములు, అపార్ట్‌మెంట్ల ప్రభుత్వ మార్కెట్ విలువను సుమారు 50 శాతం వరకు పెంచేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. బహిరంగ మార్కెట్ ధరలకు, ప్రభుత్వ విలువలకూ మధ్య ఉన్న భారీ వ్యత్యాసాన్ని తగ్గించడమే లక్ష్యంగా ఈ నెల 28 నుంచి కొత్త ధరలను అమలు చేయాలని భావిస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వానికి ఏటా రూ.1500 కోట్ల అదనపు ఆదాయం సమకూరనుంది. ముఖ్యంగా ఓఆర్ఆర్ లోపల, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని ఐటీ కారిడార్లు, కమర్షియల్ జోన్లలో ఈ పెంపు ఉండనుంది.తెలంగాణవ్యాప్తంగా రియల్ ఎస్టేట్ రంగానికి కీలకమైన భూముల రిజిస్ట్రేషన్ విలువల సవరణకు ప్రభుత్వం ముమ్మర సన్నాహాలు చేస్తోంది. గ్రామీణ ప్రాంతాలు, జాతీయ రహదారులు, పట్టణాలకు సమీపంలో ఉన్న సాగు, సాగేతర స్థిరాస్తుల విలువలను సగటున 50 శాతం వరకు పెంచాలని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ నిర్ణయించింది. బహిరంగ మార్కెట్ ధరలకు, సర్కారు నిర్ణయించిన విలువలకు మధ్య కొండంత వ్యత్యాసం ఉండటమే దీనికి ప్రధాన కారణం. ప్రముఖ ఆర్థికవేత్త అరవింద్ సుబ్రహ్మణ్యం కమిటీ సిఫార్సులను పరిగణనలోకి తీసుకుని ఈ ప్రక్రియను చేపడుతుండగా.. ప్రజలపై ఒకేసారి భారీ భారం పడకుండా ఉండాలని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులకు స్పష్టం చేశారు. ఈ నెల 28 నుంచే కొత్త రేట్లను అమల్లోకి తెచ్చే అవకాశం ఉంది.ఈ సవరణ ప్రకారం.. రాష్ట్రంలో ప్రస్తుతం ఎకరా వ్యవసాయ భూమి కనిష్ఠ ప్రభుత్వ విలువ రూ.1.75 లక్షలు ఉండగా.. దానిని రూ.2.75 లక్షలకు పెంచనున్నారు. ఇక ఓఆర్ఆర్ పరిధి లోపల డిమాండ్ ఎక్కువగా ఉన్నందున ఎకరా కనిష్ఠ విలువను రూ.8.75 లక్షల నుంచి రూ.15 లక్షలకు పెంచాలని నిర్ణయించారు. వట్టినాగులపల్లి వంటి హాట్ స్పాట్లలో బహిరంగ మార్కెట్ ధర ఎకరాకు రూ.100 కోట్లకు పైగా పలుకుతుండగా.. ప్రస్తుతం అక్కడ కేవలం రూ.2 నుంచి రూ.2.5 కోట్లుగా ఉన్న ప్రభుత్వ విలువను రూ.4 కోట్లకు సవరించనున్నారు. హైదరాబాద్ మహానగర పరిధిలోని దాదాపు 350 ప్రాంతాలలో స్థానిక మార్కెట్ డిమాండ్‌ను బట్టి విడివిడిగా ధరలను ఖరారు చేయనున్నారు. జూబ్లీహిల్స్ లాంటి ఏరియాల్లో గజం విలువ రూ.80 వేల నుంచి రూ.90 వేలకు పెరిగే అవకాశం ఉంది.అపార్ట్‌మెంట్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌ల ఫ్లాట్ల చదరపు అడుగు ధరల్లో కూడా 75 శాతం వరకు మార్పులు రానున్నాయి. ప్రస్తుతం చదరపు అడుగు రూ.3500 నుండి రూ.4000 వరకు ఉన్న విలువల స్థానంలో రూ.6000 వరకు నిర్ధారించనున్నారు. అదేవిధంగా వాణిజ్య ప్రాంతాలలో బహిరంగ మార్కెట్ ధరలు రూ.8000 నుండి రూ.12000 వరకు ఉండటంతో ప్రభుత్వ ల్యాండ్ వాల్యూను రూ.6600గా ఫిక్స్ చేయాలని అధికారులు భావిస్తున్నారు. వంద అడుగుల రోడ్లు, ప్రధాన లింక్ రోడ్లు ఉన్న ఏరియాల్లో స్థానిక వృద్ధిని బట్టి రేట్లు పెరగనున్నాయి.ప్రస్తుతం స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా ఏడాదికి రూ.15 వేల కోట్ల ఆదాయం లభిస్తుండగా.. ఈ తాజా సవరణల ద్వారా ప్రభుత్వ ఖజానాకు అదనంగా మరో రూ.1500 కోట్ల రాబడి చేకూరనుంది. గతంలో 2021, 2022 సంవత్సరాల్లో చివరిసారిగాఈ విలువల సవరణ జరిగింది. ఆ తర్వాత ఐటీ రంగ విస్తరణ, మౌలిక వసతుల మెరుగుదల వల్ల హైదరాబాద్ చుట్టుపక్కల విల్లాలు హైరైజ్ బిల్డింగుల నిర్మాణాలు పెరిగి భూముల ధరలు ఆకాశాన్నంటాయి. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కాగా ఈ కొత్త ధరల అమలు ప్రక్రియను ప్రారంభించిన ఆరు నెలల తర్వాత మార్కెట్ సరళిని బట్టి అధికారులు మరోసారి సమీక్ష నిర్వహించనున్నారు.ఎకరం భూమి కనీసం పదిహేను లక్షలు పెరిగేఅవకాశం ఉందని చెప్పారు. అవుటర్ రింగ్‌రోడ్డు, ఇన్నర్ రింగ్ రోడ్డు పరిధి ప్రామాణికంగాధరలు పెంపు ఉంటుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన ఉంటుందని ఆయన చెప్పారు.అరవింద్ సుబ్రహ్మణ్యం నివేదిక ఆధారంగా గత ప్రభుత్వం రెండుసార్లు భూముల ధరలు పెంచిందన్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి 2022 నుంచి భూములు ధరలు పెంచలేదని గుర్తు చేశారు. భూముల ధరలు పెరుగుతాయని దానితో పాటు ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ పరంగా ఆదాయం కూడా లభిస్తుందని చెప్పారు. వరంగల్ మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులను వేగవంతం చేయనున్నామని చెప్పారు.

# బండి భగీరద్ కేసులో క్రెడిట్ వార్

హైదరాబాద్ : బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో పెను తుపానును సృష్టిస్తోంది. ఈ కేసు కేవలం చట్టపరమైన పరిధిని దాటిపోయి రాజకీయంగా మారింది. బీజేపీ, కాంగ్రెస్ ను ఒకే గాటన కట్టేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది. మరో వైపు అధికార కాంగ్రెస్ , బీజేపీ మధ్య ఒక హై-వోల్టేజ్ మైండ్ గేమ్‌కు వేదికైంది. తెలంగాణ రాజకీయాలు ఇప్పుడు బండి భగీరథ్ కేసు చుట్టూ తిరుగుతున్నాయి. బీజేపీ దశ మారుస్తారని భావిస్తున్న కీలక నేత కుమారుడు కావడం.. భగీరథ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు కావడం, ఆయన లొంగిపోవడం వంటి పరిణామాలు రాష్ట్రంలో రాజకీయ వేడిని పెంచాయి. ఈ కేసును కాంగ్రెస్ సర్కార్ ఒక బలమైన రాజకీయ ఆయుధంగా మలచుకుంటుండగా, బీజేపీ దీనిని హనీ ట్రాప్‌గా అభివర్ణిస్తూ ఎదురుదాడికి దిగుతోంది. అదే సమయంలో బీఆర్ఎస్ రెండు పార్టీలు కలిసి బాధితురాలికి అన్యాయం చేస్తున్నాయని ఆరోపిస్తోంది. బండి సంజయ్ బర్తరఫ్‌కు కేటీఆర్ డిమాండ్ చేస్తున్నారు. ఆయన మంత్రిగా ఉంటే.. కేసును ప్రభావితం చేస్తారని అంటున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయంలో అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. కేసు నమోదైన నాటి నుంచే దర్యాప్తులో ఎందుకు జాప్యం జరుగుతోందని డీజీపీని ప్రశ్నించడం ద్వారా, తన ప్రభుత్వం చట్టం అమలులో ఎవరికీ మినహాయింపు ఇవ్వదని గట్టి సందేశం పంపారు. కేంద్ర మంత్రి కుమారుడైనా సరే వదిలేది లేదని చెప్పడం ద్వారా, ప్రజల్లో తన ఇమేజ్‌ను పెంచుకోవడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. ముఖ్యంగా మహిళల భద్రత, పోక్సో కేసుల తీవ్రతను ప్రస్తావిస్తూ బీజేపీని ఆత్మరక్షణలో పడేసేలా కాంగ్రెస్ తన సోషల్ మీడియా విభాగాన్ని రంగంలోకి దింపింది.మరోవైపు బీజేపీ ఈ కేసును నేరుగా బండి సంజయ్ రాజకీయ ప్రతిష్టపై జరిగిన దాడిగా చిత్రీకరిస్తోంది. ప్రధాని మోదీ సభ , హిందూ ఏక్తా యాత్రల సమయంలోనే ఈ కేసును వెలుగులోకి తేవడం వెనుక లోతైన కుట్ర ఉందని బండి సంజయ్ ఆరోపిస్తున్నారు. నన్ను రాజకీయంగా ఎదుర్కోలేకే నా కుమారుడిని టార్గెట్ చేశారు అనేది బీజేపీ ప్రధాన వాదన. అంతేకాకుండా, బాధితురాలు మైనర్ కాదని, ఆమెకు రెండు వేర్వేరు పుట్టిన తేదీ ధృవీకరణ పత్రాలు ఉన్నాయనే వార్తలను బీజేపీ సోషల్ మీడియాలో వైరల్ చేస్తూ వచ్చింది. అయితే బీజేపీకి ఏదీ కలసి రాలేదు. బాధితురాలు మైనర్‌గా తేలడంతో జైలుకు వెళ్లక తప్పలేదు. ఈ గొడవ వల్ల క్షేత్రస్థాయిలో బీజేపీ కార్యకర్తలు మరింత దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ఇది కేవలం భగీరథ్ వ్యక్తిగత విషయం కాదని, పార్టీ గౌరవానికి సంబంధించిన అంశంగా వారు భావిస్తున్నారు. కాంగ్రెస్ మాత్రం తన న్యాయ పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి దీనిని ఒక ఉదాహరణగా చూపిస్తోంది. ఈ రెండు పార్టీలను ప్రజల్లో దోషులుగా నిరూపించాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది. రాబోయే రోజుల్లో ఈ కేసు దర్యాప్తు వేగం



పుంజుకునే కొద్దీ తెలంగాణ రాజకీయం మరిన్ని మలుపులు తిరగడం ఖాయం.

కొత్త కేసులతో ఇబ్బందులు

బండి సాయి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో పోలీసులు మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. దర్యాప్తు ముమ్మరం చేసిన కొద్దీ ఈ కేసులో రోజుకో కొత్త ట్విస్ట్ వెలుగులోకి వస్తోంది. తాజాగా ఈ కేసులో పోలీసులు నిందితుడు బండి భగీరథ్‌పై మరింత కఠినమైన బీఎన్ఎస్ సెక్షన్‌ను జోడించారు. ఒకే బాధితురాలిపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడినట్లు అభియోగాలు ఉండటంతో పోలీసులు ఈ కొత్త సెక్షన్‌ను నమోదు చేసినట్లు తెలుస్తోంది. ఈ కేసుకు సంబంధించి బండి భగీరథ్‌పై భారతీయ న్యాయ సంహిత లోని 64(2)(ఎ) సెక్షన్‌ను అదనంగా చేర్చారు. తీవ్రమైన నేరాలకు సంబంధించిన ఈ సెక్షన్‌ను జోడించడంతో నిందితుడికి చట్టపరంగా ఇబ్బందులు మరింత పెరిగే అవకాశం ఉందని న్యాయ నిపుణులు భావిస్తున్నారు. ఈ కొత్త కేసు ప్రకారం తప్పు చేసినట్లు రుజువైతే భగీరథ్‌కు 10 ఏళ్ల వరకు జైలుశిక్ష పడుతుందని తెలుస్తోంది. బాధితురాలి నుంచి సేకరించిన మరికొన్ని వివరాలు, సాంకేతిక ఆధారాల ప్రకారమే పోలీసులు ఈ చర్యలు చేపట్టినట్లు సమాచారం. మరోవైపు, ప్రస్తుతం రిమాండ్ ఖైదీగా చర్లపల్లి జైలులో శిక్ష అనుభవిస్తున్న బండి సాయి భగీరథ్‌ను కలిసేందుకు ఆయన కుటుంబ సభ్యులు సిద్ధమయ్యారు. జైలు నిబంధనల ప్రకారం నేడు వారు చర్లపల్లి జైలుకు వెళ్లి ములాఖత్ ద్వారా భగీరథ్‌ను కలవనున్నారు. కఠినమైన సెక్షన్లు తోడవడంతో తదుపరి లీగల్ ప్రాసెస్, బెయిల్ పిటిషన్లపై ఈ ములాఖత్‌లో కుటుంబ సభ్యులు, న్యాయవాదులు చర్చించే అవకాశం ఉందిబండి భగీరథ్ పోక్సో కేసులో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. గత కొన్ని రోజులుగా సోషల్ మీడియా వేదికగా నిందితుడికి మద్దతుగా విపరీతంగా ప్రచారం నిర్వహిస్తూ, అతడు నిర్దోషి అని చిత్రీకరించే ప్రయత్నం చేసిన పలువురు సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లపై కేసులు నమోదయ్యాయి. ఈ వ్యవహారంలో మొత్తం 27 మంది ఇన్‌ఫ్లూయెన్సర్లపై ఫిర్యాదులు రాగా, ప్రాథమిక విచారణ అనంతరం అందులో 14 మందిపోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మిగిలిన వారిపై కూడా దర్యాప్తు కొనసాగుతోందని, త్వరలోనే తదుపరి చర్యలు తీసుకుంటారని అధికారులు తెలిపారు.

# అమీర్ పేట జంక్షన్ లో ఎన్టీఆర్ విగ్రహం..

హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సందర్భంగా తాను మాట ఇచ్చినట్లు టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. హైదరాబాద్ నగరంలోని అత్యంత రద్దీగా ఉండే అమీర్ పేట చౌరస్తాలో తెలుగువారి అన్న ఎన్టీఆర్ విగ్రహం ప్రతిష్టించేందుకు పనులు ప్రారంభమయ్యాయి. సెటిలర్లు, టీడీపీ సానుభూతిపరులు, ఎన్టీఆర్ అభిమానుల ఓట్లే టార్గెట్ గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయంలో వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారని అంటున్నారు. తెలంగాణ గడ్డపై టీడీపీ అనుకూల వ్యాఖ్యలు చేస్తే రాజకీయంగా నష్టం జరుగుతుందనే అనుమానాలను పటాపంచలు చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి అడుగులు వేస్తున్నారని వ్యాఖ్యానిస్తున్నారు. అమీర్‌పేట్ లోనే కాకుండా, హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో 'ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ' వంద అడుగుల విగ్రహానికి సీఎం రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోవడంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. తెలుగుజాతి గర్వించదగ్గ మహానాయకుడు, దివంగత నేత నందమూరి తారక రామారావు అంటే రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రజలకు ఒక ఎమోషన్. పార్టీలకు అతీతంగా అన్నగారిని ఆరాధించే కోట్లాది మంది అభిమానులు రెండు రాష్ట్రాల్లో ఉన్నారు. ఎన్టీఆర్ అభిమానులు ఎక్కువగా ఆయన స్థాపించిన టీడీపీకి అనుకూలంగా ఉంటారు. అయితే తెలంగాణ ఏర్పాటు తర్వాత టీడీపీ ఉనికి కోల్పోగా, ఆ పార్టీ సానుభూతిపరులు, అభిమానులు మాత్రం తరచూ తమ ప్రభావం చూపడానికి ప్రయత్నిస్తుంటారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతుంటారు. ప్రధానంగా హైదరాబాద్ నగరంలో భారీగా ఉండే టీడీపీ సానుభూతిపరులను ఆకర్షించడానికి తెలంగాణ పార్టీలు విస్తృతంగా ప్రయత్నిస్తుంటాయి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఈ విషయమై పెద్ద డిబేట్ కూడా కొనసాగింది. ఆ సమయంలో కీలకమైన టీడీపీ సానుభూతిపరుల ఓటర్లను కైవసం చేసుకోడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యూహాత్మకంగా పావులు కదిపారు. అమీర్‌పేట్ లో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేస్తున్నారు. రేవంత్ రెడ్డి ఇక ఎన్నికల ప్రచార సమయంలో అమీర్‌పేట్ జంక్షన్ వద్ద సీనియర్ ఎన్టీఆర్ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకునేలా ప్రస్తుతం పనులు మొదలయ్యాయి. ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ఆధ్వర్యంలో విగ్రహ ఏర్పాటు పనులు తాజాగా ప్రారంభించారు. ప్రస్తుతం పునాది పనులను ప్రారంభించారని ఇది పూర్తయిన వెంటనే విగ్రహాన్ని ఏర్పాటు చేసి అవిష్కరిస్తారని అంటున్నారు. హైదరాబాద్‌లో అమీర్‌పేట్, మైత్రీవనం ప్రాంతాలంటే నిత్యం లక్షలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు, సాధారణ ప్రజలతో కిటకిటలాడే అత్యంత కీలకమైన జంక్షన్లు. అలాంటి చోట ఎన్టీఆర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించడం వెనుక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యూహాత్మక రాజకీయ అడుగులు ఉన్నాయనే చర్చ నడుస్తోంది.తెలుగుదేశం పార్టీ నుంచి తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ఆ పార్టీ ఓటర్లను కాంగ్రెస్ వైపు మళ్లించే ప్రణాళికలో భాగంగా పకడ్బందీగా వ్యూహం రచిస్తున్నారని అంటున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రంలో టీడీపీ తిరిగి బలపడటం సాధ్యం కాదని, టీడీపీ ఓటర్లు తన నాయకత్వం కిందకు రావాలని బలమైన సంకేతాలు పంపేలా సీఎం రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని విశ్లేషిస్తున్నారు.

## ధాన్యం తరలింపు అన్ లోడింగ్ లో

# మరింత వేగం పెంచాలి



జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

రాజన్న సిరిసిల్ల : ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తరలింపు రైస్ మిల్లులు, గోదాముల్లో అన్ లోడింగ్ లో మరింత వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం తరలింపు, అన్ లోడింగ్, ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ, రైతులు, హమాలీలకు ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలు, తదితర అంశాలపై మంగళవారం ఉదయం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి పౌర సరఫరాల, సహకార శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, మెప్మా ఇతర శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తూకం వేయడం, తూకం వేసిన ధాన్యాన్ని నిర్దేశించినమిల్లులు, గోదాములకు తరలించడంపై అధికారులు దృష్టి సారించి, క్షేత్ర స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని, కొనుగోళ్ళ ప్రక్రియ సజావుగా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యం బస్తాలను తరలించేందుకు సరిపడా వాహనాలను ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లు సమాకూర్చాలని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం లోడింగ్ కోసం, మిల్లులు, అపరల్ పార్క్ లో ధాన్యం అన్ లోడింగ్ చేయడం కోసం హమాలీల సంఖ్యను మరింత పెంచాలని సూచించారు. ఎండ తీవ్రత దృష్ట్యా కొనుగోలు కేంద్రాల్లో రైతులు, హమాలీలు అలాగే అన్ లోడింగ్ చేసే మిల్లులు, గోదాముల్లో హమాలీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని,తాగు నీరు,ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు అందుబాటులో పెట్టాలని సూచించారు. ఇంకా జిల్లాలో ఉన్న గోదాములను ధాన్యం అన్ లోడింగ్ చేసేందుకు సిద్ధం చేయాలని ఆదేశించారు.రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి సంబంధించిన ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ జాప్యం చేయవద్దని డీఆర్డీఓ,డీసీఓ, ఏవో మెప్మా, ఇతర అధికారులను ఆదేశించారు. ఆయా మండలాలకు చెందిన సంబంధిత అధికారులు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ వేగవంతం చేసేలా పర్యవేక్షణ చేయాలని సూచించారు.ధాన్యం కొనుగోలు కేంద్రాలను సంబంధిత శాఖల అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు తప్పనిసరిగా తనిఖీలు చేస్తూ సూచనలు చేయాలని సూచించారు.

## ప్రభుత్వ యంత్రాంగంలో ఉన్న ప్రతీ ఒక్కరి సహకారం వల్లే

# వ్యవస్థలు గాడిలో పడ్డాయి

## పారదర్శకతతో ప్రతి ఒక్కరూ వ్యవహరించాలి

## అధికారులు, సిబ్బందితో సీఎం చంద్రబాబు టెలీ కాన్ఫరెన్స్

అమరావతి : ఆర్టీజీఎస్ నుంచి జిల్లా కలెక్టర్లు, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉద్యోగులు, క్షేత్ర స్థాయి సిబ్బందితో సీఎం చంద్రబాబు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ ప్రాధాన్యతలను టెలీకాన్ఫరెన్సులో వివరించారు. ప్రభుత్వ సేవల అమలు... అర్జీల పరిష్కారంపై సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేసారు. సుమారు 40 వేల మందితో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. టెలికాన్ఫరెన్సు ద్వారా క్షేత్ర స్థాయి అధికారులు ముఖ్యమంత్రితో నేరుగా మాట్లాడారు. ముఖ్యమంత్రితో కిందిస్థాయి ఉద్యోగులు మాట్లాడే అవకాశం కల్పించినందుకు పలువురు ఉద్యోగులు హర్షం వ్యక్తం చేసారు. కాకినాడ జిల్లాకు చెందిన ఉద్యోగి గృహ నిర్మాణానికి సంబంధించి కొన్ని సూచనలు చేసారు. స్పందించిన సీఎం మంచి సూచన చేశారు...అమలు చేస్తామంటూ సదురు ఉద్యోగికి చెప్పారు. ప్రజలకు సంతృప్తికర సేవలు అందించడంలో టాప్-3లో నెల్లూరు, తూర్పుగోదావరి, పల్నాడు జిల్లాల కలెక్టర్లు నిలిచారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన ధ్యేయంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

విధ్వంసమైన రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నాం. అందరి సహకారం వల్లే బెస్ట్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు దక్కింది. ప్రభుత్వ యంత్రాంగంలో ఉన్న ప్రతీ ఒక్కరి సహకారం వల్లే వ్యవస్థలు గాడిలో పడ్డాయని అన్నారు. 2047 స్వర్ణాంధ్ర సాధనకు లక్ష్యాలు పెట్టుకున్నాం... పది సూత్రాలను అమలు చేస్తున్నాం. 23 నెలల్లో రూ. 23 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించాం... 24 లక్షల ఉద్యోగాలకు అవకాశాలు వచ్చాయి. గూగుల్, ఆర్సెల్లార్ మిట్టల్, ఆమ్కా వంటి కీలక ప్రాజెక్టులు వచ్చాయి...త్వరలో బీపీసీఎల్ వంటి ప్రాజెక్టుకు శంప్రకుస్థాపన చేసుకుంటాం. ఆమ్కా ప్రాజెక్టు ద్వారా పుట్టపర్తి-బెంగళూరు మధ్య ఎరో స్పేస్ సిటీగా అభివృద్ధి జరుగుతుంది. టీంగా పని చేయాలి... అభివృద్ధి సాధించాలి. ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం కలిగేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.

ఈ రెండేళ్ల కాలంలో ప్రజలకు ప్రభుత్వంపై నమ్మకం పెరిగింది. ప్రభుత్వ సేవలపై తీసుకుంటున్న ఫీడ్ బ్యాక్ లెక్కలే దీనికి నిదర్శనం. ప్రభుత్వ సేవల్లో పెన్షన్ల పంపిణీ కార్యక్రమం అగ్ర భాగాన నిలిచింది. ప్రభుత్వ సేవలు అందించడమే కాకుండా... ప్రజలతో సఖ్యతగా మెలగుతుండడం వల్లే పెన్షన్ల పంపిణీ టాప్ లో నిలిచిందని అన్నారు.

పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమల్లో ఏమైనా గ్యాప్ ఉంటే.. జిల్లా యంత్రాంగం అలెర్ట్ కావాలి. జిల్లాల్లో 80 శాతం మంది పనితీరు బాగుంది... అభినందనలు. ప్రతి ఒక్కరి పనితీరును విశ్లేషిస్తున్నాం... బాగా పని చేసిన వారిని గౌరవిస్తాం.. గుర్తిస్తాం. అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. ఆర్థిక-ఆర్థికేతర సమస్యలుగా విభజించుకుని పని చేయాలి. ఆర్థికేతర సమస్యలను 100 శాతం పరిష్కరించాల్సిందే. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ అన్ని చోట్లా రావాలి. ఒఓఅం ప్రాజెక్టుకు 36 రోజుల్లో అనుమతులిచ్చి... శంకుస్థాపన కార్యక్రమం చేపట్టాం. ఒఓఅం ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వం స్పందించిన తీరు చూసి జాతీయ స్థాయిలో చర్చ జరుగుతోంది. అవినీతి అనేది కన్పించకూడదు.. పారదర్శకతతో ప్రతి ఒక్కరూ వ్యవహరించాలి. నెల్లూరు కలెక్టర్ చేసిన ప్రయోగాన్ని చూసి ప్రతి నియోజకవర్గంలో నాలుగు సార్లు పర్యటనలు చేసేలా ప్రణాళికలు రూపొందించాం. తాగునీరు సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.. దీనిపై క్షేత్ర స్థాయిలో మరింత అలెర్టుగా ఉండాలి. చిన్నచిన్న పనులైనా వెంటనే స్పందించండి.. సమస్యలను పరిష్కరించండి. ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం కలగాలి... అదే బ్రాండుగా మారాలి. తక్కువ ఖర్చుతో ఇంపాక్ట్ చూపించేలా పనితీరు మెరుగుపర్చుకోవాలి. వేసవిలో తాగునీటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూసుకోవాలని అన్నారు.

# దేవుడి ఉత్సవాలపై ఆంక్షల పర్వం

## బోడపాడులో భక్తుల ఆవేదన

బ్రహ్మంగారిమఠం : బోడపాడు గ్రామంలో ఆధ్యాత్మికత ఉట్టిపడాల్సిన వేళ.. ఆంక్షల నీడలు అలుముకోవడం పట్ల స్థానిక ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఎంతో చరిత్ర కలిగిన ఆంజనేయ స్వామి ఆలయ హనుమాన్ జయంతి ఉత్సవాలను సాఫీగా జరగకుండా, అడుగడుగునా ఆటంకాలు సృష్టించడంపై బోడపాడు గ్రామ మహిళలు, యువత, మరియు భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భక్తిభావంతో నిర్వహించుకునే దేవుడి కార్యక్రమాల్లో కూడా ఈ స్థాయి రాజకీయాలు ఏంటని స్థానికులు బాహాటంగానే ప్రశ్నిస్తున్నారు.నిజానికి, గ్రామీణ ప్రాంతాల్లో ఏటా జరిగే ఆలయ ఉత్సవాలు గ్రామస్తులందరి సమిష్టి వేడుకలు. కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో పాల్గొనే పండుగలు ఇవి. అలాంటిది, హనుమాన్ జయంతిని పురస్కరించుకుని బోడపాడు భక్తులు ఎంతో ఇష్టంగా ఏర్పాటు చేసుకున్న ఉత్సవాల కార్యక్రమాలను సైతం యంత్రాంగం అడుగడుగునా అడ్డుకోవడం నిజంగా విచారకరం. దేవుడి సన్నిధిలో భక్తితో సాగే వేడుకల వల్ల శాంతిభద్రతలకు వచ్చే విఘాతం ఏముంటుంది? శాంతిభద్రతల పరిరక్షణ పేరుతో సామాన్య భక్తుల స్వేచ్ఛను, వారి నమ్మకాలను హరించడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు ఇప్పుడు ప్రతి ఒక్కరి గుండెల్లో వ్యక్తమవుతున్నాయి.ఈ నేపథ్యంలోనే.. ఆలయ సందర్శనకు విచ్చేసిన కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డి, మైదుకూరు శాసనసభ్యులు శెట్టిపల్లి రఘురామిరెడ్డి, జిల్లా జడ్పీ చైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డి, బద్వేల్ శాసనసభ్యురాలు డాక్టర్ సుధా ముందర బోడపాడు గ్రామ మహిళలు, యువకులు తమ గోడును వెళ్లబోసుకున్నారు.

"ఇంత అన్యాయమా.. దేవుడి కార్యక్రమాలు కూడా చేసుకోనివ్వరా? వీళ్లకు భగవంతుడంటే భయం లేదా?" అంటూ మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు దీనిపై ఎంపీ అవినాష్ రెడ్డి స్పందిస్తూ.. కూటమి ప్రభుత్వం పోలీసులను ముందు పెట్టి ఉత్సవాలను సాఫీగా జరగకుండా అడ్డుకుందని, తమ కార్యకర్తలపైనే కాకుండా సాక్షాత్తు ఆంజనేయ స్వామిపై కూడా కక్ష సాధింపు చర్యలకు దిగుతోందని తీవ్రంగా మండిపడ్డారు. భవిష్యత్తులో ఈ తప్పుడు ఆనవాయితీకి కూటమి ప్రభుత్వం భగవంతునికి, ప్రజలకు సమాధానం చెప్పుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మంగారి మఠం మాజీ ఎంపీపీ, మాజీ జెడ్పిటిసి, బిజీవేముల రామసుబ్బారెడ్డి, దుగ్గాయపల్లె మల్లికార్జున రెడ్డి, బద్వేల్ మాజీ చైర్మన్ వాకమల్ల రాజగోపాల్ రెడ్డి, బద్వేల్ మాజీ ఎంపీపీ వెంకటేశ్వర రెడ్డి, బ్రహ్మంగారిమఠం మాజీ సింగల్ విండో చైర్మన్ సుబ్బారెడ్డి, ఎగువ నేలటూరు మాజీ ఎంపీటీసీ వెంకటరామిరెడ్డి, బిజీ వేముల రామకృష్ణారెడ్డి, ఖదుమాల సుబ్బారెడ్డి, గాజులపల్లి చిన్న కేశవరెడ్డి, మన్యం రామిరెడ్డి, బిజీ వేముల చిన్న వెంకట సుబ్బారెడ్డి, బిజి వేముల వెంకట సుబ్బారెడ్డి (హోటల్), బీరం పిచ్చిరెడ్డి, బిజీ వేముల సుబ్బారెడ్డి, మధుసూదన్ రెడ్డి, తిరుపాల్ రెడ్డి, నాగిశెట్టిపల్లె మాజీ సర్పంచ్ అనంతరెడ్డి, దిరశవంచ మాజీ సర్పంచ్, అమీర్ భాష లతో పాటు బద్వేల్, మైదుకూరు ప్రాంతాలకు చెందిన వైయస్ఆర్సీపీ ముఖ్య నాయకులు మరియు స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

## ఎదురెదురుగా ఢీకొన్న బైకులు.. ఒకరు మృతి

గన్నవరం: గన్నవరం- కంకిపాడు రోడ్డులో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా.. మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి.మృతుడు కేసరపల్లి గ్రామానికి చెందిన వేమూల శేషగిరి(33)గా గుర్తించారు. మరొకరికి తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కంకిపాడు పోలీసులు దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పొగతో వాహనదారులకు ఇబ్బందులు

గుంటూరు : నల్లపాడులో రోడ్డు కాపర్‌ఫాక్స్ బార్ ఎదురు మెయిన్ రోడ్డు పక్కన ఉన్న చెత్తను కాల్చడంతోపొగలు ఎగిసి పడుతున్నాయి. ఈ పొగ వాహనదారులకు ఇబ్బంది గా మారుతోంది. ఒక పక్క గుంటూరు జిల్లా కలెక్టర్ సీ.యం సాయి కాంత్ వర్మ,మున్సిపాలిటీ సిబ్బంది ఎవరు కూడా చెత్త తగులపెట్టవద్దు అని చెప్తున్నారు. కాని కొంత మందికి అది పట్టనట్టు చెత్తను కాలుస్తూనే ఉన్నారు.. దీనికి సంబంధించిన వారిపై చర్యలు తీసుకుంటారా లేదాఅని వేచి చూడాలి.

## నన్ను చంపాలని చూస్తున్నారు

### - పాస్టర్ అభినయ్ దర్శన్

విజయవాడ : పాస్టర్ ప్రవీణ్ పగడాల లాగే నన్ను చంపాలని చూస్తున్నారు. పోలీసులు విచారణ మీద నాకు నమ్మకం లేదని పాస్టర్ అభినయ్ దర్శన్ అన్నారు. తనపై జరిగిన దాడి తరువాత మీడియాతో ఆయన మాట్లాడారు. ప్రవీణ్ పగడాల నాలుగు బ్రాండ్లు తాగి యాక్సిడెంట్ చేసినట్లు దొంగ సాక్ష్యాలు సృష్టించారు. నాపై దాడి చేసిన వారిని వదిలేసి, నా అనుచరులను అరెస్టు చేశారు. నేనే నాపై దాడి చేసుకున్నట్లు తప్పుడు సాక్ష్యాలు సృష్టిస్తున్నారు. పాస్టర్లందరూ దొంగలే అనే తరహాలో చిత్రీకరిస్తున్నారు. నాపై దాడి వ్యవహారంలో ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజుకి సంబంధం ఉందని అనుకోను. కొంతమందిపై నాకు అనుమానం ఉంది.. వారి పేర్లు త్వరలోనే బయట పెడతానని అన్నారు.

## అభివృద్ధి పనులను ప్రారంభించిన వరంగల్ సీపీ

వరంగల్ : పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలోని మోటార్ ట్రాన్స్ పోర్ట్ విభాగంలో పోలీస్ కార్ల మరమ్మత్తుల కోసం నూతనముగా నెలకొల్పబడిన భారీ హైడ్రాలిక్ యంత్రంతో పాటు, వాహన టైర్లను తొలగించి, అమర్చే యంత్రాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ప్రారంభించారు. అనంతరం పోలీస్ కమిషనర్ అధికారులతో కలిసి ఈ యంత్రాల పనితీరును క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్బంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ యం.టి విభాగంలో వాహనాల మరమ్మత్తుల కోసం నూతనంగా ఏర్పాటు చేసిన యంత్రాల ద్వారా పోలీస్ వాహనాల మరమ్మత్తు కోసం ప్రైవేట్ రిపేర్ సెంటర్లపై ఆధారపడకుండా స్వయంగా మరమ్మత్తులు చేపట్టడం ద్వారా సమయంతో పాటు, కొద్ది మొత్తంలో వ్యయాన్ని అదా చేసుకోవచ్చని, పోలీస్ వాహనాలను వినియోగించే అధికారులు, సిబ్బంది వాటి నిర్వహణ పై ప్రత్యేక దృష్టి పెట్టడం ద్వారా వాహనాలను మరమ్మత్తుల కోసం పంపించాల్సిన అవసరం ఉండదని సీపీ గారు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీపీ అంకిత్ కుమార్, దార కవిత, అదనపు డీసీపీలు సురేష్ కుమార్, రవి, ప్రభాకర్ రావు, శ్రీనివాస్,ఏసీపీలు నాగయ్య, అంతయ్య, సురేందర్, జితేందర్ రెడ్డి,సత్యనారాయణ, జాన్ నర్సింహులు ఆర్.ఐలు శ్రీధర్, స్పర్జన్ రాజ్, సతీష్, చంద్రశేఖర్, శ్రీనివాస్ తో ఇతర అధికారులు యం. టి విభాగం సిబ్బంది పాల్గొన్నారు

## కవాడిగూడలో మహిళ దారుణ హత్య

హైదరాబాద్ : నగరంలోని గాంధీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కవాడిగూడలో ఓ మహిళ దారుణ హత్యకు గురైంది. కవాడిగూడలోని రత్నదీప్ బిల్డింగ్ నాలుగో అంతస్తులో శ్వేత అనే మహిళను గుర్తుతెలియని వ్యక్తి కత్తితో పొడిచి హత్య చేసి పరారయ్యాడు. సమాచారం అందుకున్న వెంటనే గాంధీనగర్ పోలీసులు, క్లూస్ టీం సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఘటనకు సంబంధించిన ఆధారాలను సేకరిస్తూ దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా నిందితుడి వివరాలను గుర్తించే ప్రయత్నం చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. హత్యకు గల కారణాలపై విచారణ కొనసాగుతోంది.

## ఒస్మాన్నగర్ కేజీబీవీలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి మంత్రి వివేక్ శంకుస్థాపన

సంగారెడ్డి : కార్మిక మరియు గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి సంగారెడ్డి జిల్లాలోని రామచంద్రాపురం మండలం, ఒస్మాన్నగర్ గ్రామంలోని కేజీబీవీ పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. రూ.60 లక్షల అంచనా వ్యయంతో ఈ పనులు చేపడుతున్నారు. సంగారెడ్డి జిల్లా పర్యటనలో భాగంగా ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రికి స్థానిక నాయకుల ఘన స్వాగతం పలికారు. అనంతరం జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భవిష్యత్ తరాల మెరుగైన భవిత కోసం రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోందని మంత్రి అన్నారు.

## లులు హైపర్ మార్కెట్ లో నాసిరకం నిల్వలు

### - పలు ఆహార పదార్థాలతో పురుగులు

హైదరాబాద్ : కూకట్పల్లి లులు హైపర్మార్కెట్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు జరిపారు. పలు ఆహార పదార్థాల్లో పురుగులు, నాసిరకం నిల్వలు గుర్తించారు. కిచెన్లో అపరిశుభ్రత, పాడైపోయిన కూరగాయలు, పురుగుల సంచారం వెలుగులోకి వచక్చాయి. గడువు సమీపించిన ఆహార పదార్థాలపై తప్పుదారి పట్టించే లేబుళ్లు వున్నట్లు అధికారులు గుర్తించారు. శనగపిండి, ఆటా, పప్పుల్లో పురుగులను గుర్తించారు. గడువు ముగిసిన ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్తో ప్యాక్డ్ ఫుడ్ విక్రయం నడుస్తోంది. మాంస వ్యర్థాలతో మూసుకుపోయిన డ్రెయిన్లు వున్నాయి. సుమారు 150 కిలోల ఆహార పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. కల్తీ, అధిక కృత్రిమ రంగుల అనుమానంతో ఆహార నమూనాలు సేకరించారు.

## వాటర్ వర్క్స్ జీఎం ఇంటిపై ఏసీబీ దాడులు

సికింద్రాబాద్ : హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ వర్క్స్ జనరన్ మేనేజన్ లక్ష్మీ కుమార్ ఇంటిపై ఏసీబీ దాడులు నిర్వహించింది. దాదాపు రూ. 1.05 కోట్ల రూపాయల నగదు, కేజీ బంగారం లభ్యం అయినట్లు సమాచారం. మల్లాపూర్, వెంకటరమణ కాలనీలో ఉన్నఅయన ఇంట్లో సోదాలు నిర్వహించి, రూ. 1.05 కోట్ల నగదు, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

## ఘనంగా కోట నీలిమ జన్మదిన వేడుకలు

సికింద్రాబాద్ : కాంగ్రెస్ టీపీసీసీ ఉపాధ్యక్షురాలు సనత్ నగర్ ఇంచార్జి కోట నీలిమ జన్మదిన వేడుకలను రాంగోపాల్ పేట్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు త్రికాల మనోజ్ ఆధ్వర్యంలో సెటిలైట్ హోటల్ కూడలి వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 40 అడుగుల ఎత్తుతో ఏర్పాటు చేసిన కోట నీలిమ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కటౌట్ కు పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ శ్రేణులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వేసవి నేపథ్యంలో వాహనదారులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. సనత్ నగర్ నియోజకవర్గం లోని పలు అభివృద్ధి పనులతో పాటు ప్రజల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించిన ఘనత ఆమెకే దక్కుతుందని అన్నారు.

# యూ టర్న్‌ల విజయ్..



చెన్నై : రాజకీయ నాయకులు నాలుక మడత పెట్టడం కొత్తేమీ కాదు. మడమ తిప్పడం కూడా వింత కాదు. పైగా దేశవ్యాప్తంగా క్రెడిట్ చోరీ రాజకీయాలు దర్జాగా సాగుతున్నాయి. గొప్పగా ఉంటే నాది అని.. చెత్తగా ఉంటే అవతలివాడిదని చెప్పుకోవడం ఇప్పటి కాలంలో అలవాటుగా మారింది. ఇలాంటి వ్యవహారాలకు తలలు పండిన రాజకీయ నాయకు లు పాల్పడుతుంటారు. ఇది తప్పా? ఒప్పా? అనే విషయాల ను పక్కన పెడితే.. ఇటువంటి వ్యవహారాలు రాజకీయ నాయకులకు అలవాటుగా మారిపోతున్నాయి.తలలు పండిన రాజకీయాలు మాత్రమే కాదు.. కొత్తగా రాజకీయాల్లోకి వచ్చిన వారు కూడా ఇలాంటి వ్యవహారాలకు పాల్పడటం నిజంగా ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. తమిళనాడులో ముఖ్యమంత్రిగా విజయ్ ప్రమాణ స్వీకారం చేసి పది రోజులు కూడా కావడం లేదు. పైగా ఆయన అధికారాన్ని దక్కించుకోవడానికి అనేక రకాల ప్రయత్నాలు చేశారు. పుష్ప సినిమా మాదిరిగా సోఫాలు కూడా పంపించారు.. ఎన్డీఏ కూటమిలో ఉన్న ఏఐడీఎంకే మద్దతు తీసుకోబోనని చెప్పిన ఆయన.. కొద్ది రోజులకే మాట మార్చారు. అసెంబ్లీలో బలపరీక్ష నెగ్గడానికి ఆయన అన్నాడీఎంకే సపోర్ట్ తీసుకోవాలి.. అంతేకాదు ఇంకా అనేక రకాలుగా ఆయన నాలుక మడత పెడుతూనే ఉన్నారు. కేవలం ఈ పది రోజుల్లోనే ఆయన ఈ పని చేయడం నిజంగా ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.తన వ్యక్తిగత జ్యోతిష్యుడిని ముఖ్యమంత్రి కార్యాలయంలో ఉన్నతమైన అధికారిగా విజయ్ నియమించుకున్నారు. దీనిపై ప్రతిపక్షాలు తీవ్రస్థాయిలో మండిపడ్డాయి. హేతువాద సంఘాలు తోడయ్యాయి. దీంతో విజయ్ వెనక్కి తగ్గక తప్పలేదు. పైగా జ్యోతిష్యుడి నియామకం పట్ల వెంటనే స్పందించారు విజయ్. 24 గంటల్లో అతడు నియామకాన్ని రద్దు చేశారు.సనాతన ధర్మాన్ని డీఎంకే ఎమ్మెల్యే ఉదయనిధి తీవ్రంగా విమర్శించారు. ఆ సమయంలో విజయ్ సైలెంట్ గా ఉన్నారు. ఇప్పుడు విజయ మంత్రివర్గంలో కీలక మంత్రి అధర్వ.. బహిరంగంగానే ఉదయనిధి వ్యాఖ్యలను తప్పుపట్టారు. ఇది ఆ పార్టీలో ఉన్న అంతర్గత వ్యవహారాలను బయటపెట్టింది.ఎన్డీఏ కూటమికి అనుకూలంగా ఉండే ఏ పార్టీ మద్దతు తీసుకోబోమని విజయ్ ప్రకటించారు. ఫ్లోర్ టెస్ట్ సమయంలో సిద్ధాంతాన్ని పక్కన పెట్టి ఏఐడీఎంకే కు చెందిన 25 మంది తిరుగుబాటు ఎమ్మెల్యేల సపోర్ట్ తీసుకున్నారు.ఎన్నికల ప్రచారం సమయం లో ప్రతి మహిళకు 2500 ఆర్థిక సహాయం చేస్తామని విజయ ప్రకటించారు. అయితే ఆ పథకాన్ని ఇంతవరకు ప్రారంభిం చలేదు. పైగా ఇప్పుడు అమల్లో ఉన్న వెయ్యి రూపాయల పథకాన్ని కూడా నిలిపివేస్తామని.. దానిని పునర్ వ్యవస్థీకరి స్తామంటూ చెబుతున్నారు.స్థూలంగా చూస్తే తమిళనాడు సీఎం పరిపాలనకు.. అరవింద్ కేజ్రీవాల్ వ్యవహరించిన తీరుకు పెద్దగా తేడా కనిపించడం లేదు. సోషల్ మీడియాలో విజయ్ గురించి కొంతమంది గొప్పగా చెప్పవచ్చు. పి ఆర్ టీం రకరకాల వీడియోలను విడుదల చేయవచ్చు. కానీ అంతిమంగా ఫీల్డ్ రియాలిటీ మాత్రమే నిలబడుతుంది. ఎందుకంటే రీల్ కంటే రియల్ చాలా విలువైనది.

# మంత్రివర్గ ప్రక్షాళనకు రెడీ

హైదరాబాద్ : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయి రెండున్నరేళ్లు కావస్తుంది. ఇప్పటికీ మంత్రివర్గంలో పూర్తిగా భర్తీ చేయలేదు. ఇంకా మంత్రివర్గంలో రెండు స్థానాలు ఖాళీలున్నాయి. ఎప్పటికప్పుడు మంత్రివర్గంలో ఖాళీలను భర్తీ చేస్తామని ఊరిస్తూనే ఉన్నారు. కానీ ఇంతవరకూ భర్తీ చేయకపోవడంతో ఆశావహుల్లో నిరాశ కలుగుతుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లినప్పుడల్లా పార్టీ పెద్దలతో మంత్రివర్గ విస్తరణపై చర్చించడానికి అంటూ ప్రచారం జరుగుతుండటం, రేవంత్ రిక్త హస్తాలతో తిరిగి రావడం సాధారణంగా మారింది. స్థానిక సంస్థల ఎన్నికలు ఇంకా పూర్తి కావాల్సి ఉంది. అవి పూర్తయిన తర్వాతనే మంత్రివర్గ విస్తరణ ఉంటుందని పార్టీలో ప్రచారం జరుగుతుంది.తెలంగాణలో పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు ముగిశాయి. ఇక గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ తో పాటు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరగాల్సి ఉంది. ఈ ఎన్నికలు ముగిసిన తర్వాత రేవంత్ రెడ్డి ప్రస్తుతం ఉన్న మంత్రి వర్గంలో పూర్తి స్థాయి ప్రక్షాళన చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. రెండున్నరేళ్లు కొందరికి మంత్రిగా అవకాశం కల్పించాం కాబట్టి, వారిని తప్పించి, వారి స్థానంలో కొత్త వారిని నియమించుకోవాలన్నది రేవంత్ రెడ్డి ఆలోచనగా ఉంది. ఇది పూర్తి స్థాయి ఎన్నికల టీంగా రేవంత్ రెడ్డి ఏర్పాటు చేసుకోవాలని భావిస్తున్నట్లు చెబుతున్నారు. అయితే అందుకు హైకమాండ్ నుంచి గ్రీన్ సిగ్నల్ అందాల్సి ఉంటుంది.ప్రస్తుత మంత్రివర్గంలో సామాజికవర్గం పరంగా కొందరిని తప్పించాల్సిన పరిస్థితులున్నాయి. అలాగే పనితీరు ఆధారంగా మరికొందరిని బయటకు పంపాల్సిన అవసరం ఉంది. అలాగే 2028 ఎన్నికల్లో పార్టీకిమంచి ఊపు తెచ్చే వారిని ఎంపిక చేసుకుని ముందుకు వెళ్లాలన్న భావనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారు. ప్రధానమైన వారిని కొందరిని అలాగే ఉంచి జిల్లాల వారీగా కొందరిని మార్చి, కొత్త వారికి అవకాశాలను కల్పిస్తే అందరికీ అవకాశం దొరికినట్లవుతుందని, అప్పుడు అసంతృప్తి, అసహనాలు ఉండవన్న అంచనాలో రేవంత్ రెడ్డి ఉన్నారు. ఈ మేరకే ఢిల్లీకి వెళ్లినప్పుడల్లా హైకమాండ్ ఎదుట ఈ ప్రతిపాదన పెట్టినా అందుకు హైకమాండ్ సుముఖత వ్యక్తం చేయకపోవడంతో అందుకు సరైన సమయం కోసం వేచి చూస్తున్నారని తెలిసింది.

## హైడ్రాపై హోంశాఖకు ఫిర్యాదులు

హైదరాబాద్: తెలంగాణలో సంచలనం సృష్టిస్తున్న 'హైడ్రా' కార్యకలాపాలు ఇప్పుడు వివాదాస్పదంగా మారాయి. హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ హైడ్రా ముందుకు వెళ్తోందని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలంలోని సీయోట్ మారుతీ హిల్స్ కాలనీలో కోర్టు ఆదేశాలకు విరుద్ధంగా తవ్వకాలు జరుపుతున్నారని కాలనీ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆరోపించింది.బషీర్‌బాగ్‌లో జరిగిన సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ..1990-92 మధ్య ప్రైవేటు పట్టా భూములను కొనుగోలు చేసి, అన్ని అనుమతులతో కాలనీని అభివృద్ధి చేశామని తెలిపారు. అయితే, 2016లో ఎఫ్‌టీఎల్ పరిధిని తప్పుగా చూపడం వల్ల 86 మంది ప్లాట్ యజమానులు తీవ్రంగా నష్టపోతున్నారని వివరించారు. ఈ విషయంలో జనవరి 5న హైకోర్టు ఎటువంటి తవ్వకాలు చేపట్టవద్దని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ, హైడ్రా వాటిని లెక్కచేయకుండా పనులు కొనసాగిస్తోందని వారు పేర్కొన్నారు.మరోవైపు, హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై కేంద్ర హోం శాఖకు ఫిర్యాదు అందింది. సివిల్ సర్వీస్ నిబంధనలు-1968ని కమిషనర్ ఉల్లంఘించారని బీఆర్ఎస్ నేత ఎడ్ల సుధాకర్ రెడ్డి కేంద్ర హోం శాఖ అదనపు కార్యదర్శి రాకేశ్‌కుమార్ సింగ్‌కు ఫిర్యాదు చేశారు. అంబర్‌పేట మండలం సర్వే నంబర్ 563/1లోని బతుకమ్మకుంట భూవివాదం కోర్టు విచారణలో ఉండగా, ఆ అంశాలపై మీడియా ముందు తప్పుడు కథనాలు ప్రచారం చేస్తూ తన ప్రతిష్టను దెబ్బతీస్తున్నారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. కోర్టు పరిధిలో ఉన్న అంశాలను బహిరంగంగా చర్చించడం నిబంధనలకు విరుద్ధమని ఆయన విమర్శించారు. బాధితులకు న్యాయం చేయాలని , కోర్టు తీర్పులను గౌరవించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

## తాతయ్య గుంట గంగమ్మ తల్లిని దర్శించుకున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

తిరుపతి : కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారి సోదరి అయిన శ్రీ తాతయ్య గుంట గంగమ్మ తల్లిని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన మంత్రి అనగాని సత్యప్రసాద్, తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డిలకు గంగమ్మ దేవస్థానం ఛైర్మన్ మహేష్ యాదవ్ మరియు ఆలయ అర్చకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు.ఆలయ సాంప్రదాయం ప్రకారం మంత్రి అనగాని సత్యప్రసాద్, తుడా ఛైర్మన్ దివాకర్ రెడ్డి గార్లకు దేవస్థానం ఛైర్మన్ మహేష్ యాదవ్ గజమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం వారు అమ్మవారి మూలవిరాట్టును దర్శించుకుని, ప్రత్యేక పూజలు మరియు అర్చనలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో విలసిల్లాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి రాష్ట్రం సస్యశ్యామలం కావాలని అమ్మవారిని ప్రార్థించారు. దర్శనానంతరం ఆలయ మండపంలో వేద పండితులు మంత్రికి, తుడా ఛైర్మన్‌కు వేద ఆశీర్వచనం పలికారు. ఛైర్మన్ మహేష్ యాదవ్ వారికి అమ్మవారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రం మరియు అమ్మవారి పవిత్ర ప్రతిమను బహుకరించి గౌరవించారు. ఈ కార్యక్రమంలో కూటమి రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహ యాదవ్ తెదేపా తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు పనబాక లక్ష్మి, శ్రీధర్ వర్మ, పులిగోరు మురళి కృష్ణ,జిల్లా నాయకులు,దేవస్థానం బోర్డు సభ్యులు, ఆలయ అధికారులు, అర్చకులు మరియు భక్తులు పాల్గొన్నారు

## వడదెబ్బతగిలి స్పృహతప్పి పడిపోయిన ఉపాధి కూలి

అరకులోయ : అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ మండలం బస్కి పంచాయితీ కొర్రగుడ గ్రామానికి చెందిన కొర్రా.నీలయ్య ఉపాధి హామీ పనిచేస్తూ విపరీతంగా ఎండ కాయడంతో స్పృహ తప్పి పడిపోయారు.పక్కన మిగత కూలీలు ఉండి సమయానికి నీళ్లు తాగించడం వలన ప్రాణాపాయం తప్పిందని కూలీలు కొర్ర.లక్ష్మణ్, సమర్ది. దామోదర్ తిలిపారు. కావున కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పని ప్రదేశంలో టెంటు, మంచినీరు ప్రధమచికిత్స పెట్టె తదితర సామాగ్రి సరఫరా చేయాలనీ, అలాగే ముఖహాజరు వ్యవస్థను రద్దుచేయాలనీ కూలీలు కోరుతున్నారు.

# వంట నూనెలపై భారం తప్పదా...



న్యూఢిల్లీ : ప్రజలకు ధరల పోటు తప్పేలా లేదు. వంట నూనెల ధరలు పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. దీనికి కారణం కేంద్రం తీసుకోబోయే నిర్ణయమే.స్థానిక రైతులకు మద్దతివ్వడం, రూపాయిపై ఒత్తిడిని తగ్గించడం కోసం వంట నూనెలపై దిగుమతి సుంకాలను పెంచే ప్రతిపాదనను భారత ప్రభుత్వం పరిశీలిస్తోంది. వంట నూనెలపై అధిక దిగుమతి పన్నులు.. రైతులు తమ పంటలకు మెరుగైన ధరలు పొందేందుకు సాయపడతాయా, అలాగే భారీ సరుకుల దిగుమతులతో ముడిపడి ఉన్న విదేశీ మారక ద్రవ్య ప్రవాహాలను అరికట్టగలవా అనే విషయాన్ని అధికారులు సీరియస్ గా పరిశీలిస్తున్నారు.ఈ ఏడాది ఆసియాలో రూపాయి అత్యంత బలహీనమైన కరెన్సీగా కొనసాగుతోంది. వంట నూనెలు, ఎరువులు, బంగారం, ముడి చమురు వంటి దిగుమతి చేసుకునే వస్తువులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్న తరుణంలో ఈ చర్చలు జరుగుతున్నాయి. ఈ నెల ప్రారంభంలో వంట నూనెతో సహా దిగుమతి చేసుకునే వస్తువులపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని ప్రధాని రేంద్ర మోదీ దేశ ప్రజలను కోరారు. అంతేకాదు అనవసరమైన దిగుమతులను అరికట్టేందుకు గత వారం బంగారం, వెండిపై దిగుమతి సుంకాన్ని 15 శాతానికి పెంచిన సంగతి తెలిసిందే.భారతదేశం తన వంట నూనె అవసరాలలో దాదాపు 60% దిగుమతి చేసుకుంటుంది. తద్వారా ప్రపంచంలోనే వంట నూనెల అతిపెద్ద కొనుగోలుదారుగా ఉంది. దిగుమతి సుంకాలలో ఏ పెరుగుదల అయినా ప్రధానంగా ఇండోనేషియా, మలేషియా, అర్జెంటీనా, బ్రెజిల్, రష్యా, యుక్రెయిన్ నుండి దిగుమతి అయ్యే పామాయిల్, సోయాబీన్, సన్ ఫ్లవర్ నూనెల రవాణాను ప్రభావితం చేయొచ్చు. ప్రపంచవ్యాప్తంగా ఆహార ధరలు వేగంగా పెరుగుతున్న తరుణంలో ఈ ప్రతిపాదన కూడా వచ్చింది. ఇరాన్ సంఘర్షణ సరఫరా గొలుసులకు అంతరాయం కలిగించి వంట నూనెలు, ధాన్యాలు, మాంసం ఉత్పత్తుల ధరలను పెంచింది.ప్రపంచంలో అత్యంత విస్తృతంగా ఉపయోగించే వంట నూనె అయిన పామాయిల్.. సంఘర్షణ ప్రారంభమైనప్పటి నుండి సుమారు 12% పెరిగింది. పెరుగుతున్న ఇంధన వ్యయాలను భర్తీ చేసుకునే ప్రయత్నంలో భాగంగా ఇండోనేషియా, మలేషియాలో బయో ఫ్యూయల్ ఉత్పత్తి పెరగడం కూడా ఈ పెరుగుదలకు పాక్షికంగా కారణమైంది. అయితే, దిగుమతి సుంకాలను పెంచడానికి భారత్ తీసుకోబోయే చర్య కొనుగోళ్లను నెమ్మదింపజేసి, ఇటీవలి ధరల పెరుగుదలను అదుపు చేయగలదు.కాగా, దిగుమతి సుంకాల పెంపుపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. దేశీయ ధరలను తగ్గించి, ప్రాసెసర్లకు ఉపశమనం కల్పించే ప్రయత్నంలో భాగంగా గత సంవత్సరం ముడి పామ్, సోయాబీన్, సన్ ఫ్లవర్ నూనెలపై ప్రాథమిక దిగుమతి సుంకాన్ని 20% నుండి 10%కి తగ్గించింది కేంద్రం. సుంకం తగ్గింపు వల్ల కలిగే ప్రయోజనాలను వినియోగదారులకు అందించాలని పరిశ్రమను కోరింది ప్రభుత్వం.ఇదిలా ఉండగా, పెరుగుతున్న ముడి చమురు ధరల ఒత్తిడి కారణంగా భారత రూపాయి మరింత బలహీనపడి, సోమవారం అమెరికా డాలర్‌తో పోలిస్తే 96.35 వద్ద రికార్డ్ కనిష్ట స్థాయికి పడిపోయింది.

# గ్రేటర్ ఎన్నికలకు గులాబీ ప్లాన్

హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, భాగ్య నగర రాజకీయం అప్పుడే వేడెక్కింది. జీహెచ్ఎంసీ పీఠంపై మరోసారి గులాబీ జెండాను ఎగురవేయడమే లక్ష్యంగా బీఆర్ఎస్ తన వ్యూహాలకు పదును పెడుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అధిక స్థానాలను సాధించి తన పట్టును నిరూపించుకున్న బీఆర్ఎస్, అదే జోష్‌తో మున్సిపల్ ఎన్నికల బరిలోకి దిగేందుకు సమాయత్తమవుతోంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వయంగా రంగంలోకి దిగి, ఓటర్ల జాబితా సవరణ నుంచి సభ్యత్వ నమోదు వరకు ప్రతి అంశాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటూ కేడర్‌కు దిశానిర్దేశం చేస్తున్నారు.గత ఎన్నికల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, తమ పార్టీ సానుభూతిపరులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి గల్లంతు కాకుండా బీఆర్ఎస్ పకడ్బందీ చర్యలు చేపట్టింది. కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియపై పార్టీ శ్రేణులను పూర్తిగా అలర్ట్ చేసింది. ఈ నెల 25 నుంచి ఈ ప్రక్రియ రాష్ట్రంలో ప్రారంభం కానుండటంతో, ప్రతి డివిజన్, పోలింగ్ బూత్ పరిధిలో ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలని కేటీఆర్ ఆదేశించారు.అయితే, ఈ ప్రక్రియను మానిటరింగ్ చేసేందుకు బూత్ లెవెల్ ఏజెంట్ల లిస్ట్ ఇవ్వాలని అధిష్ఠానం ఆదేశించగా, మొత్తం 119 నియోజకవర్గాల్లో 38 నియోజకవర్గాల నుంచి ఇంకా లిస్ట్ అందకపోవడంపై ఇటీవల పార్టీ అధినేత కేసీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిని సీరియస్‌గా తీసుకున్న కేటీఆర్.. గ్రేటర్ హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలకు చెందిన ముఖ్య నేతలతో అత్యవసర సమావేశం నిర్వహించారు. గులాబీ క్యాడర్ బలంగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలని స్పష్టం చేశారు. కొత్త ఓటర్ల నమోదు, తప్పుల సవరణ, అర్హులైన ఓటర్ల వద్ద అవసరమైన అర్హత పత్రాలు ఉండేలా చూసే బాధ్యతను ఈ బీఎల్‌ఏలకు అప్పగించారు.2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో బీఆర్ఎస్ అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంది. గతంలో వరుసగా రెండు సార్లు గ్రేటర్ మేయర్ పీఠాన్ని కూడా దక్కించుకుంది. ఈ నేపథ్యంలో ఎస్ఐఆర్ ప్రక్రియ వల్ల ఈ జిల్లాల్లోని ఓటర్లు ఎక్కువగా ప్రభావితం అయ్యే అవకాశం ఉందని భావించి, ముస్లిం మైనారిటీ ఓటు బ్యాంకుపై పార్టీ ప్రత్యేక దృష్టి సారించింది. పాతబస్తీ మినహా మిగిలిన అన్ని ప్రాంతాల్లో మైనారిటీలు బీఆర్ఎస్ వైపే నిలిచారు. అందుకే, తమ పార్టీ ఎమ్మెల్యేలు ఉన్న చోటా, లేని చోటా బూత్ ల వారీగా బీఎల్ఏ



లను నియమించి సానుకూల ఓట్లను కాపాడుకునేందుకు క్షేత్రస్థాయి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారు.ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకు వేచి చూడకుండా, ప్రజల్లోనే ఉండాలని మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, డివిజన్ ఇంచార్జ్లను కేటీఆర్ ఆదేశించారు. గ్రేటర్ పరిధిలోని ప్రధాన సమస్యలైన డ్రైనేజీ వ్యవస్థ లోపాలు, తాగునీటి ఎద్దడి, దెబ్బతిన్న రోడ్లు, స్థానిక మౌలిక వసతుల కల్పనలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు లాంటి వాటిని ఎండగడుతూ ప్రజల్లోకి వెళ్లాలని దిశానిర్దేశం చేశారు. తెలంగాణ భవన్ వేదికగా కేటీఆర్ ఈ మొత్తం వ్యవహారాన్ని స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

# శ్రీలీలకు తెలుగు ఛాన్సులు తగ్గాయా?



టాలీవుడ్ లో చాలా తక్కువ సమయంలో స్టార్ హీరోయిన్ గా ఎదిగిన బ్యూటీల్లో శ్రీలీల పేరు కచ్చితంగా ముందుంటుంది. తనదైన అందం, డాన్స్, ఎనర్జీ, స్క్రీన్ ప్రెజెన్స్ తో యూత్ లో మంచి క్రేజ్ సంపాదించుకున్న ఆమె కెరీర్ పై ఇప్పుడు అందరి దృష్టి పడింది. వరుస సినిమాలతో దూసుకెళ్లిన శ్రీలీల ప్రస్తుతం తెలుగులో ఒక్క సినిమా కూడా చేయకపోవడం హాట్ టాపిక్ గా మారింది. నిజానికి.. శ్రీలీల ఎంబీబీఎస్ చదువుకుంటూనే సినిమాల్లోకి అడుగు పెట్టింది. 2019లో వచ్చిన కన్నడ చిత్రం కిస్ తో హీరోయిన్ గా పరిచయమయ్యారు. తొలి సినిమాతోనే మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆమెకు సైమా బెస్ట్ డెబ్యూ హీరోయిన్ అవార్డు దక్కింది. ఆ తర్వాత దర్శకేంద్రుడు కె. రాఘవేంద్రరావు పర్యవేక్షణలో రూపొందిన పెళ్లి సందణతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన ఆమె.. ఒక్కసారిగా అందరి దృష్టిలో పడ్డారు. అయితే శ్రీలీల కెరీర్ కు అసలు టర్నింగ్ పాయింట్ గా నిలిచింది ధమాకా. ముఖ్యంగా పల్సర్ బైక్ పాటలో ఆమె వేసిన స్టెప్పులకు అంతా ఫిదా అయ్యారు. ఆ ఒక్క సినిమాతోనే ఆమె స్టార్ హీరోల సరసన అవకాశాలు అందుకుంది. బాలకృష్ణ భగవంత్ కేసరిలో విజ్జి పాప పాత్రలో నటించి నటిగా కూడా ప్రశంసలు అందుకుంది. కేవలం గ్లామర్ మాత్రమే కాదు, ఎమోషనల్ సీన్స్ కూడా బాగా చేయగలనని ప్రూవ్ చేసుకున్నారు. ఆ తర్వాత గుంటూరు కారం వంటి భారీ చిత్రంలో నటించే అవకాశం దక్కించుకున్న అమ్మడు.. అలాగే పవన్ కళ్యాణ్ తో ఉస్తాద్ భగత్ సింగ్ లో కనిపించారు.. కానీ ఈ మధ్య ఆమె చేసిన కొన్ని పెద్ద సినిమాలు ఆశించిన స్థాయిలో విజయాలు సాధించకపోవడం సెలక్షన్ పై చర్చ మొదలైంది. ఇప్పుడు ముఖ్యంగా వినిపిస్తున్న ప్రశ్న ఒక్కటే.. శ్రీలీలకు తెలుగులో అవకాశాలు తగ్గాయా? లేక ఆమెనే ఆచితూచి వ్యవహరిస్తుందా? ప్రస్తుతం ఆమె లైనప్ లో ఒక్క టాలీవుడ్ మూవీ కూడా లేకపోవడం ఆ చర్చకు మరింత బలం ఇస్తోంది. అయితే అదే సమయంలో కోలీవుడ్, బాలీవుడ్ లో మాత్రం ఆమె బిజీగా మారుతోంది. ఇప్పటికే తమిళంలో పరాశక్తి సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన శ్రీలీల, ఇప్పుడు ధనుష్ చిత్రంలో నటిస్తున్నారు. అలాగే బాలీవుడ్ లో కూడా వరుస అవకాశాలు అందుకుంటోంది. కార్తీక్ ఆర్యన్ తో కలిసి ఓ సినిమా చేస్తుండగా, ఇబ్రహీం అలీ ఖాన్ తో మరో ప్రాజెక్ట్ కు ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. అయితే కథల ఎంపిక విషయంలో కూడా శ్రీలీల జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారని టాక్ వినిపిస్తోంది. 'కేవలం గ్లామర్ పాత్రలు కాకుండా, నటిగా గుర్తుండిపోయే పాత్రలు చేయాలని ఉంది. వైవిధ్యమైన కథలకే ప్రాధాన్యం ఇస్తాను' అని ఆమె ఇటీవల చేసిన కామెంట్స్ అందుకు కారణం. దీంతో కథలు నచ్చక కొన్ని ప్రాజెక్టులు ఆమె వదులుకుంటోందని టాక్ వినిపిస్తోంది. మరోవైపు ఆమె పారితోషికం కూడా భారీగా పెరిగిందని, అందుకే కొందరు నిర్మాతలు ఇతర హీరోయిన్ల వైపు చూస్తున్నారని ప్రచారం కూడా జరుగుతోంది. ఇందులో ఎంతవరకు నిజం ఉందో తెలియదు గానీ, ఒకప్పుడు వరుసగా తెలుగు సినిమాలతో బిజీగా ఉన్న శ్రీలీల చేతిలో ఇప్పుడు ఒక్క టాలీవుడ్ మూవీ కూడా లేకపోవడం మాత్రం గమనార్హం.

# భాగ్యశ్రీకి.. తమిళంలో ఇంకోటి



అందం, అభినయం రెంటితోనూ ఆకట్టుకున్నప్పటికీ.. కొందరు హీరోయిన్లకు అదృష్టం కలిసి రాదు. వరుసగా అవకాశాలు వస్తున్నా.. సినిమాలు హిట్ కావు. ముంబయి భామ భాగ్యశ్రీ బోర్సే పరిస్థితి ఇదే. ఇప్పటికే ఆమె తెలుగు, తమిళ భాషల్లో నాలుగు సినిమాలు చేసింది. అందులో తెలుగులో నటించిన సినిమాలు.. మిస్టర్ బచ్చన్, కింగ్డమ్, ఆంధ్ర కింగ్ తాలూకా. తమిళంలో 'కాంత' అనే సినిమాలో నటించింది. కానీ వీటిలో ఏదీ కమర్షియల్ సక్సెస్ కాలేదు. మిస్టర్ బచ్చన్ మినహాయిస్తే మిగతా మూడూ పర్వాలేదనిపించే సినిమాలే. కానీ ఆడలేదు. ఐతే తెలుగులో హ్యాట్రిక్ ఫ్లాపులు కొట్టినా భాగ్యశ్రీకి అవకాశాలేమీ ఆగిపోలేదు. 'లెనిన్'లో నటిస్తోంది. మరో సినిమాకు కూడా తన పేరును పరిశీలిస్తున్నారు. తమిళంలో మాత్రం 'కాంత' తర్వాత ఆమెకు బ్రేక్ వచ్చింది. ఐతే ఇప్పుడు భాగ్యశ్రీకి అక్కడా ఇంకో ఛాన్స్ లభించింది. శివ కార్తికేయన్ లాంటి స్టార్ హీరో సరసన భాగ్యశ్రీని కథానాయికగా ఎంచుకున్నారు. 'అమరన్' లాంటి బ్లాక్‌బస్టర్ తర్వాత కమల్ హాసన్ నిర్మాణంలో శివకార్తికేయన్ మరో సినిమా చేస్తున్నాడు. అదే.. సెయాన్. శివ నిర్మాణంలో 'తాయ్ కిళవి' అనే సూపర్ హిట్ సినిమాతో దర్శకుడిగా పరిచయం అయిన శివకుమార్ మురుగేశన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండడం విశేషం. ఇందులో శివ సరసన భాగ్యశ్రీ నటించబోతున్నట్లు ఇంతకుముందే వార్తలు వచ్చాయి. ఇప్పుడు ఆ విషయం అధికారికం అయింది. 'తాయ్ కిళవి' తరహాలోనే తన రెండో చిత్రాన్ని కూడా రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో తీయబోతున్నాడు శివకుమార్. ఇలాంటి చిత్రాల్లో కథానాయికను లంగావోణీలు, చీరల్లో కొంచెం మాస్‌గా చూపిస్తుంటారు. మరి అలాంటి పాత్రలో భాగ్యశ్రీ ఎలా ఒదిగిపోతుందో చూడాలి. 'కాంత' సినిమా ఫ్లాప్ అయినప్పటికీ.. భాగ్యశ్రీ కెరీర్లో బెస్ట్ పెర్ఫామెన్స్ ఇచ్చింది. ఆమె జస్ట్ అందగత్తె కాదని, మంచి పెర్ఫామర్ అని ఈ సినిమాతో రుజువైంది. ఆ టాలెంట్ చూసే శివకార్తికేయన్ సినిమాలో ఛాన్స్ ఇచ్చినట్లున్నారు. ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతోంది.

# ఇళయరాజా మళ్ళీ ఫీలయ్యారా?

ఇండియన్ మ్యూజిక్ వరల్డ్ లో లెజెండరీ కంపోజర్ గా గుర్తింపు పొందిన ఇళయరాజా పేరు మరోసారి కోలీవుడ్ లో హాట్ టాపిక్ గా మారింది. రీసెంట్ గా తమిళ స్టార్ హీరో సూర్య లీడ్ రోల్ లో నటించిన కరుప్పు (తెలుగులో వీరభద్రుడు) మూవీ విడుదలై మిక్స్ డ్ రెస్పాన్స్ అందుకుంది. అయితే సినిమాలోని ఓ డైలాగ్ ఇప్పుడు వివాదానికి దారి తీసింది. దీంతో చిత్ర నిర్మాణ సంస్థ డ్రీమ్ వారియర్ పిక్చర్స్ ఇళయరాజాకు క్షమాపణలు చెప్పడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. నిజానికి కరుప్పు మూవీ సెకండాఫ్ లో వచ్చే ఒక సీన్ లో సాంగ్స్ కాపీరైట్ అంశంపై వ్యంగ్యంగా ఓ డైలాగ్ ఉంటుంది. ఆ సీన్ లో బ్యాక్ గ్రౌండ్ లో విజయ్ కాంత్ సినిమాకు సంబంధించిన ఓ పాట వినిపించగా.. ఆ తర్వాత వచ్చే కన్వర్జేషన్ పరోక్షంగా ఇళయరాజాను ఉద్దేశించినట్టు అనేక మంది మూవీ లవర్స్ భావించారు. ముఖ్యంగా ఆయన గతంలో పాటల హక్కుల విషయంలో తీసుకున్న స్టాండ్ ను సెటైరికల్ గా చూపించారని సోషల్ మీడియాలో విమర్శలు వచ్చాయి. దీంతో వివాదం పెద్దది అయ్యేటట్లు కనిపిస్తుండగా.. ఇప్పుడు మూవీ టీమ్ రెస్పాండ్ అయింది. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ విడుదల చేసిన ప్రకటనలో ఇళయరాజాపై తమకు ఎంతో



గౌరవం ఉందని స్పష్టం చేసింది. భారతీయ సంగీతానికి ఆయన అందించిన సేవలు ఎన్నో జెనరేషన్లకు ఇన్స్పిరేషన్ అని పేర్కొంది. కరుప్పు సినిమాలోని ఒక డైలాగ్ వల్ల ఆయన మనోభావాలు దెబ్బతిన్నాయని తమ దృష్టికి వచ్చిందని, అందుకు హృదయపూర్వక క్షమాపణలు కోరుతున్నామని తెలిపింది. అలాగే ఆ డైలాగ్‌ను వ్యక్తిగతంగా ఇళయరాజాను టార్గెట్ గా చేసుకుని రాయలేదని కూడా వివరణ ఇచ్చింది. అది కేవలం వ్యంగ్య సందర్భంలో భాగంగా మాత్రమే ఉంచిన డైలాగ్ అని పేర్కొంది. అయినప్పటికీ ప్రేక్షకుల్లో, అభిమానుల్లో తప్పుగా అర్థమైందని భావించి ఆ సన్నివేశాన్ని సినిమా నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించింది. ఈ మార్పు వెంటనే అమల్లోకి వస్తుందని వెల్లడించింది. ఇటీవల కాలంలో ఇళయరాజా పేరు కాపీరైట్ వివాదాల కారణంగా తరచూ వార్తల్లో నిలుస్తోంది. ఆయన కంపోజ్ చేసిన పాటలను అనుమతి లేకుండా వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటానని పలుమార్లు హెచ్చరించారు. పలువురు నిర్మాతలు, సంగీత సంస్థలకు నోటీసులు కూడా పంపించారు. దీంతో ఆయన పాటల హక్కుల విషయంలో చాలా కఠినంగా వ్యవహరిస్తారనే అభిప్రాయం ఇండస్ట్రీలో ఉంది. ఈ నేపథ్యంలో కరుప్పు సినిమాలో వచ్చిన డైలాగ్ మరింత సెన్సిటివ్ ఇష్యూగా మారింది. మరోవైపు ఆ వివాదంపై ఇళయరాజా ఇప్పటివరకు అఫీషియల్ గా రెస్పాండ్ అవ్వలేదు. కానీ మేకర్స్ వెంటనే క్షమాపణ చెప్పి సన్నివేశాన్ని తొలగించడంతో వివాదం ఇక్కడితో ముగిసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం సోషల్ మీడియాలో మాత్రం ఆ అంశంపై పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది. కొందరు మేకర్స్ తీసుకున్న నిర్ణయాన్ని అభినందిస్తుంటే.. మరికొందరు సినిమాల్లో వ్యంగ్యానికి కూడా కొన్ని లిమిట్స్ ఉండాలంటూ పలువురు నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.

# గ్లామర్ డోస్ పెంచిన జాక్వెలిన్..

విశిష్టమైన కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ లో బాలీవుడ్ బ్యూటీ జాక్వెలిన్ ఫెర్నాండెజ్ తన గ్లామర్ డోస్‌తో ఇంటర్నేషనల్ లెవెల్‌లో సెగలు పుట్టిస్తోంది. అక్కడ జరిగిన చోపార్డ్ మిరాకిల్ గాలా ఈవెంట్‌లో ఆమె వేసుకున్న బ్లాక్ మినీ డ్రెస్ ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. పెద్ద పెద్ద గౌన్లు వేసుకుంటేనే కేన్స్‌లో హైలైట్ అవుతారనే రూల్‌ను బ్రేక్ చేస్తూ, ఒక చిన్న బ్లాక్ డ్రెస్‌తో నెటిజన్లకు నిద్రపట్టకుండా చేస్తోంది ముద్దుగుమ్మ. ఆ హాట్ ఫోటోషూట్ విశేషాలు చూద్దాం.. ఈ ఏడాది కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో జరిగిన అత్యంత లగ్జరీ అండ్ క్రేజీ ఈవెంట్ 'చోపార్డ్ మిరాకిల్ గాలా'. ఈ స్టార్-స్టడెడ్ ఈవెంట్‌కు భారతదేశం నుండి ఆహ్వానం అందుకున్న ఏకైక సెలబ్రిటీ జాక్వెలిన్ ఫెర్నాండెజ్ మాత్రమే కావడం విశేషం. అందుకే ఈ వేడుకలో ఆమె లుక్ మరింత స్పెషల్‌గా నిలిచింది. ఇక రెడ్ కార్పెట్ మీదే కాదు.. హోటల్ కారిడార్‌లో ఆమె నడుస్తూ ఇచ్చిన పోజులు, అద్దం ముందు తీసుకున్న సెల్ఫీలు ఇప్పుడు నెట్‌లో తెగ వైరల్ అవుతున్నాయి. జాక్వెలిన్ ఈ ఈవెంట్ కోసం సెలెక్ట్ చేసుకున్న డ్రెస్ సాధారణమైనది కాదు. ఫేమస్ లగ్జరీ ఫ్యాషన్ బ్రాండ్ 'కరోలిన్స్ కోచర్' డిజైన్ చేసిన కస్టమ్ బ్లాక్ సిల్క్ మౌస్లిన్ మినీ డ్రెస్ ఇది. ఇక స్ట్రాప్‌లెస్ మోడల్‌లో ఉన్న ఈ డ్రెస్‌కు స్విస్ ఎంబ్రాయిడరీ, సీక్విన్స్, ముత్యాల లాంటి పూసల వర్క్ మరియు మెరిసే క్రిస్టల్స్ అద్ది హైలైట్ చేశారు. దీంతో ఆమె నడుస్తుంటే చిన్న చిన్న మెరుపులతో డ్రెస్ మొత్తం వెలిగిపోయింది. ఈ లుక్‌లో హైలైట్ ఏంటంటే.. జాక్వెలిన్ హెవీగా మేకప్ వేసుకోలేదు, నగలు కూడా ఎక్కువగా పెట్టలేదు. కేవలం ఒక డైమండ్ గొలుసు, పెద్ద గుండ్రని చెవి రింగులు, చేతికి వెడల్పాటి కడియంతో లుక్‌ను సింపుల్‌గా డ్రెస్ చేసింది. ఇక జుట్టును ఒక పక్కగా వదిలేసి, బ్లాక్ కలర్ హై హీల్స్ చెప్పులతో ఆమె నడిచిన నడక ఈ ఫోటోషూట్‌కే కొత్త అందాన్ని తెచ్చింది. పెద్దగా కష్టపడకుండా చాలా సహజంగా గ్లామర్‌ను ఎలా పీక్స్‌కు తీసుకెళ్లవచ్చో జాక్వెలిన్ చూపించింది. జాక్వెలిన్ కేవలం ఇలాంటి ఫ్యాషన్ ఈవెంట్లకే పరిమితం కాలేదు. ఆమె చేతిలో వరుస సినిమాలు ఉన్నాయి. గత రెండేళ్లలో సర్కస్, సెల్ఫీ, ఫతే, మరియు అమెరికన్ మూవీ 'కిల్ ఎమ్ ఆల్ 2' లో నటించిన ఈమె.. గత ఏడాది వచ్చిన రైడ్ 2, హౌస్‌ఫుల్ 5 మూవీస్ హిట్ అయ్యాయి. ఇక ఈ ఏడాది 2026 లో ఆమె నటించిన 'వెల్‌కమ్ టు ది జంగిల్' కూడా రిలీజ్‌కు రెడీగా ఉంది. అంటే అటు స్క్రీన్ మీద, ఇటు గ్లామర్ ప్రపంచంలో ఆమె అస్సలు ఖాళీగా లేదన్నమాట. ఇక తక్కువ ముస్తాబుతో ఎక్కువ ఇంపాక్ట్ చూపించవచ్చని జాక్వెలిన్ మరోసారి ప్రూవ్ చేసింది. అందుకే లగ్జరీ బ్రాండ్ చోపార్డ్ సంస్థ కూడా తమ అఫీషియల్ ఇన్‌స్టాగ్రామ్ పేజీలో ఆమె ఫోటోలను షేర్ చేస్తూ ప్రశంసల వర్షం కురిపించింది. కేన్స్ వేదికగా జాక్వెలిన్ వదిలిన ఈ గ్లామర్ బాంబ్ నెటిజన్ల గుండెల్లో మంటలు పుట్టిస్తోందనడంలో ఎలాంటి సందేహం లేదు.



# వింటేజ్ రొమాంటిక్ లుక్..

చీరకట్టులో కూడా సాంప్రదాయంగా కనిపించి అభిమానులను అలరిస్తున్న నేటితరం హీరోయిన్స్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు . ముఖ్యంగా కొంతమంది హీరోయిన్లు సోషల్ మీడియా వేదికగా ఫోటోలు పంచుకున్నప్పటికీ.. అందులో చాలా పద్ధతిగా చీర కట్టి నిండుగా చందమామలా కనిపించి, ఫాలోవర్స్ ను పెంచుకుంటున్నారు. అలాంటి వారిలో మానస వారణాసి కూడా ఒకరు. అందానికి అందం.. అందుకు తగ్గట్టు అభినయం ప్రదర్శిస్తూ అందరినీ ఆకట్టుకుంటున్న మానస మరొకసారి మరో ట్రెడిషనల్ లుక్ లో కనిపించి ఆకట్టుకుంది. క్రీమ్ కలర్ ప్రింటెడ్ శారీ కట్టుకున్న ఈమె దీనికి ఆపోజిట్ రెడ్ కలర్ బ్లౌజ్ ధరించింది. మెరూన్ రెడ్ స్టోన్స్ పొదిగిన చెవి దిద్దులను ధరించిన ఈమె చేతికి డైమండ్ గాజులను తొడిగింది. ఇక నెక్ పీస్ ను బోసిగా ఉంచి.. ముఖానికి పర్ఫెక్ట్ మేకప్ అద్దుకొని తన కాటుక కళ్ళతో.. వింటేజ్ రొమాంటిక్ లుక్ తో ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. మొత్తానికైతే మానస వారణాసి షేర్ చేసిన ఈ లేటెస్ట్ అవుట్ ఫిట్ లుక్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటుంది. అచ్చం మన ఇంటి అమ్మాయిల ఉంది అంటూ నెటిజన్స్ కామెంట్లు చేస్తున్నారు. 1997 మార్చి 27న హైదరాబాదులో జన్మించింది. ఈమె తండ్రి ఉద్యోగ రీత్యా మలేషియాకు వెళ్ళిన ఈమె.. 2012లో జిఐఐఎస్ మలేషియా క్యాంపస్ నుండి గ్రేడ్ 10 పూర్తి చేసింది. మళ్ళీ హైదరాబాద్ కి వచ్చి ఎఫ్ఐఐటి జేఈఈ లో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన ఈమె.. వాసవి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ లో కంప్యూటర్ సైన్స్ చదువును పూర్తి చేసి, ఫ్యాక్ట్ సెట్ లో ఫైనాన్షియల్ ఇన్ఫర్మేషన్ ఎక్స్చేంజ్ విశ్లేషకురాలిగా కూడా పనిచేసింది. 2019లో ఫెమినా మిస్ ఇండియా తెలంగాణ పోటీల్లో పాల్గొని టాప్ 3 ఫైనలిస్టులో ఒకరిగా నిలిచిన ఈమె.. 2020లో ఫెమినా మిస్ ఇండియా తెలంగాణ టైటిల్ కోసం ఆడిషన్ చేసి విజేతగా నిలిచింది. 2020 మిస్ ఇండియా పోటీల్లో తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించింది కూడా... ఇక ఇలా ఎన్నో అందాల పోటీలలో పాల్గొని పలు కిరీటాలను కూడా దక్కించుకుంది మానస.ఇక అలా పలు కార్యక్రమాలలో పాల్గొన్న మానస 2024లో దేవకి నందన వాసదేవా సినిమాతో హీరోయిన్గా ఇండస్ట్రీకి పరిచయమైంది. మొదటి సినిమాతోనే క్యూట్ ఎక్స్ప్రెషన్ తో అందరినీ ఆకట్టుకున్న ఈమె.. ఈ ఏడాది సంతోష్ శోభన్ హీరోగా వచ్చిన కపుల్ ఫ్రెండ్లీ సినిమాతో కుర్ర కారుకి ఫేవరెట్ హీరోయిన్గా మారిపోయింది. ఈ సినిమాలో తన పాత్రతో ఊహించని పాపులారిటీ దక్కించుకుంది. ఇక మళ్ళీ సంతోష్ శోభన్ తో కలిసి మరో సినిమా చేస్తోంది. అది కూడా రొమాంటిక్ లవ్ కామెడీ బ్యాక్ గ్రౌండ్ లో రాబోతున్నట్లు సమాచారం.





## సూరంపల్లి గ్రామ అభివృద్ధికి ఎంపీ రఘునందన్ రావు హామీ.

సిద్దిపేట ప్రజాకలం మే 20.

దౌల్తాబాద్ మండల పరిధిలోని సూరంపల్లి గ్రామ సర్పంచ్‌తో పాటు గ్రామ పాలకవర్గ సభ్యులు మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావును వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎంపీకి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

అనంతరం గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై ఎంపీతో చర్చించారు. గ్రామంలో ఉన్న డ్రైనేజీ, సీసీ రోడ్లు, తాగునీటి సమస్యల పరిష్కారంతో పాటు ఇతర అభివృద్ధి పనులకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన ఎంపీ రఘునందన్ రావు సూరంపల్లి గ్రామ అభివృద్ధికి తన వంతు పూర్తి సహకారం అందిస్తానని, అవసరమైన నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# అన్న నగర్ ప్రభుత్వ పాఠశాలకు నూతన రూపం

## : CSR నిధులతో పునర్నిర్మాణం-ఎమ్మెల్యే



**కంటోన్మెంట్, మే 20**
**ప్రజా కలం ప్రతినిధి**

కంటోన్మెంట్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఇటీవల బస్తీ పర్యటన చేపట్టిన ఆయన, బాలంరాయి అన్న నగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఆ సమయంలో పాఠశాల భవనం పైకప్పు పూర్తిగా శిథిలావస్థకు చేరడం, విద్యార్థులకు కనీస ఆట స్థలం లేకపోవడాన్ని ఆయన గమనించారు. చిన్నారుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పాఠశాలను తక్షణమే పునర్నిర్మించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే గుర్తించారు. ఈ క్రమంలోనే ప్రముఖ సేవా సంస్థ మహావీర్ ఇంటర్నేషనల్ ఉడాన్ ను సంప్రదించిన ఎమ్మెల్యే, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధుల ద్వారా పాఠశాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. దీనికి సంస్థ ప్రతినిధులు సానుకూలంగా స్పందించడంతో, బుధవారం ఎమ్మెల్యే శ్రీగణేష్ ఆ సంస్థ ప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పాఠశాల ప్రాంగణాన్ని సమగ్రంగా పరిశీలించారు. పాఠశాల పునర్నిర్మాణం ,ఆధునికీకరణకు సంబంధించి అందరి నూతన సూచనలు, సలహాలను స్వీకరించి ఒక పటిష్టమైన ప్రణాళికను రూపొందిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ.. పాఠశాల నూతన భవన నిర్మాణానికి అవసరమైన అన్ని రకాల ప్రభుత్వ, కంటోన్మెంట్ బోర్డు అనుమతులను త్వరితగతిన మంజూరు చేయించేందుకు తన వంతుగా బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. చిన్నారులకు ఆధునిక వసతులతో కూడిన నాణ్యమైన, ఆహ్లాదకరమైన విద్యా వాతావరణాన్ని అందించడమే ఈ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. నవ కంటోన్మెంట్ నిర్మాణంలో విద్యకు తాము అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చడమే తమ ధ్యేయమని ఆయన స్పష్టం చేశారు.



## కేపీహెచ్ బి సర్వీస్ రోడ్డులో ఆక్రమ షాపులను తొలగించాలని గవర్నర్ కు వినతి

కూకట్ పల్లి, మే 20, ప్రజా కలం ప్రతినిధి:

కేపిహెచ్ బి కాలనీ మొదటి రోడ్ నుండి జెఎన్ టియు వరకు ఉన్న సర్వీస్ రోడ్డులో అక్రమ షాపుల ఏర్పాటుతో రోడ్లు ఇరుకుగా మారి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని, వ్యాపారాలు నిర్వహిస్తున్న వ్యాపారుల గుర్తింపుపై స్థానికుల్లో తీవ్ర భద్రతా ఆందోళనలు కలుగుతున్నాయని రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా కు స్వచ్ఛభారత్ అభియాన్ ఫౌండర్ చైర్మన్, కూకట్ పల్లి నియోజకవర్గం బిజెపి ఇన్ ఛార్జ్ మాధవరం కాంతారావు బుధవారం



ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సమస్యను పరిష్కరించాలని రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లాను లోక్ భవన్‌లో మాధవరం కాంతారావు కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం మాధవరం కాంతారావు మాట్లాడుతూ కేపిహెచ్ బి కాలనీ మొదటి రోడ్ నుండి జెఎన్ టియు వరకు ఉన్న సర్వీస్ రోడ్డులో 300కి పైగా అక్రమ షాపుల ఏర్పాటుతో రోడ్లు ఇరుకుగా మారి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. వ్యాపారాలు నిర్వహిస్తున్న వ్యాపారుల గుర్తింపుపై స్థానికుల్లో తీవ్ర భద్రతా ఆందోళనలు ఉన్నాయన్నారు. ఈ సమస్యపై ఇప్పటికే జిహెచ్‌ఎంసి, ట్రాఫిక్ పోలీస్, డిజిపిలకు సైతం పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఎలాంటి ఫలితం లేకపోవడంతోనే తాము గవర్నర్ ను ఆశ్రయించాల్సి వచ్చిందన్నారు. ఈ సమస్య పై గవర్నర్ సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి అర్బన్ జిల్లా కన్వీనర్ డాక్టర్ ఎస్ మల్లారెడ్డి, సంగారెడ్డి జిల్లా ప్రెసిడెంట్ జి అంజిరెడ్డి, మేడ్చల్ రూరల్ జిల్లా ప్రెసిడెంట్ శ్రీనివాస్, కిసాన్ మోర్చా మాజీ ప్రెసిడెంట్ కళ్లెం బాల్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శంకర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ కృష్ణారెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఈ-ఫార్మసీలకు వ్యతిరేకంగా గజ్వేల్‌లో మెడికల్ షాపుల బంద్



గజ్వేల్ :20 మే 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

ఆలిండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ పిలుపు మేరకు గజ్వేల్ మెడికల్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని రిటైల్ మెడికల్ షాపులు బుధవారం బంద్ పాటించాయి. ఆన్‌లైన్ ద్వారా ఔషధాల విక్రయం నిర్వహిస్తున్న ఈ-ఫార్మసీ కంపెనీలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఈ బంద్‌కు పిలుపునిచ్చినట్లు సంఘం నాయకులు తెలిపారు. ప్రజలకు మందుల కొరత తలెత్తకుండా జన ఔషధి కేంద్రాలు,అలాగే ఆసుపత్రులకు అనుబంధంగా పనిచేసే మెడికల్ స్టోర్లు యథావిధిగా కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆన్‌లైన్ ఔషధాల విక్రయాన్ని పూర్తిగా నిలిపివేయాలని, జీఎస్ఆర్ 817 (28-08-2018)ను ఉపసంహరించుకోవాలని,కార్పొరేట్ సంస్థలు అమలు చేస్తున్న భారీ డిస్కౌంట్ విధానాలను నిలిపివేయాలని, అలాగే జీఎస్ఆర్ 220 (26-03-2020)ను కూడా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఏరియా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు పి.దేవదాసు,ప్రధాన కార్యదర్శి ఎస్.యాదగిరి,కోశాధికారి జె.రాజు గౌడ్,సాయి,వేణు సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్ రావు, అరవింద్ మహిపాల్,రుక్మయ్య,సంతోష్,అశోక్, గజ్వేల్ ఏరియా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ సంఘం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గంట శంకరయ్యకు ఘన నివాళి



గజ్వేల్:20 మే
( ప్రజా కలం ప్రతినిధి)

కీ"శే గంట శంకరయ్య 5వ వర్ధంతి సందర్భంగా బుధవారం గజ్వేల్ లో అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ సంఘము,ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గంట శంకరయ్య చిత్ర పటానికి పూల మాలతో ఘనమైన నివాళి అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ గజ్వేల్ లో అంబేద్కర్ సంఘము నెలకొల్పి అట్టి సంఘం అధ్యక్షులు ఉండి అంబేద్కర్ సంఘము ఆధార్యములో గ్రామ గ్రామ తిరుగుతూ దళితుల కోసము సంక్షేమమే కోసము అలుపెరగని పోరాటము చేసిన వ్యక్తి గంట శంకరయ్య అని వారి ఆశయాలను కొనసాగిస్తారు అని తెలుపడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షులు అట్టుకూరి రాములు,ప్రధాన కార్యదర్శి మస్కూరి కిష్టయ్య,మన్నే కృష్ణ,బొల్లారం ఎల్లయ్య,పంబాల సత్యనారాయ,పొట్ట యాదగిరి, మంచపురం బాల్ నర్సయ్య, మైసా మల్లయ్య,తుమ్మ శ్రీనివాస్,బైరము శివకుమార్, మైసా నాగరాజు తదితరులు పాల్గొన్నారు

## సాక్షి సీనియర్ రిపోర్టర్ పరశురామ్‌కు ఘనంగా జన్మదిన వేడుకలు

### శుభాకాంక్షలు తెలిపిన ఉపసర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి

గజ్వేల్ నియోజకవర్గం:20 మే 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్ నియోజకవర్గం జగదేపూర్ మండలం తిగుల్ గ్రామానికి చెందిన సాక్షి దినపత్రిక సీనియర్ రిపోర్టర్ పరశురామ్ జన్మదిన వేడుకలు



స్థానికంగా ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గ్రామ ఉపసర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి ఆయనకు కలిసి శాలువాతో సత్కారం చేసి అనంతరం ?పరశురామ్ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి మరియు బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ జర్నలిస్టుగా పరశురామ్ సమాజానికి అందిస్తున్న సేవలు ఎంతో అభినందనీయమన్నారు. నిరంతరం ప్రజా సమస్యలను వార్తల రూపంలో అధికారుల దృష్టికి తీసుకెళ్తూ ప్రాంతీయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నారని కొనియాడారు. ఆయన మరెన్నో పుట్టినరోజులు జరుపుకుంటూ, ఆయురారోగ్యాలతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, తోటి జర్నలిస్టులు మరియు స్థానికులు పాల్గొని పరశురామ్‌కు శుభాకాంక్షలు అందజేశారు.

# గ్రేటర్ ఎన్నికలకు గులాబీ ప్లాన్

హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, భాగ్య నగర రాజకీయం అప్పుడే వేడెక్కింది. జీహెచ్ఎంసీ పీఠంపై మరోసారి గులాబీ జెండాను ఎగురవేయడమే లక్ష్యంగా బీఆర్ఎస్ తన వ్యూహాలకు పదును పెడుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అధిక స్థానాలను సాధించి తన పట్టును నిరూపించుకున్న బీఆర్ఎస్, అదే జోష్‌తో మున్సిపల్ ఎన్నికల బరిలోకి దిగేందుకు సమాయత్తమవుతోంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వయంగా రంగంలోకి దిగి, ఓటర్ల జాబితా సవరణ నుంచి సభ్యత్వ నమోదు వరకు ప్రతి అంశాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటూ కేడర్‌కు దిశానిర్దేశం చేస్తున్నారు. గత ఎన్నికల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, తమ పార్టీ సానుభూతిపరులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి గల్లంతు కాకుండా బీఆర్ఎస్ పకడ్బందీ చర్యలు చేపట్టింది. కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియపై పార్టీ శ్రేణులను పూర్తిగా అలర్ట్ చేసింది. ఈ నెల 25 నుంచి ఈ ప్రక్రియ రాష్ట్రంలో ప్రారంభం కానుండటంతో, ప్రతి డివిజన్, పోలింగ్ బూత్ పరిధిలో ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలని కేటీఆర్ ఆదేశించారు. అయితే, ఈ ప్రక్రియను మానిటరింగ్ చేసేందుకు బూత్ లెవెల్ ఏజెంట్ల లిస్ట్ ఇవ్వాలని అధిష్టానం ఆదేశించగా, మొత్తం 119 నియోజకవర్గాల్లో 38 నియోజకవర్గాల నుంచి ఇంకా లిస్ట్ అందకపోవడంపై ఇటీవల పార్టీ అధినేత కేసీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిని సీరియస్‌గా తీసుకున్న కేటీఆర్.. గ్రేటర్ హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలకు చెందిన ముఖ్య నేతలతో అత్యవసర సమావేశం నిర్వహించారు. గులాబీ క్యాడర్ బలంగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలని స్పష్టం చేశారు. కొత్త ఓటర్ల నమోదు, తప్పుల సవరణ, అర్హులైన ఓటర్ల వద్ద అవసరమైన అర్హత పత్రాలు ఉండేలా చూసే బాధ్యతను ఈ బీఎల్ఏలకు అప్పగించారు. 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో బీఆర్ఎస్ అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంది. గతంలో వరుసగా రెండు సార్లు గ్రేటర్ మేయర్ పీఠాన్ని కూడా దక్కించుకుంది. ఈ నేపథ్యంలో ఎస్ఐఆర్ ప్రక్రియ వల్ల ఈ జిల్లాల్లోని ఓటర్లు ఎక్కువగా ప్రభావితం అయ్యే అవకాశం ఉందని భావించి, ముస్లిం మైనారిటీ ఓటు బ్యాంకుపై పార్టీ ప్రత్యేక దృష్టి సారించింది. పాతబస్తీ మినహా మిగిలిన అన్ని ప్రాంతాల్లో మైనారిటీలు బీఆర్ఎస్ వైపే నిలిచారు. అందుకే, తమ పార్టీ ఎమ్మెల్యేలు ఉన్న చోటా, లేని చోటా బూత్ ల వారీగా బీఎల్ఏ లను నియమించి సానుకూల ఓట్లను కాపాడుకునేందుకు క్షేత్రస్థాయి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకు వేచి చూడకుండా, ప్రజల్లోనే ఉండాలని మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, డివిజన్ ఇంచార్జీలను కేటీఆర్ ఆదేశించారు. గ్రేటర్ పరిధిలోని ప్రధాన సమస్యలైన డ్రైనేజీ



వ్యవస్థ లోపాలు, తాగునీటి ఎద్దడి, దెబ్బతిన్న రోడ్లు, స్థానిక మౌలిక వసతుల కల్పనలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు లాంటి వాటిని ఎండగడుతూ ప్రజల్లోకి వెళ్లాలని దిశానిర్దేశం చేశారు. తెలంగాణ భవన్ వేదికగా కేటీఆర్ ఈ మొత్తం వ్యవహారాన్ని స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. దీనితో పాటు, డిజిటల్ పద్ధతిలో ప్రతి ఇంటిని టచ్ చేస్తూ ముమ్మరంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించాలని స్పష్టం చేశారు. ఎన్నికలకు ముందే వ్యూహాత్మక అడుగులు వేస్తూ, కేడర్‌లో జోష్ నింపుతున్న గులాబీ బాస్ ల చర్యలు గ్రేటర్ రాజకీయాల్లో సరికొత్త వేడిని పుట్టిస్తున్నాయి. రాబోయే మున్సిపల్ పోరులో గ్రేటర్ కోటపై మళ్లీ గులాబీ జెండా ఎగురుతుందో లేదో చూడాలి.

## లులు హైపర్ మార్కెట్ లో నాసిరకం నిల్వలు

### - పలు ఆహార పదార్థాలతో పురుగులు

హైదరాబాద్ : కూకట్పల్లి లులు హైపర్మార్కెట్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు జరిపారు. పలు ఆహార పదార్థాల్లో పురుగులు, నాసిరకం నిల్వలు గుర్తించారు. కిచెన్లో అపరిశుభ్రత, పాడైపోయిన కూరగాయలు, పురుగుల సంచారం వెలుగులోకి వచ్చాయి. గడువు సమీపించిన ఆహార పదార్థాలపై తప్పుదారి పట్టించే లేబుళ్లు వున్నట్లు అధికారులు గుర్తించారు. శనగపిండి, ఆటా, పప్పుల్లో పురుగులను గుర్తించారు. గడువు ముగిసిన ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్తో ప్యాక్డ్ ఫుడ్ విక్రయం నడుస్తోంది. మాంస వ్యర్థాలతో మూసుకుపోయిన డ్రెయిన్లు వున్నాయి. సుమారు 150 కిలోల ఆహార పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. కల్తీ, అధిక కృత్రిమ రంగుల అనుమానంతో ఆహార నమూనాలు సేకరించారు.

## కవాడిగూడలో మహిళ దారుణ హత్య

హైదరాబాద్ : నగరంలోని గాంధీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కవాడిగూడలో ఓ మహిళ దారుణ హత్యకు గురైంది. కవాడిగూడలోని రత్నదీప్ బిల్డింగ్ నాలుగో అంతస్తులో శ్వేత అనే మహిళను గుర్తుతెలియని వ్యక్తి కత్తితో పొడిచి హత్య చేసి పరారయ్యాడు. సమాచారం అందుకున్న వెంటనే గాంధీనగర్ పోలీసులు, క్లూస్ టీం సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఘటనకు సంబంధించిన ఆధారాలను సేకరిస్తూ దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా నిందితుడి వివరాలను గుర్తించే ప్రయత్నం చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఆరోగ్యం క్షీణించి ఒకరి మృతి

కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 20 ప్రజాకలం : కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం లోని అడివి లింగాల గ్రామానికి చెందిన తుమ్మల సాయిలు అనే వ్యక్తి అలనా పాలన చూసేవారు లేక ఆరోగ్యం క్షీణించి రోడ్డు పక్కన మరణిం చినట్లు ఎస్ఐ ఎన్ రాజు తెలిపారు. ఆయన తెలిపిన




ప్రకా రం వివరాలు ఇలా ఉన్నాయి. అడవి లింగాల గ్రామానికి చెందిన తుమ్మల సాయిలు చిన్న కుమార్తె స్రవంతి ఆరోగ్యం బాగాలేక అతడి భార్య సుశీల చికిత్స నిమిత్తం ఆమెను తీసుకొని ఈనెల 5వ తేదీన హైదరాబాద్ కు వెళ్ళింది. అప్పటి నుండి మృతుడు గ్రామంలో ఒంటరిగా ఉంటూ పాత సామాన్లు ఏరుకొని జీవిస్తున్నాడు. ఈ క్రమంలో అతడికి సమయానికి ఆహారం లేక ఆరోగ్యం మరింతగా క్షీణించింది. బుధవారం ఎల్లారెడ్డి పట్టణంలోని సొసైటీ బ్యాంకు సమీపంలో రోడ్డు పక్కన మృతి చెంది ఉన్నాడు. అటువైపు వెళుతున్న ప్రయాణికులు ఇది గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం పోలీసులతో భార్యకు సమాచారం ఇవ్వగా వచ్చి స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఆర్టిఐ యాక్ట్ స్టేట్ కమిషనర్ ను కలిసిన రాష్ట్ర కార్యదర్శి రాజు

కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 20 ప్రజా కలం : రాష్ట్ర సమాచార కమిషనర్ పీవీ శ్రీనివాస్ రావు ని వారి కార్యాలయంలో సమాచార హక్కు చట్టం రాష్ట్ర కార్యదర్శి లెగ్గేల రాజు బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం అందజేశారు...అనంతరం రాజు సమాచార హక్కు చట్టానికి సంబంధించి పలు అంశాలు కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం - 2005 బోర్డులు పెట్టడం లేదని, బోర్డులు ఉన్న చోట



అధికారులు వివరాలు లేవు అని సమాధానం ఇస్తున్నట్లు తెలిపారు. సమాచార హక్కు చట్టం -2005 కింద దరఖాస్తు చేస్తే 30 రోజులలో ఇవ్వాల్సిన సమాచారం ఇవ్వడం లేదని, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. దరఖాస్తు దారునికి సరైన సమాచారం ఇవ్వడం లేదని, తప్పుడు సమాచారం ఇస్తూ ఆర్టీఐ చట్టాని కాలరాస్తున్నారన్నారు. రికార్డ్స్ లేవు, రిజిస్టర్స్ లేవు అని పేర్కొంటూ ఆర్టీఐ కింద దరఖాస్తు చేసుకునే వారి వివరాలు గోప్యంగా ఉంచకుండా, వారి వివరాలు అధికారులు అందరికీ తెలిసేలా చేస్తున్నారన్నారు. ఈ విషయమై చాలా మంది దరఖాస్తు దారులు రాష్ట్ర కమిషన్ వరకు రాలేక పోతున్నారని, ఆర్టీఐ చట్టాని నిర్వీర్యం చేసే విధంగా వ్యవహరించే వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారికంగా ప్రతి మండల స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించే విధంగా కమిషన్ దృష్టి పెట్టాలని కోరారు.

## ఉప్లూర్ గ్రామంలో సీసీటీవీ కెమెరాలపై అవగాహన సదస్సు

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) మే 20:

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు "మన ఊరు - మన భద్రత, మన బాధ్యత" కార్యక్రమంలో భాగంగా బుధవారం కమ్మర్‌పల్లి మండలంలోని ఉప్లూర్ గ్రామంలో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు, వాటి ప్రయోజనాలపై గ్రామ ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమ్మర్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ జి. మధుకర్ (ఎజ-2810) గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడారు. సీసీటీవీ వ్యవస్థలు 24 గంటల నిఘా ద్వారా సంఘ వ్యతిరేక కార్యకలాపాలను నిరోధించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన తెలిపారు. అలాగే నేరాల నియంత్రణ, దర్యాప్తులో పోలీసులకు ఇవి ఎంతో సహాయపడతాయని వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా "కమ్యూనిటీ పోలీసింగ్" వ్యవస్థను మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. గ్రామంలో భద్రతను పెంపొందించేందుకు ప్రజలు తమ ఇళ్ల వద్ద, వ్యాపార సంస్థల సముదాయాల వద్ద స్వచ్ఛందంగా సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఆయన ఈ సందర్భంగా గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు




## ఆర్మూర్ లో విశ్రాంత ఉద్యోగుల ద్వితీయ కార్యవర్గ సమావేశం




నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) మే 20 :

ఆర్మూర్ పట్టణ కేంద్రంలో విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో ద్వితీయ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆర్మూర్ యూనిట్ అధ్యక్షులు రాజేశ్వర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి పెన్షనర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మోహన్ రావు, జిల్లా కార్యదర్శి కరుణాసాగర్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పుష్కర్ రావు,యూనిట్ ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్,ఆర్థిక కార్యదర్శి నవజీవన్,గౌరవాధ్యక్షులు రాం రెడ్డి పాల్గొన్నారు. యూనిట్ కార్యదర్శి జ్ఞానేశ్వర్ కార్యదర్శి నివేదికను చదివి వినిపించారు. ఆర్థిక కార్యదర్శి నవజీవన్ ఆర్థిక నివేదికను చదివి వినిపించారు. హాజరైన సభ్యుల చప్పట్లతో రెండు నివేదికలను ఆమోదించడం జరిగింది. ఈ సందర్భంగా సభాధ్యక్షులు రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్నామన్నారు. ఉద్యోగ విరమణ పొందుతున్న ఉద్యోగులు సంఘ సభ్యత్వాన్ని తీసుకోవాలని పెన్షనర్స్ ప్రతి విషయంలో సంఘం సహకారం ఉంటుందని,ఆర్మూర్లో ప్రతీ నెలా ఐ క్యాంపులు నిర్వహించడం జరుగుతుందని, పెన్షనర్స్ జన్మదినోత్సవ వేడుకలు, పెన్షన్ నిలుపుదల చేయబడిన వారి బిల్లులు,అంత్యక్రియల బిల్లులు ఇప్పించడం. జీవన ప్రమాణ పత్రాన్ని ఆఫీసులోనే అందరికీ అందుబాటులో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈహెచ్ ఎస్ కార్డులు ఈ నెల 31 వరకు సబ్మిట్ చేయవలసి ఉన్నందున సభ్యులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సబ్మిట్ చేయడానికి తగిన ఏర్పాట్లు చేస్తామన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మోహన్ రావు లు మాట్లాడుతూ సంఘం పది కాలాలపాటు చిరస్థాయిగా నిలవాలంటే సభ్యులు ఐకమత్యంగా ఉంటే దేనినైనా సాధించవచ్చన్నారు. ఐక్యతతో ఇలాగే కార్యక్రమాలు నిర్వహిద్దామని, ఈ హెచ్ ఎస్ కార్డుల సమాచారం సేకరణ విషయంలో సభ్యులకు ఇబ్బంది కలగకుండా చూసుకోవాలన్నారు. ప్రభుత్వ పరంగా మనకు రావలసిన పీఆర్సీ, ఈ. హెచ్.ఎస్ కార్డులు,డి.ఏ లను తక్షణం విడుదల చేయించడానికి కృషి చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ యూనిట్ కార్యవర్గ సభ్యులు అసోసియేట్ అధ్యక్షులు గంగారెడ్డి,ఉపాధ్యక్షులు కోటేశ్వర్,సుధాకర్,సహాయ కార్యదర్శి గంగాధర్,ఆర్గనైజింగ్ సెక్రటరీ హరి నారాయణ,పబ్లిసిటీ సెక్రటరీ జింధం నరహరి,జిల్లా కౌన్సిలర్లు ఎం సి ఓబన్న,దశరథ్,భూమన్న, ఆడిటర్స్ ముత్తన్న, సుదర్శన్, గేమ్స్ సెక్రటరీ కరాటే భోజన్న తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ముంబై ప్రైవేటు బస్సుల అరాచకాలపై బీఎస్పీ ఆందోళన




నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) మే 20:

ముంబై నుంచి తెలంగాణలోని ఉమ్మడి నిజామాబాద్ కరీంనగర్ జిల్లాలకు వెళ్లే పలు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల యాజమాన్యం యాత్రికులపై అరాచకంగా ప్రవర్తిస్తున్నారని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) ముంబై పరేల్లోని ఎస్.టి స్టాండ్ వద్ద నిరసన నిర్వహించారు. ఐతే ప్రతిరోజు కమర్షియల్ సామాన్లు పరిమితికి మించి బస్సుల్లో నింపడం, విపరీతంగా టికెట్ల ధరలు పెంచడం, ప్రయాణికులతో దురుసుగైతే, కొందరిపై దాడులకు పాల్పడడం, ముఖ్యంగా స్త్రీలు మధ్యలో బస్సు ఆపమని కోరినా పట్టించుకోరు, పలు డ్రైవర్లు తప్పాతాగి బస్సు నడపడం, వీటివల్ల ఎన్నో బస్సులు దుర్ఘటనలకు పాలవుతున్న విషయం తెల్సిందేనని, ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయని ప్రయాణికులు ఆరోపించారు. ఇలాంటి అరాచకాలను వెంటనే అరికట్టాలని వారు అన్నారు. ఇట్టి సమస్యలపై బీఎస్పీ మహారాష్ట్ర కార్యదర్శి నాగసేన్ మాలజీ నల్ల జెండాలతో భారీ ఆందోళన చేపట్టారు. ట్రావెల్స్ యాజమానుల దౌర్జన్యాలను అరికట్టేందుకు ఆర్.టి.ఓ అధికారులు, 2రాష్ట్రాల ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని మాలజీ డిమాండ్ చేశారు. బీఎస్పీ స్థానిక నేతలైన కృపాశంకర్ జెస్వార్, జంగం లింగోజి మాల, శ్రీనివాస్ చారి, ములుగు లింగం, దోనపాల సాయిలు మహరాజ్, సీతగణేష్ పద్మశాలి, చాంద్ అహ్మద్, గాజుల రవీందర్, రంజిత్ జెస్వార్, తోగరి రాధ, ఏ.శంకరమ్మ, దుబ్బ రాజవ్వ లతోపాటు యాత్రికులు పాల్గొని నినాదాలు చేశారు.

## అక్రమ ఇసుక రవాణాపై చీతా ఫోర్స్ మెరుపు దాడి

### 11 వాహనాలు సీజ్- నిజామాబాద్ పోలీస్ కమీషనర్ పి.సాయి చైతన్య వెల్లడి




నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) మే 20:

జిల్లాలో అక్రమ ఇసుక రవాణా, ప్రకృతి వనరుల దోపిడీపై నిజామాబాద్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. పోలీస్ కమీషనర్ పి.సాయి చైతన్య, ఐ.పి.ఎస్ గారి ఆదేశాల మేరకు, సీ.సీ.ఎస్ ఏసీపీ మస్తాన్ అలీ ఆధ్వర్యంలో బుధవారం చీతా ఫోర్స్ సిబ్బంది జిల్లా వ్యాప్తంగా అక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి మెరుపు దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా రెండు వేర్వేరు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఒక జేసీబీ, 10 ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

నాళేశ్వర్‌లో జేసీబీ, 5 ట్రాక్టర్ల గుర్తింపు:

నందిపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నాళేశ్వర్ గ్రామ వాగు ప్రాంతంలో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నట్లు అందిన నమ్మదగిన సమాచారంతో చీతా ఫోర్స్ టీం మెరుపు దాడి చేసింది. అక్కడ జేసీబీ సహాయంతో వాగు నుండి ఇసుకను తవ్వి ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. దాడిలో ఒక జేసీబీ యంత్రంతో పాటు ఐదు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వాహనాలను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం నందిపేట్ పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ గారికి అప్పగించారు. నవీపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తాళ్లవేద గ్రామ వాగులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు అక్కడ కూడా తనిఖీలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తున్న 5 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని, తదుపరి చర్యల నిమిత్తం నవీపేట్ పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ గారికి అప్పగించారు. అక్రమ ఇసుక రవాణా, ప్రకృతి వనరుల దోపిడీపై కఠిన చర్యలు కొనసాగుతాయని పోలీస్ కమీషనర్ హెచ్చరించారు.

ప్రజలు తమ ప్రాంతాల్లో ఎక్కడైనా ఇలాంటి అక్రమ కార్యకలాపాలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడుతాయని పోలీసులు సూచించారు.



## ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఎంపీడీవో

కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 20 ప్రజా కలం : కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం లోని లక్ష్మాపూర్ గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం స్థానిక ఎంపీడీవో తాహెరా బేగం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధిక ఉష్ణోగ్రతల



దృష్ట్యా ఉదయం 6 గంటల నుండి 11 గంటల లోపే పనులు చేసేలా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్ కు సూచించారు. అలాగే కొలతల ప్రకారం తప్పని సరిగా పనిచేయించాలని, కూలీల సంఖ్యను మరింతగా పెంచాలన్నారు. ఆమె వెంట ఎంపీ ఓ ప్రకాష్, ఈజీఎస్ ఏపీవో వినోద్ గౌడ్, సర్పంచ్ నాయక మంజుల సాయిలు, ఫీల్డ్ అసిస్టెంట్, కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు సంతోష్ నాయక్, తదితరులున్నారు.

## అంగన్వాడీలకు ఏప్రిల్ నెల వేతనం వెంటనే చెల్లించాలి

కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 20 ప్రజా కలం : అంగన్వాడి కార్యకర్తలు, హెల్పర్లకు ఏప్రిల్ నెల వేతనం వెంటనే విడుదల చేయాలని కోరుతూ బుధవారం అంగన్వాడి యూనియన్ ఆధ్వర్యంలో తమ సమస్యలను



ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు కు తెలియజేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నేతలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి నెల ఒకటో తేదీన వేతనం చెల్లించేలా చూడాలన్నారు. ఐసిడిఎస్ ను బలోపేతం చేయాలని, ప్రీ ప్రైమరీ పీఎం శ్రీవిద్యను అంగన్వాడీలకే కేటాయించాలన్నారు. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు దేవ కరుణ, సాయవ్వ, ప్రశాంతి, తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన ఓటర్ల జాబితా తయారీకి సహకరించాలి

### - రాజకీయ పార్టీల నేతలకు ఆర్డిఓ సూచన

కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 20 ప్రజా కలం : నాణ్యమైన ఓటర్ల జాబితా తయారీకి అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని



ఎల్లారెడ్డి ఆర్డిఓ ప్రభాకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో స్పెషల్ ఇంటెన్సీ రివిజన్ (ఎస్ ఐ ఆర్) కి సంబంధించి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నేతలతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ ఐ ఆర్ షెడ్యూల్, విధానాల గురించి వారికి వివరించారు. బూత్ స్థాయి ఏజెంట్ల వివరాలు ఇవ్వాలని ఆయన వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ప్రేమ్ కుమార్, కాంగ్రెస్, బిజెపి, బీఆర్ఎస్, బీఎస్పీ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## గ్రామాలను సందర్శించిన ఎం.పీ.డీ.వో అబ్దుల్ అజీమ్

**కూలీలకు సరిపడా మంచినీటిని అందుబాటులో ఉంచాలి....**

**కార్యదర్శులను ఆదేశించిన ఎం.పీ.డీ.వో.**

**ఉపాధి పనుల్లో వేగవంతం చేయాలి.**

రంగారెడ్డి జిల్లా, మంచాల మండలం, మే 21 ప్రజా కలం:

మంచాల మండలం నాగపల్లి కాగజ్ ఘాట్ జాపాల్ గ్రామాలను పర్యటించి ఉపాధి హామీ పనుల ను మండల అభివృద్ధి అధికారి అబ్దుల్ అజీమ్ పరిశీలించారు. పెరిగిన ఎండల దృశ్య ఉపాధి కార్మికులకు సరిపడా మంచినీటిని అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. కూలీల సంఖ్య పెంచి పనులు వేగవంతం చేయాలని తెలిపారు. ఉదయం ఐదు గంటలకు ప్రారంభించిన ఉపాధి హామీ పనులను 10 గంటల వరకే నిర్వహించాలని చెప్పారు. ఈ సందర్భంగా పల్లె ప్రకృతి వనం, నర్సరీలు సందర్శించి పలు సూచనలు చేశారు. మండల అభివృద్ధి అధికారి అబ్దుల్ తో సర్పంచ్ లు,కార్యదర్శులు అనిల్ ,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





# కేవీటీ స్పోర్ట్స్ క్లబ్స్ 37 వ వార్షికోత్సవాలు

భూదాన్ పోచంపల్లి మే 20 ( ప్రజా కలం )

కేవిటి స్పోర్ట్స్ క్లబ్ 37వ వార్షికోత్సవాలు, కర్నాటి వెంకటేశం 59వ జయంతి ఉత్సవాలు కేవిటి కోవెలలో అధ్యక్షులు కర్నాటి వెంకట బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ కేవిటి స్పోర్ట్స్ క్లబ్ గత 37 సంవత్సరాలుగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, విద్య,వైద్య సంక్షేమలు , రాష్ట్ర ప్రభుత్వం చేత అవార్డులు స్వీకరించిందని తెలియజేశారు. ఈ సంవత్సరం కేవిటి వ్యవస్థాపక అధ్యక్షులు అయినటువంటి కీర్తిశేషులు కర్నాటి భాస్కర్ స్మారకార్థకం కి 50 మంది పేదలకు బియ్యం పంపిణీ చేశారు. ఈ క్లబ్ కార్యక్రమానికి పెద్దల సహకారంతో కమిటీ సభ్యుల సహకారంతో నిర్వహిస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు ఏలే ఉమా శంకర్, సీత శ్రీనివాస్, ప్రకాష్, తడక విష్ణు, భాస్కర్, కర్నాటి ప్రభాకర్, గడ్డం దేవకి నందన్, వలందాస్ మహేష్, రాజా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్.ఎస్.యు.ఐ నియోజకవర్గం అధ్యక్షునిగా ఆయాన్ పటేల్

## ఎమ్మెల్యే చేతుల మీదుగా నియామక పత్రం

రంగారెడ్డి జిల్లా,ఇబ్రహీంపట్నం మే 21 :

ఎన్.ఎస్.యు.ఐ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అధ్యక్షునిగా ఆయాన్ పటేల్ నియామకం అయ్యారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఆయా మండల అధ్యక్షులను,మున్సిపల్



డివిజన్ల అధ్యక్ష కార్యదర్శుల నియామకాలు చేపట్టారు.అందులో భాగంగా బుధవారం ఎన్.ఎస్.యూ.ఐ నియోజకవర్గం అధ్యక్షునిగా మహమ్మద్ అయాన్ పటేల్ ను నియమిస్తూ,ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా అయాన్ పటేల్ కు ధ్రువపత్రం అందించారు.తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను శ్రద్ధతో సమర్థవంతంగా నెరవేరుస్తానని, నమ్మకాన్ని వమ్ము చేయనని అయాన్ పటేల్ అన్నారు.

# కొంపల్లి సర్కిల్ 56 లో జనగణన సమీక్షించిన డిప్యూటీ కమిషనర్.

ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) కొంపల్లి సర్కిల్–56 పరిధిలో భారత జనగణన కార్యక్రమం సజావుగా సమర్థవంతంగా కొనసాగుతున్నదని సెన్సస్ అధికారి, కొంపల్లి డిప్యూటీ కమిషనర్ డి.లావణ్య తెలిపారు. బుధవారం కొంపల్లి సర్కిల్–56 పరిధిలో మొత్తం 218 ఎన్యుమరేషన్ బ్లాకులు (ఈబిఎస్) ఉన్నాయని, ప్రతి ఎన్యుమరేషన్ బ్లాక్‌లో నియమితులైన ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజల వివరాలను సేకరిస్తున్న అధికారుల ఇబ్బంది పనితీరును సమీక్షించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ... అన్ని ఎన్యుమరేటర్లు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం విధులు నిర్వహిస్తున్నారని, డేటా సేకరణలో ఎటువంటి లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వెల్లడించారు. ఫీల్డ్ సందర్శన సమయంలో ఎన్యుమరేటర్లకు అవసరమైన సూచనలు, సలహాలు మార్గదర్శకాలు ఇవ్వబడినట్లు తెలిపారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడంతో పాటు ఖచ్చితమైన సమాచారం సేకరించాలని సూచించారు. ప్రతి వివరాన్ని యాప్‌లో సకాలంలో నమోదు చేసి సింక్ చేయాలని ఆదేశించారు. ఏవైనా సాంకేతిక సమస్యలు ఎదురైన వెంటనే ఉన్నతాధికారులకు తెలిపి పరిష్కరించాలి.కొంపల్లి సర్కిల్ ప్రజలకు సెన్సస్ అధికారి ప్రత్యేక విజ్ఞప్తి చేశారు. జనగణన సిబ్బంది ఇంటికి వచ్చినప్పుడు ప్రజలు సరైన వివరాలు అందించి పూర్తి సహకారం అందించాలని కోరారు. జనగణన ద్వారా ప్రభుత్వానికి ఖచ్చితమైన గణాంకాలు అందుబాటులోకి వస్తాయని, భవిష్యత్ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల రూపకల్పనలో ఈ సమాచారం ఎంతో ఉపయోగపడుతుందన్నారు





# ప్రభుత్వం వివోఏల సమస్యలు పరిష్కరించాలి

వలిగొండ మే 20 ప్రజాకలం:వలిగొండ మండలంలో ఐకేపీ (సెర్ప్) పరిధిలో పనిచేస్తున్న వీవోఏలు తమ పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ఐకెపి వివోఏల రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు,బుధవారం మండల కేంద్రంలో మండల మహిళా సమాఖ్య భవనం ఆవరణలో ధర్నా కొనసాగించారు.

ఈ సందర్భంగా పలువురు వీవోఏలు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు.చాలీచాలని వేతనాలతో తమ కుటుంబాలను నెట్టుకొస్తున్నామని,కనీస వేతనం కూడా ఇవ్వకుండా ప్రభుత్వం తమను వెట్టి చాకిరి చేయిస్తుందని తెలిపారు.ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.వీవోఏల ప్రధాన డిమాండ్లలో నెలకు రూ.20 వేల వేతనం అమలు,సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్ఆర్ పాలసీ అమలు, అర్హులైన వీవోఏలను సీసీలుగా ప్రమోట్ చేయడం,రూ.20 లక్షల భీమా సౌకర్యం కల్పించడం,ట్యాబ్ సౌకర్యం అందజేసి,జీవో 58 ను సవరించాలన్నారు.ఈ కార్యక్రమంలో వివోఏల మండల అధ్యక్షురాలు చేగురి బాలమణి,కార్యదర్శి మద్దెల ఇందిర,బత్తిని వనజ,జంగం సైదమ్మ,అనపర్తి బిక్షపతి, బంధారపు ధనుంజయ,కల్లూరి నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

# గడప గడపకు బిజెపి సంకల్ప యాత్ర 16వ రోజు

ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ పరిధిలో ఇంద్ర నగర్ 16వ రోజు గాజులరామారం డివిజన్ మాజీ కార్పొరేటర్ బిజెపి స్టేట్ మున్సిపల్



సెల్ కో కన్వీనర్ రావుల శేషగిరి చేపట్టిన సంకల్పయాత్ర గడప గడపకు బిజెపి కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా ప్రతి ఇంటినీ సందర్శించి, కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ప్రజల ఆశీస్సులు, మోదీ పాలనపై వారి నమ్మకం అద్భుతం కొనియాడారు. ఈకార్యక్రమంలో పి.శ్రీనివాస్ రెడ్డి, రావుల రాజు, మహేందర్ రెడ్డి, కోకాకోల శ్రీనివాస్, చిన్న మురళి, సత్యనారాయణ, మంజునాథ్, కార్తీక్, రాజగోపాల్ రెడ్డి, మహేష్, చరణ్, ఇంద్రనగర్ బస్తీ వాసులు అరుణ్, జి.పింటు శర్మ, బసవరాజ్, సాంబశివరావు, దీపక్, రాజేష్, ఎస్.ఎస్ గుప్తా, అజమ్, అజిత్, ఆదర్శ్, కే ఎన్ రామ్, మాస్టర్ జి, నాగరాజు, నాయకులు కాలనీవాసులు పాల్గొన్నారు.

# దుండిగల్ పిఎస్ లో పోక్సో కేస్ నమోదు

ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) బాలికలపై రోజురోజుకు మాన భంగాలు, హత్యలు అధికమౌవడం ఆందోళన కలిగిస్తుంది. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ పోక్సో కేసు ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. బండి భగీరథ్ కేసు మరువక ముందే దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో మరో పోక్సో కేసు సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రెండు రోజుల క్రితం బాధిత బాలిక తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, నిందితులను అరెస్ట్ చేసి విచారణ ప్రారంభించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... దుండిగల్ గ్రామానికి చెందిన దార శివకుమార్ ఆలియాస్ మట్టు(20) గత కొంతకాలంగా దుండిగల్ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల దగ్గర టెంట్ హౌస్ లో పనిచేస్తున్నాడు. 2025 సెప్టెంబర్ నెలలో డబుల్ బెడ్ రూమ్ దగ్గర టెంట్ హౌస్‌లో పనిచేస్తున్న అతనికి అటుగా వెళ్తున్న మైనర్ బాలికపై కన్ను పడింది. అదునుగా భావించిన అతను మైనర్ బాలికను ఫాలో అయ్యాడు. ఎవరికైనా చెబితే చంపేస్తామంటూ బెదిరింపులు పాల్పడ్డాడు. దుండిగల్ డబుల్ బెడ్ రూమ్‌లో ఆమె వివరాలు తెలుసుకున్న దార శివకుమార్ అదును కోసం వేచిచూశాడు. మూడు రోజుల అనంతరం బాలిక తల్లిదండ్రులు ఇంట్లో లేని విషయాన్ని గ్రహించిన నిందితుడు బాలిక ఇంట్లోకి చొరబడి బాలికను పర్సనల్ పార్ట్స్‌పై టచ్ చేసిన అతను అనంతరం.. బాలికను బలవంతంగా రేప్ అటెంప్ట్ చేసినట్లు పోలీసు విచారణలో తేలింది. ఎవరికైనా చెపితే చెంపేస్తానంటూ బెదిరించడంతో బాధిత బాలిక ఎవరికి చెప్పలేదు. అదే నెలలో మరోసారి అతని స్నేహితుడు దుండిగల్‌కు చెందిన నిజాంపేట్ రాము ఆలియాస్ రామ్(30)తో కలిసి ఇద్దరు మరోసారి బలవంతంగా రేప్ అటెంప్ట్ చేశారు. నిత్యం చిత్రహింసలకు గురిచేస్తుండంతో బాధిత బాలిక తల్లిదండ్రులకు ఐదు రోజుల క్రితం జరిగిన విషయం చెప్పింది. ఆందోళనకు గురైన బాలిక తల్లిదండ్రులు ఈ నెల 17న దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు ఈ నెల 20న ఉదయం 7.30 గంటలకు నిందితులను అరెస్ట్ చేశారు. నిందితులపై పోక్సో కింద కేసు నమోదు..

నిందితులు దుండిగల్‌కు చెందిన దార శివకుమార్ ఆలియాస్ మట్టు(20), నిజాంపేట రాము ఆలియాస్ రామ్(30) లను అరెస్ట్ చేసిన పోలీసులు వారిపై సెక్షన్ 64(2),(ఎం),351(2),రెడ్ విత్ 2(5),బి ఎన్ ఎస్ అండ్ 5(1),రెడ్ విత్ 6 పోక్సో యాక్ట్ 2012 ప్రకారం.. నిందితులపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.



# ఆభటంగా టీఆర్ఎస్ జెండా పండగ, పార్టీ జెండాను ఎగర వేసిన తాండ్ర.శ్రీనివాస్ రావు

ఆల్వాల్: మే 21: ప్రజా కలం ప్రతినిధి

తెలంగాణ రక్షణ సేన జెండా పండుగ కార్యక్రమం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని ఆల్వాల్ సర్కిల్ లో ఐజి విగ్రహం దగ్గర తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకులు తాండ్ర.శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో ఘనంగా ఎగురేసినాడు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన (TRS)రాష్ట్ర నాయకులు కల్వకుంట్ల.కోటేశ్వరరావు, ప్రశాంత్ చారీ, పుసకూరి శ్రీకాంత్ రావు, మేక లలిత యాదవ్, శశిధర్,పడాల మనోజ,శోభన్, పుల్లూరు శ్రీనివాస్ రావు, విజయలక్ష్మి, పద్మజ,అఖిలేష్ రెడ్డి, రాంరెడ్డి, జంగిటి శ్రీనివాస్ మరియు తెలంగాణ రక్షణ సేన నాయకులు తదితరులు పాల్గొన్నారు..

# బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఏసీబీ దాడి

## - లంచం తీసుకుంటూ దొరికిపోయిన మహిళా ఎస్సై, కానిస్టేబుల్

కంటోన్మెంట్: మే 20 :ప్రజా కలం ప్రతినిధి

ఒక కేసు విషయంలో ఇబ్బందులు పెట్టకుండా ఉండేందుకు రూ. 30 వేలు లంచం డిమాండ్ చేసి, ఆ నగదును తీసుకుంటుండగా బోయిన్‌పల్లి మహిళా ఎస్సై నందిత, కానిస్టేబుల్ విజయ్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఈ ఘటన సికింద్రాబాద్‌లోని బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.అక్కడ విధులు నిర్వహిస్తున్న మహిళా ఎస్సై నందిత అందుకు ప్రతిఫలంగా రూ. 30 వేల లంచం డిమాండ్ చేశారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని బాధితులు వెంటనే ఏసీబీ అధికారులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన ఏసీబీ డీఎస్పీ చలసాని శ్రీధర్, తన బృందంపక్కా ప్లాన్‌తో బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో నిఘా పెట్టారు. బుధవారం పోలీస్ స్టేషన్ ప్రాంగణంలోనే ఎస్సై నందిత ఆదేశాల మేరకు కానిస్టేబుల్ విజయ్ బాధితుల నుండి రూ. 30 వేల నగదును తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా. ఇద్దరినీ పట్టుకున్నారు.



ఫోన్లు స్వాధీనం.. ముమ్మర సోదాలు:

ఎస్సై, కానిస్టేబుల్ పట్టుబడిన అనంతరం ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ నేతృత్వంలో అధికారులు పోలీస్ స్టేషన్‌లో ముమ్మర సోదాలు నిర్వహించారు. స్టేషన్‌లోని సిబ్బంది అందరి సెల్ ఫోన్లను సైతం అధికారులు స్వాధీనం చేసుకుని లంచం వ్యవహారంలో మరెవరికైనా ప్రమేయం ఉందా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు. ఈ దాడితో బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిసరాల్లో ఒక్కసారిగా తీవ్ర కలకలం రేగింది. నిందితుల పై కేసు నమోదు చేసి తదుపరి చర్యలు చేపడుతున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.

# యువ నాయకత్వానికి నాంది పలికిన యూత్ పార్లమెంట్

సిద్దిపేట ప్రజాకలం మే 20.

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట జిల్లా యువజన క్రీడా వ్యవహారాల శాఖ ఆధ్వర్యంలో ఈరోజు సిద్దిపేట ఇండోర్ స్టేడియంలో యువతి, యువకులతో యూత్ పార్లమెంట్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా యువజన క్రీడ వ్యవహారాల అధికారి , జిల్లా విద్యాధికారి ఎల్లంకి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమ నిర్వహణ శిక్షణ సహకార కర్తగా 'జిల్లా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం' వ్యవహరించింది. ఈ సందర్భంగా పార్లమెంటు సమావేశాల వలె జీరో అవర్, క్వశ్చన్




అవర్ బిల్లు ప్రవేశపెట్టే పద్ధతి, ఓటింగ్ , వాదనలు ప్రతి వాదనలు మొదలైన విషయాలతో యూత్ పార్లమెంట్ ఆకట్టుకున్నది. యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొని తమ స్పీచ్ లను వినిపించారు. ఆమె నిజమైన ప్రధానమంత్రి ప్రతిపక్ష నాయకుడు మంత్రులు ఎంపీలుగా వ్యవహరించారు. యూత్ పార్లమెంట్ కార్యక్రమానికి స్పీకర్ గా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు ఎర్రన్నగారి రాంగోపాల్ రెడ్డి వ్యవహరించగా, ప్రధానమంత్రిగా శిరీష, ప్రతిపక్ష నాయకుడిగా రాజు, మంత్రులుగా రసజ్ఞ, ఆనంది, హరికృష్ణ, నగేష్, చందన వ్యవహరించారు. వివిధ పక్షాల ఫ్లోర్ లీడర్లుగా సౌమిత్, తన్వి, అఖిల, సాయి మొదలైన వారు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో దాదాపు 70 మంది యువతి యువకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంతో పాటు విద్యార్థినీ విద్యార్థులకు ,యువతి యువకులకు పెయింటింగ్, డాన్స్ కాంపిటీషన్ నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం తరపున అధ్యక్షులు మామిడి పూర్ణచందర్ రావు, ఉపాధ్యక్షులు బండి సమ్మయ్య, గౌరవ సలహాదారు పబ్బతి శ్రీనాకర్ రెడ్డి, ఇంకేసాఫ్ అలీ పాల్గొన్నారు.జ్యూరీ సభ్యులుగా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు బాలరాజు, డిగ్రీ లెక్చరర్ మనోహర్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ ఉప్పలయ్య, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షురాలు సౌందర్య, ఉపాధ్యాయులు రాధారి నాగరాజు, సాదత్ అలీ, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.



Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by KALAKONDA RAMAKRISHNA, Printed at TEJOMAI PUBLICATION, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013 Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001. Editor: KALAKONDA RAMAKRISHNA, PRGI.No. TELTEL/2010/33275, Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com